సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

117

జూలై 1981

బందగి చిందిన రక్తం
బరిగీసిన ఆరాటం
దొడ్డి కొమురయ్యొకడు
ప్రాణాలొడ్డిన పథమ్ము
కోరన్న మంగన్నలు
కోరాడిన పోరాటం
వహా నెత్తుటు ప్రవహించును

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 20

ఈ సంచిక రు. 2

ఆదిలాబాద్ గిరిజన సహాయనిధి

C/o సృజన, హనుమకొండ, వరంగల్ 506 001

గత సంచికలో ప్రకటించిన విరాళాలు ఒక బంగారు ఉంగరం +	3,231-60
ఈ నెల వసూళ్ళు	
కాకోజీ	100-00
కె. మోహన్‌కుమార్, పారిస్	145-00
పి. ఆర్. రెడ్డి, నెల్లూరు	100 00
సాగర్, కామారెడ్డి	30 00
డి. ఆర్. రావు, కాకినాడ	15-00
హెచ్ ఎం టి ఫ్యాక్టరీ కార్మికులు, శ్రీనగర్	40.00
సి పి డి ఆర్ బొంబాయి ద్వారా	1000-00
కరీంనగర్ జిల్లా 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో	2,915-00
శ్రీకాకుళం జిల్లా ,, ,,	500-00
ఇంద్రవెల్లిపై విజయవాడ అఖిలపక్ష సభలో	257-50
గుంటూరు రాష్ట్ర రైతుకూలీ సంఘం మహాసభలు	41-00
నెల్లూరులో రాష్ట్ర రైతుకూలీ ,, ,, నాలుగు వెండిపట్టీలు +	292 00
వరంగల్ జిల్లా రైతుకూలీ సభ, మహబూబాబాద్	84.00
కడప జిల్లా ,, ,, రాయచోటి	19-35
హైదరాబాద్ ఆర్ ఎస్ యు, ఆర్ వై ఎల్	554 00
అనకాపల్లి నుంచి	2.00
సికింద్రాబాద్ సింగరేణి కార్మికుల సంఘీభావ సభలో	67-30
ఆర్ వై ఎల్ వరంగల్ వసూళ్ళు:	2033 45

కుమార్‌పల్లి(339-00), కుమార్‌పల్లి మార్కెట్(187-60)
కొత్తూరు (280-00), కరీమాబాద్ (100-00),
రామన్నపేట (215 00), గోవిందరాజులగుట్ట,(654-85)
వరంగల్‌కోట(110 00) రంగశాయిపేట(70.00) లేబర్ కాలనీ(77-00)

డాక్టర్ నర్సింహారావు గిర్మాజీపేట వరంగల్ నుండి రు. 500-00 విలువగల మందులు
వర్ధ్యాల, ఆర్ వై ఎల్ ద్వారా రు. 500-00 విలువగల మందులు
డాక్టర్ ఎస్. యుగంధరరావు, వరంగల్ నుండి రు. 500-00 విలువగల మందులు

మొత్తం రు. 11,427-70

ఒక బంగారు ఉంగరం, 4 వెండి పట్టీలు, పదిహేను వందల రూపాయల మందులు

అమానుష పోలీసు హత్యాకాండకు గురైన

ఆదిలాబాదు ఆదివాసులకు సంఘీభావం ప్రకటించండి!

ఇంద్రవెల్లిలో ఏప్రిల్ 20న ప్రభుత్వం జరిపిన దురంతంలో ఆదిలాబాదు జిల్లా గిరిజనులు తల్లడిల్లి పోతున్నారు. ప్రభుత్వం పదముగ్గురే చచ్చారని ప్రకటించి, ఆ శవాలను బంధువులకైనా చూపకుండా బూడిదచేసి, తన నెత్తుటిచేతులు కడిగేసుకున్నా ఇంద్రవెల్లి మృతులసంఖ్య పదులుదాటి వందలోకి పాకుతూనేవున్నది. గాయపడి, నాగరికవైద్యాన్ని తప్పించుకొని అజ్ఞానపు చీకటిబతుకు కనీసం ప్రాణాలను హరించదు అని బతుకుతున్న గిరిజనులు వందల సంఖ్యలోవున్నారు.

అనేక కుటుంబాలు జీవనాధారమైన యువకుల్నీ, పెద్దల్నీ కోల్పోయి బతుకులు ఎలా వెళ్ళదీయాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నాయి. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలూ, గాయపడినవారూ, వారి కుటుంబాలూ ఒకవంక పోలీసుల కిరాతకాల భయానికీ, యింకొకవంక దుర్భర దారిద్ర్యానికీమధ్య నలుగుతూ చెట్టుకొకరు పుట్టకొకరుగా కుములుతున్నారు.

చైతన్యవంతమవుతున్న గిరిజనులనుంచి ప్రభుత్వ తుపాకీకి "భద్రత"ను కూర్చడానికేతప్ప ప్రభుత్వం గిరిజనుల జీవితాలను మెరుగుపరచడానికి ఏమాత్రం సిద్ధంగాలేదు.

ఈ దారుణ విపత్తునుంచి తేరుకొని గిరిజనులు తిరిగి మామూలు మనుషులు కావడానికీ, పోలీసుల కాల్పుల నుంచి మోసాల ప్రకటనలనుంచి బయటపడి, భయ అనుమానాలు పోగొట్టుకొని ధైర్యం, విశ్వాసం పుంజుకోవడానికి తోటి మానవులుగా మనమెంత సహాయ సహకారాలు స్వచ్ఛందంగా అందించగలమనేది గీటురాయి.

అడవి తేనెవంటి స్వచ్ఛమైన, అడవిపూలవంటి హృద్యమైన స్వభావంగల అమాయక గిరిజనులకు యీ కష్ట సమయంలో చేయూతనిచ్చి ఆదుకోవడమూ "మీకు అండగా మేంవున్నాం" అని ఆదివాసులకు ఆసరాగా నిలవడమూ తోటి మానవులుగా మన కనీస ధర్మం.

బాధిత గిరిజనులకు తక్షణ వైద్య సదుపాయం అందించడానికీ, దెబ్బతిన్న కుటుంబాలకు వీలయిన మేరకు పునరావాస సహాయం కల్పించడానికీ "ఆదిలాబాదు గిరిజన సహాయనిధి" సేకరించాలని సంకల్పించాం.

ప్రజాస్వామికవాదులూ, మేధావులూ, ఉదారులయిన ప్రజలు విరివిగా విరాళాలు యిచ్చి తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

వరవరరావు
కన్వీనరు

విరాళాలు పంపించవలసిన చిరునామా :

ఆదిలాబాదు గిరిజన సహాయనిధి, కేరాఫ్ సృజన,
హనుమకొండ, వరంగల్ - 506 001 (ఆంధ్రప్రదేశ్)

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

117 మాసపత్రిక జులై 1981

వచ్చే సంచికలో ధృక్పథాలు

అశాస్త్రీయ పరిచయం - సురా 'రగులుకొనే రాక్షసిబొగ్గు'పై కె. బాలగోపాల్
సాహిత్యం - మార్క్సిజం - సి. రామచంద్రారెడ్డి
సాహిత్యానికి కేంద్రస్థానం హృదయమేనా ?
- సోదుం రామమోహన్ లేఖపై చేకూరి శ్రీనివాసరావు

'ఉప్పెన' సీరియల్ ఉండాలా ?

సృజనలో సీరియల్‌గా వేస్తున్న 'ఉప్పెన' రెండో భాగం పాఠకులెవరూ చదువుతున్నట్టు లేరు. 1973 లో మొదటి భాగం పూర్తయిన ఆరు సంవత్సరాల తర్వాత రెండోభాగం ప్రారంభించడం ఒక కారణం కావచ్చు. అంతే కాకుండా సృజన పాఠకుల్లో కూడా ఎమర్జెన్సీ ముందుతరమూ, తర్వాతతరమూ అంటూ ఏర్పడ్డాయి. ఇవన్నీ మా ఇంప్రెషన్సే కావచ్చు. కాబట్టి సృజనలో రెండో భాగాన్ని సీరియలైజ్ చేయడాన్ని ఆపేయాలని, త్వరలో పుస్తక రూపంలో రెండో భాగమే కాకుండా మొదటి భాగాన్ని కూడా తిరిగి అందించాలని ఆలోచిస్తున్నాం. అయితే సృజనలో సీరియల్‌గా చదువుతున్న పాఠకులకు ఇది అసౌకర్యం కావచ్చు. అందువల్ల ఈ విషయమై పాఠకుల అభిప్రాయాన్ని తెలుసుకోగోరుతూ తాత్కాలికంగా 'ఉప్పెన' సీరియల్‌ను ఆపేస్తున్నాం.

— 'సాహితీమిత్రులు'

బందగీ మొదలుకొని దొడ్డికొమురయ్య వరకు భూస్వామ్యంతో పోరాటంలో చేసిన బలిదానాలు తెలంగాణ రైతాంగ ఉద్యమంలో సాయుధ పోరాటాన్ని అనివార్యం చేసినవి. రైతాంగ పోరాటం బందగీని పీడితులందరి రక్తబంధువుగా మార్చింది. దొడ్డికాడ దొరల పశులుకాస్తూనో, దుక్కిదున్నుతూనో వెట్టిబతుకులు బతికే దొడ్డి కొమురయ్యలకు పోరాటం ఊపిరిపోసి దొడ్డ కొమురయ్యలను చేసింది. దొడ్డి కొము రయ్య బాటలో నాలుగువేలమంది తెలంగాణ రైతాంగ పోరాటంలో అసువులర్పించారు. 'దున్నేవాడికేభూమి'కోసం ఇదివరలో చెమటగా భూమికిచేసిన రక్తతర్పణం ఈ పోరాటంలో రక్తం అర్పించే చేసారు. భూస్వామ్యం దోపిడీనుంచి కాపాడుతున్న భూమిని రివిజనిస్టు నాయకత్వపు మోసానికి కోల్పోవాల్సివచ్చింది.

దొడ్డి కొమురయ్యలకు అందుకే 35 సంవత్సరాల తర్వాతకూడ దొడ్డికాడ బతుకులు తప్పలేదు. కడవెండి రంగం కన్నపురానికి, జనగామ దృశ్యం జగిత్యాలకు మారవచ్చుకాని దొడ్డికొమురయ్యవలెనే లక్ష్మిరాజ్యం, పోశెట్టి భూస్వామ్య దౌర్జన్యానికి బలిఅయ్యారు.

ఆనాడు ధర్మాపురంలో దేశ్‌ముఖ్‌తో తమ కౌలుభూములకోసం పోరాడిన లంబాడీ ప్రజలపైకి నైజాం అశ్వికదళాలను పంపితే ఈనాడు ఇంద్రవెల్లిలో సభ పెట్టుకున్న గోండుప్రజలపైకి చెట్లమీంచి, జీపులోంచి తూటాలు కురిపించింది ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. సమస్యఅదే. గోండులు సాగుచేసుకున్న భూమి గోండులకు న్యాయంగాచెందాలి.

లక్ష్మిరాజ్యం, పోశెట్టి హత్యలు, శ్రీకాకుళంలో కోరన్న మంగన్న హత్యలను, తెలంగాణలో బందగీ, దొడ్డికొమురయ్యల హత్యలను తలపింపచేస్తే, ఇంద్రవెల్లి సంఘటన తెలంగాణ పోరాటకాలపు బైరాన్‌పల్లి సంఘటనను గుర్తుకుతెస్తున్నదని ఇప్పటికే ఎందరో అన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం నక్సల్బరి శ్రీకాకుళాలమీదుగా కరీంనగర్ ఆదిలాబాదులకు చేరుకొని దోపిడీ దౌర్జన్యాలకు, దాని మేలిముసుగైన రివిజనిజానికి చరమగీతం పాడుతుందని ఈ చరిత్రాత్మకమైన రోజును సంస్మరిస్తూ, ప్రతిజ్ఞ తీసుకుందాం..

5 జులై 1981 — సంపాదకుడు

చరిత్ర పుటల్లోంచి :

సంతాల్ తిరుగుబాటు

జూన్ 30 నాడు 126వ వార్షికోత్సవం జరుపుకునే సంతాల్ తిరుగుబాటు స్పష్టమైన లక్ష్యాన్నీ, మంచి వ్యూహాన్నీ కలిగివుండింది. అది ప్రాథమికంగా మహాజన్ (వడ్డీవ్యాపారి) లకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. హిందూ, ముస్లిం మతాల నిరుపేదవర్గాలతో మైత్రి మీద అది ఆధారపడింది. "మేం బెంగాలీ మహాజన్‌లను ఇతర (పశ్చిమ) ప్రాంతాల నుంచి వచ్చిన మహాజన్‌లనూ తోలేస్తాం. సంతాల్ ప్రజలు నివసించే ప్రాంతాలన్నీ స్వాధీనంచేసుకొని మా స్వంత స్వతంత్ర అధికారాన్ని నిలబెట్టుకుంటాం. మేం ఏరూపంలో కూడా కుమ్మరి, తేలీ, కమ్మరి, మోమిన్ (ముస్లిం నేత పనివాళ్ళు), చమర్, డోమ్ వృత్తుల వాళ్ళమీద దాడిచేయం. ఎందుకంటే మా సంతాల్‌లకు వాళ్ళతో మంచి సంబంధాలున్నాయి. వాళ్ళు మాకు ఎన్నో విధాలుగా సహాయపడుతున్నారు"— పదివేలమంది సాయుధ రైతుల ముందు యోధులైన అన్నదమ్ములు సిద్ధూ, కానూలు ఇచ్చిన ఈ పిలుపు సంతాల్ తిరుగుబాటుకు నాంది పలికింది. ఆ తర్వాత రెండు సంవత్సరాలపాటు తూర్పు భారతదేశంలో బ్రిటిష్ అధికార పునాదులను సంతాల్‌లు కదిలించారు. ఒక సమయంలో బీర్భూమ్ నుంచి భగల్‌పూర్ దాకా గల విశాలప్రాంతం వాళ్ళ అధీకృత కిందికొచ్చింది. వాళ్ళ కంటె ఎక్కువ నిపుణులైన సైన్యం చేతుల్లో అంతిమంగా ఓడిపోయినప్పటికీ సంతాల్‌లు శత్రువుల ప్రశంసను కూడా పొందారు. "నా సైన్యంలో సంతాల్‌లతో సంఘర్షించినందుకు సిగ్గుపడని సిపాయి ఒక్కడు కూడాలేడు. ఖైదీలందరికి బుల్లెట్‌గాయాల గుర్తులున్నాయి" అని ఒక బ్రిటిష్ సైనికాధికారి అన్నాడు.

జూన్ 30 నిజంగా గుర్తుంచుకోవాల్సిన రోజు. దాన్ని గుర్తుతెచ్చుకోవడం మొక్కుబడీ కావచ్చు, విప్లవాచరణ క్రియమైనా కావచ్చు. గత ఉజ్వల సంఘటనలను పాలకులూ, పాలితులూ వేరువేరుగా గుర్తుచేసుకుంటారు. ఈ తిరుగుబాటు అందుకు మినహాయింపు కాదు. గతమహోజ్వలసంఘటన వర్తమానంతో సంబంధంలేకుండా చరిత్రగామాత్రమే వున్నంతకాలం దాన్నిగుర్తుతెచ్చుకోవడం పాలకులకుసురక్షితమైన ఎత్తుగడగావుంటుంది. వర్తమాన నేరాలకది ఒక మంచి ముసుగుగా కూడా పనికొస్తుంది. ఆదిలాబాద్‌లోవందమంది ఆదివాసులరక్తం చేతులకంటినవాళ్ళే త్వరలోనే సిగ్గులేకుండా గిరిజనసంక్షేమం కోసం పథకాలనుఆవిష్కరిస్తారు! ఇలాంటి కాపట్యాన్ని స్పష్టంగాగుర్తించడమే సంతాల్ తిరుగుబాటును నిజంగా గుర్తుచేసుకోవడం. ప్రస్తుతం ఆదివాసులపైసాగుతున్న దోపిడీ గురించి మాట్లాడకుండా, నూరేళ్ళకింద బెంగాలూ ఇతర రాష్ట్రాల మహాజన్‌లు వారినెలా దోపిడీచేశారోగుర్తుతెచ్చుకోవడం అర్థంలేనివిషయం. ఐతేఆదివాసులు పరిష్కారాన్నితామే సాధించుకోలేరు. అణచివేయబడ్డ నిరుపేదలకూ, ఆదివాసులకూమధ్య ఐక్యతఅనే సిద్ధూ, కానూలవ్యూహం ఇవాళ్టికీసరైనదే. ఈతిరుగుబాటు 126వ వార్షికోత్సవంనాడు మనం ఈ గుణపాఠాన్ని మరచిపోగూడదు. ఆదిలాబాద్ మారణ హోమాన్ని గిరిజన, గిరిజనేతర సంఘర్షణగాచిత్రించే ఆంధ్రప్రభుత్వంకుట్ర మనకొకహెచ్చరిక. [ఫ్రాంటియర్ నుంచి]

మార్పు

అల్లం రాజయ్య

సాకల్ది ఊరుదిరిగిపోయింది- మునిమాపు తిరిగిపోయింది- చంద్రుడు చింత కేలాడ దీసినట్టుగున్నాడు. చిమ్మెట్లు ఉండీఉండీ పలుకుతున్నాయి- సన్నగా పైరగాలి తోలుతున్నది.

వాకిట్లో ఇద్దరువియ్యంకులు పండుకొన్నారు- పిల్ల ఏదోఆటపాట పాడిపాడి నిదురబోయింది.

"అయితే బావా! గట్లయ్యిందన్నమాట- ఏమైన దురుజెట్ట కాలమచ్చింది- కాదంటవా? సాంబయ్య తుపుక్కున మంచంకిందఊంచి గంగయ్యవేపు తిరిగిండు.

మంచంలో పక్కగోలుగా పండుకొని సుట్టతాక్కుంట ఎర్రగా మెరుస్తున్న సుట్టకొరుకునే సూస్తున్న గంగయ్య మాట్లాడలేదు- నిజానికి అతని మనుసు ఇక్కడ లేదు. పట్నపుబజార్లలో- అక్కడినుండి సబ్ జైల్లోని కొడుకుమీదున్నది.

"మనకెందుకు బావా! అవులావులు పోట్లాడ్తె లేగలకాళ్ళిరిగినట్టు- అచ్చేటిది రాకమానదు. ఎనుకటినుంచచ్చె ఇలవరిసె గిప్పుడు ఒక్కపెట్టున మార్తదా? సంక లేవడితె ఖార్జం కండ్లబడ్తది- దొరలంటె కొండలసొంటోల్లు- దున్నపోతు గట్టుతోని పోట్లాటబెట్టుకున్నట్టు- డబ్బు. ఇజ్జె, ఖానూన్లు, కచ్చీర్లు మంది మార్బలం గలిగినోల్లు- గాళ్ళతోని ఇరోధం బెట్టుకుంటె మన బతుకేమయిద్ది? ఆకుకుఅందకుంట పోకకు పొందకుంటయిపోద్ది- నాకైతే ఎటుసూసిన గిందట్ల ఫాయిదా కనిపిత్తలేదు- అల్లుడంటె జెరఉచ్చిలి మనిషి- నువ్వన్నజెర బుద్దిగానెం సెప్పద్దా? గౌరవ్వ ఏడ్సేడ్సి సగమైతంది- ఏంభాగ్గెమచ్చె-" సాంబయ్య ఇలాగా ఏదో చెప్పుతూనే ఉన్నాడు.

అయినా గంగయ్య మాట్లాడలేదు- అతని మనుసులో ఎన్నెన్నో విషయాలు కలివిడిగా, విడివిడిగా తిరుగుతున్నాయి. చుట్ట నేలమీదరాసి ఆర్పి మంచంలో లేచి కూర్చున్నాడు. పందిరి గుంజకు అతుక్కపోయి కోడలు గౌరమ్మ నిలబడున్నది- చింతమీద చంద్రుడు పాండురోగం సోకిన వానితీరుగా వెలుగుతున్నాడు- ఆ వెలుతురులో గౌరమ్మ సగం మాత్రమే కనిపిస్తోంది- మిగతాసగం పందిరికింది నీడలో కలిసిపోయింది.

గుడిసెలోపల గౌరమ్మతల్లి లచ్చిమి గుడ్డిదీపం వెలుతురులో మాడిసెక్కలు కాళ్లబారజాపుకొని తింటున్నది.

"గౌరవ్వా గిన్నెన్ని మంచినీళ్లు దేవే" అన్నాడు గంగయ్య.

గౌరమ్మ ఇత్తడిచెంబుతో మంచినీళ్లతెచ్చి మామకిచ్చింది. నీళ్లు గటగటతాగి చెంబు కోడలుచేతికిస్తూ కోడలు కళ్లల్లోకి చూశాడు గంగయ్య.

గౌరమ్మ కళ్లల్లో తడి....

గంగయ్య తలపునుక్కున్నాడు. రెండుచేతులతో తలనొక్కుకుంటూ కాసేపు నేలచూపులు చూశాడు.

మనుసు సుమ్మర్లు చుట్టుకపోతున్నది. "ఎప్పుడత్తదో కొడుకు. వచ్చినా మళ్ళ తకురారురాదని గ్యారంటేంది? అగ్గిరాజుకున్నంక మంటుండకుండపోద్దా? ఊరినిండా పోలీసోల్లు దిగిండ్లు. మామూలుగ బతకడమే గగనమైపోయింది. సన్నుముట్టుకోకు సామాలకొకన్నా ఊళ్లెజరిగేతంతు జరుగకపోదు. పోలీసోనిదుడ్డుకు గరీబోల్లంత ఒక్కటే సాకేజీకరులేదన్నోదే అలుకగ దొరుకుతడు. కొడుకు కొండయ్య జేసింది తప్పని కండ్లార సూసుకుంటనే ఎట్లంటడు. అసలు మంచిపనే సేసిండని తనకుతెలుసు. తన గుండెకుతెలుసు. ఊళ్లోల్లందరికీ ఎరికే. కనిగీల్లకెట్లజెప్పాలె?"

"సేతులుకాలి బొగ్గలచ్చినంక ఆకులుబట్టుకొనేంభాగ్గెం" లచ్చిమి కంచం కడుగుతూ అన్నది.

"ఆకులేలేంది ఏంజేత్తమేఅవ్వ? ఒడ్డుమీన నిలుసుండి పొలంల బురద గురించి మంచిసెద్దలు సెప్పచ్చు. మరి బురదలకు దిగందే బువ్వలేదే?" గౌరమ్మ విలదీసింది.

"నీకూ అచ్చినాదిరేషం! నువ్వా అయింటి కోడలువైతివి. మాసాలు సంబుడం. సూడవోతే." ఎందుకనో మాటలుపూర్తిచేయకుండానే లచ్చిమి గునిసింది.

"నాకైతె పాడువవారం తీర్గనే గన్పడ్తందిబావా! ఎద్దుముడ్డి బొడుసుక బతికె టోల్లం మనం. మనకు సంఘాలెందుకు? గింగాలెందుకు. ఎనుకటినుంచి మన తాతలు తండ్రులు బతుకలేదా? మనం బతుకుతలేమా? రేపు నీకొడుకు బతకడా? గిప్పుడు గుడ్డచ్చి పిల్లనెక్కిరిచ్చినట్టు ఆడుదొరగాదు దొంగంటె ఆడుదొర కాకుంట పోతడా? బావా మనసేతుల్లేమున్నది. అంత బమ్మరాసినరాత. ఆని అదురుట్టం గట్లున్నది. ఆడు నోసిపుట్టుకున్నడు. ఆనిపున్నెం మంచిది. అనికి తాతలు తండ్రులు బూములు సంపాయించి యిచ్చిండ్లు"

"మాబతుకుతన్నం కుక్కబతుకులు- సచ్చిన మీయవ్వ గిట్లసానా కతలు సెప్పేది...." గౌరమ్మ తండ్రికి ఓమాట తగిలేసింది.

"ఏడువు బిడ్డా! ఏడువు! నీకే గట్లుంటె మజ్జెన నాదేంబోయింది- కడుపు నొచ్చినోడు ఓమ బుక్కుతడు- ఏడువుబిడ్డా! ఏడువు మజ్జెన నాదేంబోయింది" సాంబయ్య ముఖం ముడుచుకున్నాడు.

"ఇంతకూ నువ్వనేదేందిర సాంబా!" గంగయ్య సూటిగాచూస్తూ అన్నాడు.

"ఏమంటడూ! దొరలతోని ఇరోధం పెట్టుకోవద్దంటడు- దొరలు సత్తెనాశిడం జేసిన మన అనువం అని మూలకు కూకుండుమంటడు- తన తీర్గనే బిడ్డపెండ్లికి అయిదు నూర్లప్పుదెచ్చి ఏలుముద్దరేసచ్చి- అయి పెరిగి పెరిగి ఎకురం పెరడి తినికూసుంటె కర్మమని కాల్సిక్కులు మలుసుక పండుమంటడు-" గౌరమ్మ.

మజ్జెన నిన్నెవడు మాట్లాడుమన్నడే!" అంతెత్తు లేసిండు సాంబయ్య.

"కట్టమో సుకమో మేం గట్లబతుకుతన్నం- నిన్నెవడు సాకునాలు జెప్పు మన్నడు మజ్జెన-" గౌరమ్మ పోట్లాటకు దిగింది.

"పిల్లకాక్కేమెరుక ఉండీలదెబ్బ- పోరీ! పురెల్ల పురుగ్గిన మెసులుతందా?" లచ్చిమి కీకలేసింది.

"ఓరసాంబ! దొర మాదండోడు ఆనికి ఎదురాడద్దు- ఆడు కొట్టినా తిట్టినా, భూములు గుంజుకున్నా! కూల్లెగబెట్టిన- దండుగబుతిన్నా! ఆడోల్ల ఖరాబుసేసినా! ఆని ఇట్టారాజ్జెం సత్తెనాశిడం జేసిన సచ్చినట్టు పడుంగాలెననె గదర నీ మాటలకర్థం- పడుంటె మంచిదే- సచ్చినపాము కసొంటిది రేషమత్తది- కని పడుండనోల్ల గురించి నువ్వూనేను నెత్తినోరు కొట్టుకుంటె ఆగుతరా? సేనుపండి పంటసేతికచ్చేయాల్లకు రాళ్లవాన గొట్టద్దనుకుంటం- దానికాలమత్తె ఆగుద్దా? ఎండకాలం రాకపోతే మంచి గుండనుకుంటం రాకమానుతదా! ఎండకాలమత్తది- సెట్ల అకులు రాలిపోతయి- మళ్ల ఆసకాలమత్తది- కొత్త సిగురులు పుట్టుకత్తయ్-" గంగయ్య ఏదో ఆలోచిస్తున్న వానిలాగా కాసేపాగిండు.

"కట్టాలు తెచ్చుకోవద్దన్నది మంచిమాటే- మనది కట్టపుటుక- గౌరవ్వా పుంజులు గుయ్యంగ లేసిపోదాం- రెండామెడ నడువాలె- కూసంత కూరుకుదియ్యిపో- నువ్వెందుకు ఫికరుపడుతవవ్వా!" అని వియ్యంకుడి ముడుచుకున్న ముఖం చూసి చిన్నగా నవ్విండు.

"ఈపారి మీ అల్లుడు ఇంటికచ్చినంక మీదగ్గరికేతోలిత్త అత్తమామ గలిసి ఆనికె సెప్పవల్సిందేదో చెప్పుండ్లి" గంగయ్య.

"ఆఁ! అసలు ఆక్కుబోతే తాలు ఎదురెక్కొచ్చిందట- కనిపెంచిన అవ్వయ్యే సంబురపత్తంటె మజ్జెన మాకేమచ్చె...." లచ్చిమి మెటికలిరిసింది.

"అప్పటి నుంచి సూత్తన్న ఇద్దరూ ఒకటే ఇదయిపోతండ్లు ఇంతకూ ఆడు సేసిన నేరమేందోంట?"

"అంగి బతుక నిలబడిబతుకుత ననటం-" గౌరమ్మ.

"మీరు గోదాల్లె కొట్టుకపోతమంటె మజ్జెన మాకేంది కడుపునొప్పి-" సాంబయ్య కంఠంలో తీవ్రత ఉన్నది.

"ఏదో అగ్గానెంబోరి దానితోనేంది- నేనోకత సెప్పుతినర సాంబా!" గంగయ్య.

కతలకేమచ్చె- కొడుకు బోయిండని సిన్న మెత్తురంథి లేదు మనిషికి-" సాంబయ్య గొనిగిండు.

"ఛత్ సెప్పులుగోసిన కుక్కోలె కొడుకో! కొడుకు.... అనికేమయ్యిందిరా! ముందు గీ కతిను.... నాకా నిదురచ్చేటట్టులేదు.... నేనచ్చిన పనిగాలేదు-" గంగయ్య మాట జారిన్నని నాలిక కొరుక్కున్నడు....

"అచ్చిన పనింకేంది బావా?" సాంబయ్య....

"గదేరా! గీకత నీకెప్పటినుంచో సెప్పాల్ననుకున్న...." గంగయ్య మాట మార్చిండు.

"మామా నేనింట నాకుజెప్పే...." మంచాల పిల్లకు ఎప్పుడు తెలివి బడ్డదో ఉరుకచ్చి గంగయ్య తొడలమీద కూర్చున్నది.

వెన్నెల వెండిరేకుల్లా పరుచుకొంది- ఎక్కడో ఎవరిదొడ్డిలోనో ఆవు అదేపనిగా దాని మెడలోని బొనుగ ఊపుతోంది- గంగయ్య కథ గునాయించుకుంటున్నవాని లాగా కాసేపు మవునంగా ఉన్నాడు- ఆతరువాత ఉమ్మేసి చుట్టూఉన్న వాళ్లనందరినిచూశాడు. సాంబయ్య, లచ్చిమి, గౌరమ్మ వినేందుకు సిద్ధంగా వున్నట్టుగమనించి సరాయించి గంగయ్య కథ మొదలుపెట్టాడు.

"దచ్చన్న రాజ్జాన ఓ ఊరట...." గంగయ్య కంఠం కొంచెం హెచ్చించి, పాట తీరుగా చెప్పడం సాగించాడు.

"ఊరంటె ఊరుగాదు- కూసంత పెద్దారేనట- గ ఊళ్లె సాకలి, మంగలి, మన్నే, మస్కూరు, మాదిగ, అడ్ల, కమ్మరి, కుమ్మరి, గొల్లకాపు గిట్ల సబ్బండ వర్నాలు బతుకుతున్నరట- అగోగసొంటి ఊరికి ఉత్తురాన పెద్దపెరవు, పెరువు కొమ్ముకు ఊడలమర్రి ఉన్నయ్- మళ్లింక దచ్చినాన సిన్నఏరు, ఏటి ఒడ్డున మద్ది పెల్లు, మద్దిసెల్ల కీతల తాళ్లతోపు- మరి తూరుపుకు తుమ్మల బీళ్లు, తుమ్మల బీళ్లు దాటితె నల్లరేగల్లు, నల్లరేగల్లు దాటితే పేకువనం ఉన్నయ్- పడమట గుట్ట- గుట్ట మీన బిలుగును, కొడిశెలు, పెన్నంగులు, నల్లమద్దులు, నారేపల అడవి ఉన్నదట."
గౌరమ్మ నిప్పుతెచ్చి మామకిచ్చింది- గంగయ్య సుట్టముట్టిచ్చి రెండుదమ్ములు గుంజి రైలింజనులాగా పొగవదిలిండు.

సాంబయ్య చెవులు రిక్కించి వింటండు- చేతులు తుడుసుకుంటచ్చి లచ్చిమి అరుగుబండమీద తీరిపారి కూలబడిపోయింది- పిల్లఊకొడుతున్నది- గౌరమ్మ వెన్నెలను చూస్తోంది....

"మనం దచ్చినాన్నున్న ఏళ్లెదిగి- తేటంగ పార్తున్న నీళ్లల్ల మొఖంకడుక్కొని ఒడ్డెక్కితె మద్దిసెల్లకింద గొడ్లపోరగండ్లు ఆటలాడుకుంట కన్పిత్తరు- కడవలు నెత్తులమీన బెట్టుకొని ముచ్చెట్లుబెట్టుకుంట నీళ్లకచ్చె ఆడోళ్లు కన్పిత్తరు ఇంకొంచెం ముంగటికి నడిత్తె తాళ్లు- తాళ్లల్ల మనంబొయ్యెతొవ్వబందుకు తాటికమ్మల గుడిసె- గుడిసెముంగట నురుగులుగక్కే- కల్లులొట్లు- రేకలుబట్టి గుటుక్క- గుటుక్కన కల్లుదాగే మనుషులు మోకులు భుజాలకేసుకొని ఉరుకులు పరుగులు బెట్టే గౌండ్లోల్లు- గుడిసె ముంగట ఇరిగిన తాటిమాను పక్క- పెనిగల గుడ్డోడు రాందాసుంటడు- ఆడుమెడలు తిప్పుకుంట ఏదో పదంపాడుతుంటడు- మీ అయ్యకైతె గ పాటలింటె సలిజెరమత్తది- సరేపిల్లా గ గుడిసెదాటి కుసంత దూరం నడిత్తె కూలిపోయిన గుడిశెలు- ఆ గుడిశెల్ల కుమ్మరోనిల్లు గన్పిత్తది- ఆడకుమ్మరి పెదలింగయ్య సపుకూ సపుకున కుండలు సరుత్తంటడు- అన్నుంచి కూసంత ముంగటికి నడిత్తె అడ్లోనిల్లు అడ్ల శంభయ్య దెబ్బ దెబ్బకు మూలుక్కుంట పెద్దబాడిసె ఆడిత్తంటడు- శంభయ్య ఇల్లు దాటుతె కమ్మరి రాజయ్య కొలిమి మండుతంటది.... గిట్ల ఇల్లిల్లు దిరుక్కుంటబోతె మూడు పానాదు లత్తయి- ఆడ ఆంజనేయుని గుడి- గుడిదాటుతె గూనింద్లు గ గూనింద్ల ముంగట షావుకారి పాపయ్య దుకాన్ల తీరిపారి కూసుండి ఎవన్నో తిడుతాంటడు.

అన్నుంచి సీదానడిసి ఉత్తురంకెళ్ళి తిరుగుతె బజారు పెద్దదయితది- గదాంట్ల కొంతదూరం నడిత్తివో పెద్ద మట్టిగోడ గన్పిత్తది- మట్టిగోడపొంట నడుసుకుంట

బోతె ఏనుగలంత బండలతోటి గట్టిన పెద్దరువాజ గన్పడ్తది- పగటీంచయితె గది తెరిసుంటది- నాత్రిబోతె కర్రెగమాగిన తలుపులు గన్పడ్తయి- తెరిసున్నప్పుడు లోపటికి సూత్తివా ? కంటిసూపు అనేంతదూరంల పెద్దబంగుళఉంటది- గ బంగుళ ఊరిదొరది.

గట్ల ఇంకాముంగటికిబోతె ఊరవతల ఇసిరేసినట్టున్న కూలిపోయిన గడిసెలు మాదుగులయి- మాదిగోళ్ళ గుడిశెలకు కుడిశెయ్యిబాజు మామిడితోట- పెద్దపెద్ద గడ్డాములు- గడ్డాముల ముంగట గుర్రాల సోవడసొంటి కొట్టాలు కన్పడ్తయి- గయిదొర కొట్టాలు- కొట్టాల బందుకు ఒక్క- దినమంతా గుర్రింమీన కూకుండీ ఎంత దిరుగుతవో గన్ని భూములు దొరయి సెరువెనుక- ఊరుసుట్టు- అన్నీ దొరబూములే- తుమ్మల శీళ్ల దొరయే- అటవతలి పేకువనం దొరదే- తుమ్మల శీళ్లల్ల పదిమంది గాసేగాండ్లు, బర్లు మేసుకుంట గన్పడ్తయి.

పిల్ల అపులించింది- గంగయ్య మళ్లీ చుట్ట ముట్టించాడు.

" అవునే పొట్టి కోడలా ! ఊరంటె ఎట్లుంటదో ఎరికయ్యిందా ?"

"కతసెప్పుతనని శాత్రిం జెప్పుతన్నవ్.... నాకు మావూరికే గిదిమీఊరేనాయె-" పిల్లతల్లి దగ్గెరికురికింది.

మిగతాముగ్గురు ఆసక్తిగా వింటున్నారు.

దొరంటెదొరగాదు- పెద్దపులిపంత- తలుపారుకట్టు మీసాలు కడుముంతలంత చెంపలు- మోకాళ్ళదనుక సేతులు- గొర్లకోళ్ళదిన్న సెత్తాయె- మాదండిసెత్త- అగో గసొంటి దొరపేరు గోపాలురావుదొర.

గోపాల్రావుదొర లేసుడే బారెడు పొద్దెక్కినంక లేత్తడు- లేసిండంటె సాకలి మల్లిగాడు ముంతల నీళ్లబోసుకొని పాయఖానికాడ తయారుగుండాలె. అచ్చిండంటె సాకలిసెంద్రిడు ఏపపుల్ల బట్టుకొని అజరుబలుకాలె- సలసలకాగేనీళ్ల డాసెంకటి పట్టుకరావాలె- మంగలి సుబ్బడు కుర్సిదెచ్చేయాలె- గప్పుడు తోలుదీసిచ్చిన ఏప్పుల్ల సుతారంగ నమిలి సలసల మరిగేనీళ్ల ఎంకటి పేతులమీన బోత్తాంటె దొర మొఖం కడుగుతడు- గప్పుడు కాపు అంతమ్మ నవ్వుకుంట మెత్తటి తువ్వాల దేవాలె- గింద్ల ఏది తక్కువైనా ఎవడు ఎనుకైనా ఆని ఊపు జమిడికె మోత మోగుద్ది....

అగొగట్ల మొకం కడుక్కొని అర్రిల కప్పెటాల్లకు కోడిగుడ్డట్లు గరం గరం గుండాలె- గయి సుందరమ్మ పట్టుకరావాలె- ముంగటున్న బల్ల తళతళ మెరువాలె-

గ బల్లమీన గాజుగిలాస బరండి కీసుండాలె– బరండి రెండు పావులేసి ఎనిమిది కోడి గుడ్లు దినేటాల్లకు సుందరమ్మ తువ్వాలందియ్యాలె– సికిలేటు డబ్బ సేతికియ్యాలె– దొర సికిలేటు నోట్లెబెట్టుకుంటె అగ్గిపెట్టెగీకి అంటుబెట్టాలె– గప్పుడు దొర సిట్ట సిమాంట నోరిప్పుతడు సుందరమ్మను తిట్టరానితిట్లు దిట్టి– భయంతోని ముద్దగట్టుక పోయిన సుందరమ్మ బుజాలు పట్టుకొని కుర్సిల నుంచి లేత్తడు.

లేసిబంకుల్లకు నడుత్తడు. ఆడ సుంకరోల్లు, పనిపాటలోల్లు అంగంగి దండాలు బెట్టాలె– మంగలి శాయిమల్లడు తట్టుకుర్సిదుబపాలె– దొర అంతూపొంతూ లేకుంట ఊరుపేరు లేకుంట కసిన్ని తిట్లు తిడుతడు– అంచిన మొకమెత్తకుంట ఇనేకొడికిని "పోండ్లి" అంటె సెప్పిన పనిమీదకురుకాలె– గప్పుడు షెకెదారు రాములచ్చి దండం బెట్టి ఊళ్లె ముచ్చట్లు జెప్పాలె– దొర తిట్లతోనే పాలేరోల్లకు పనులు జెప్పుతడు– షెకెదారెల్లిపోయినంక పట్వారమాల పానుపండ్ల అయ్యగారు జంజిరపోస తీసుకుంటచ్చి కపేపు దొరను "ఇ దురినివి – సెందురునివి" అనుకుంటనే ఊళ్లె ముచ్చట్లు సెప్పి పోతడు– దొర సికిలేటుమీన సికిలేటు అయిదు సికిలేట్లు దాగేటాల్లకు రావాల్సినోల్లచ్చి పోవాలె– అప్పటికి అంబటేల్లయ్యిద్ది.

గప్పుడు మంగలి శాయిమల్లడు అరుక్కిందినుంచి అరుగుమీనికెక్కి– అనికే సేతులతోని దొరబనీనిప్పాలె– తళతళమెరిసే ఇత్తడిగిన్నెల సబ్బుసురుగుబెట్టి– ఆడోల్ల సక్కదనంమీన ముచ్చట్లు బెట్టుకుంట జేగర్తగ గడ్డంగీకాలె– గడ్డంగీకి సలువసేసిన గుడ్డతోని తుడిసి– గిన్నెల కొబ్బరినూనేసుకొని సల్లసెముటలు బెట్టంగ మాలీష్‌జేయాలె మాలీషయిపోయిందంటె పడిబిందెల ఉడుకునీళ్లు గంగాళంలబోసుకొని సుందరమ్మ తైనత్‌గుండాలె– దొర తానాలఅర్రిలకచ్చినంక సాకలిసెందురడు ఎత్తుపీటెయ్యాలె– పీటమీన కూసుండబెట్టి సుందరమ్మ పరాసికాలాడుకుంట తానంసేపియ్యాలె– సాకలి సెందురడు సలువధోతి అందియ్యాలె– సుందరమ్మ తువ్వాలతోని ఒళ్లుదుడువాలె– గప్పుడుదొర ధోతిగట్టుకొని బంగుళెక్కుతడు– బంగుళమీన దేవునర్రిల ఆరతిపల్లెం, పట్టుసీరగట్టుకొని దొర్సాని తయారుగుంటది– దొర ఆరతి కండ్లకద్దుకొని– దేవునికి దండంబెట్టి– మళ్లకిందికిదిగుతడు. బోజినాలర్రిల– కోడికూర, చాపలపులుసు: మీగడ పెరుగు ఆసనబియ్యపన్నం, జింకఏపుడు, ఆవునెయ్యిగిట్ల భోజినంబెట్టుకొని దొర్సానుండాలె– దొర అదింత ఇదింత అంటిముట్టనట్టుదింటడు. దొర్సాని సెయ్యిమీన నీళ్లబోత్తాంటె– సెయ్యికడుక్కుంటడు. సుందరమ్మ తువ్వాలందియ్యాలె– పేదెక్కెటాల్లకు బరండికీసుండాలె– బర్రండిదాగినంక గలుమముంగట సెప్పులుండాలె– సెప్పులు తొడుక్కున్నంక సాకలిసెందురడు సేతికి సిమ్మంపూతికట్టెఇయ్యాలె– దొర బంకుల్ల

కచ్చెటాల్లకు సుంకరోడు తయారుగుండాలె- గప్పుడు దొర సైగజేత్తడు. సైగనుబట్టి ఒరుగుడు మెత్తలబండి ఉరికిరావాలె- మొందోడు దొరకు దండంబెట్టి నిలుసోవాలె- దొర సికిలేటుముట్టిచ్చి బండెక్కుతడు- మొందోడు అనికేసేతులతోని అరుగట్టె దొర సేతికియ్యాలె- దొర సెప్పులుబట్టుకొని సుంకరోడు ఎనుకుసకాలే- దొర చేతుల అరుగట్టె "చెల్" మంటది కయిలు ముచ్చుకోల్లాగెలు కస్సునఉరుకాలె- ఆటిముంగట ఎగపోసుకుంట సుంకరోడురుకాలె.

బండి బజాట్ల కచ్చిందంటె- మనుషులెవ్వలుండద్దు- ఉంటే గంటే రుమాల్లు దీక్కొని పబ్బతిబట్టాలె- బండ్లు గిండ్లు ఎదురత్తె బండిపడదునికి పక్కకు బట్టుకోవాలె- ఎవడన్న కానకపోతే అని కర్మము బలిగిందే! బండి ఆగకుంట ఉరుకుతాంటది- కాలికుండలు, కట్టెలబండి దొర కెదురత్తె తోలుపికులగొట్టుడే- నీల్లకడవలెత్తుకొని అడివోరగండ్లు ఎదురయితె ఎటోల్లటు ఉరుకాల్సిందే దొర నజరుబడ్డదా? గరిమాపటికి ఇంటికి రావల్సిందే- బండి ఊల్లెనుంచి రాంగ- పంచాతులోల్లు, పడావులోల్లు అను మంద్ల గద్దెకాడ కుప్పకూడుండాలె- ఆడ గుడిసేప బండాగుతది- ఆడ కూసున్నోల్లు ఒక్కపారే దండాలు బెడుతరు....పంచాతులోల్లు ఏడ్సుకుంట సంగతేందో చెప్పుకుంటరు.

పంచాతు పెద్దదయితె దొర బండి దిగుతడు- సుంకరోడు కాళ్ల కింద చెప్పు లేత్తడు- కుర్చి పెద్దరయితు మీదిపంచెతోని తుడుత్తడు- తిట్లతోని దొర పంచాతు తెంపుతడు- అరుగట్టందుకొని తప్పున్నోన్ని అట్లలుదేలగొడ్తడు- తప్పొప్పులు దొరిట్టమే- దండుగ పైసలు మాలిపటేల్ కీసలబెట్టుకొనిపోయి దొర గుమత్తకియ్యాలే- అన్నుంచి బండి తాళ్లల్లకు నడుత్తది- ఆడ బండాగుతె గొండ్ల పెద్దిరాయుడురికత్తడు పెట్ల మామూల్లసంగతి సుంకరోడడుగుతడు.... అన్నుంచి బండి కదిలిందంటె- గొర్ల మంద లెదురయితయి- గొల్ల కొమురయ్య ఉరికత్తడు- సుంకరోడు గొర్రెపిల్లలడుగు తడు- గోల్లోడు పొదేలును మోసుకపోయి ఇంట్లదించిరావాలె- అన్నుంచిబోతె సిల్లర రైతుల కల్లాలత్తయి- బక్కసక్క రైతుల కల్లాలముంగట బండాగుతది- సుంకరోడు బాకీలడుగుతడు- బత్తాలు బండ్లమీన గుమ్ములరత్రిలకు బోవాలె- బండిసెరువు కట్టెక్కుతె నీరటికాళ్లు బండెనుక ఉరికిరావాలె.

గట్ల బండి పేండ్లు పెలుకలు దిరుక్కొని నెత్తిమీనికి పొద్దచ్చెటాల్లకు కొట్టం కాడికి పేరుకుంటరు.

కొట్టంకాడ గప్పుడే అంటోతు మెడలిసురుకుంటది.

గంగయ్య చెప్పడమాపి సాంబయ్య ముఖంలోకి చూసిండు....లచ్చిమి చెంపకు చెయ్యాన్చుకొని దింటున్నది- గౌరమ్మ వాకిట్లో కూర్చుండి మామ మొఖం పులుకు

పులుకున చూస్తున్నది.... మాఘ వెన్నెల రాత్రిల్లు, చలికాలం నెగడిదగ్గర జనాన్ని కుప్పేసి ఇలాంటి కథలు ఎన్నో చెప్పగా తనూ విన్నది.

గంగయ్య మళ్ళీ చెప్పడం సాగించాడు.

అంబోతంటె అంబోతుగాదు- గుండుకొమ్ములు, ఏనుగుపొట్ట కయిలిముచ్చు కొండసొంటి ఊపురం- కాటికెకండ్లు- బొక్కపూసల పంతాడు- ఎడంకాలుకు ఎద్దు సెలితాడు. రోషంబీకుతె రోషంతోని నెత్తురు జిమ్మాలె- సెయ్యెత్తిఅందనికోడె.

ఓపారిదొర సడ్డకునింటికి సుట్టంసూపుబోయిండు- సడ్డకుడు పొలాలు సేండ్లు దిప్పి గొడ్లమందను సూపెట్టిండు. గొడ్లమందల అంబోతును సూసి దొరకండ్లు నిలబడి పోయినయ్- గమందల గసొంటి కోల్లాగెలుశానున్నయి- తనో అంబోతును బెంచా ల్నని దొరకు కాయిష్‌బడ్డది- గముచ్చట షెకెదారు రాములుతోనన్నడు.

"బొనుండ్లి- మన మందల అంబోతులేక అన్న పొట్టిగిత్తలే ఎదుగుతన్నయ్- మనకు నాగండ్లకు గావాల్నంటే ఏలకేలుబెట్టి కొనుక్కొనెతంది- మనం అమ్మాల్నంటే గీములక్కాయలకేపత్తది- నామనుసుల ఎప్పటినుంచో అంబోతు గావాల్నని ఉన్నది దొరా" రాములన్నడు.

గప్పుడు దొర మనుషుల తరిమిండు- ఉత్తరంబోయినోడు ఉత్తసేతులచ్చిండు. దచ్చినంబోయినోడు దీలెపడచ్చిండు. తూరుపుబోయినోడు తిరిగి తిరిగి సచ్చిండు. పడుమటికి బోయినోడు పగ్గాన్నిగ్గి అంబోతును నలుగురు మనుషులతోటి పట్టిచ్చు కచ్చిండు- గీ అంబోతును సూసేటందుకు ఊరుఊరంత ఒడ్డన ఒరిగింది- మందిని జూసి అంబోతు సింగిబింగాడింది. పట్టెనామాలయ్యగారు ఆపక్క ఈపక్కజూసి అటెనక్క పంచాంగంజూసి తిథి నచ్చెత్రంజూసి అన్ని అవ్వల్దర్జగున్నయన్నడు. జిట్టి తాగిందని మంగలోనితోని జీడిగింజలు తింపిచ్చి అగ్గిలేపిచ్చిండు- అందరెల్లిపోయినంక-

"దొరా! ఈకోడె చూడవోతే శృంగారంగున్నది". అయ్యగారు గుటికిల్లు మింగిండు.

దొర కలవరపడి సూసిండు-

"దీని ఊపురంమీద సుడున్నది".

"ఉంటేందో సెప్పు."

"దీన్ని నాగలికికడితే భూదేవి వలపోస్తది- వర్షాలు ఆగిపోతయి"

"ద్దుత్తెరి ఎక్కన్నుంచి దొరికినవయ్యా! గిదీన్ని మందమీదికి తెచ్చిన"

"మంచిమాటేకాని దొరవారు.... దీన్ని దేవునిపీట మీద విడిచిపెట్టాలె- వేముల వాడ రాజేశ్వరస్వామి కన్న చాలాబాగున్నది. తమరింట చూస్కోండి లక్ష్మి తాండవ మాడుతది".

దొరకు సమఝ్‌కాలే- అయ్యగారు తెలిజెప్పిండు. దొర కడుపు కదిలేటట్టుగ నవ్విండు.

అగోగట్ల గీ అంబోతు ఊరుమీనికచ్చింది.

మల్ల గిప్పుడు దొర అరుగట్టె సుంకరోనిమీనికిసిరేసిండు- ఎనుకనుంచి సుంకరోడురికచ్చి చెప్పులు కిందేసిండు. దొర బండిపడదునికి సెప్పులు తొడుక్కొని దొడ్లెకు నడిసిండు. రామలచ్చడు కుర్సెత్తుకచ్చి ఏసిండు. దొర కుర్సిమీన కూసుండ కుంటనే అంబోతును అపక్కీపక్కసూసి- ఏమన్న మైలంటిందేమోనని తనఖీచేసిండు. కర్మము పలుగనే పలిగింది. కుడిపక్కన జోరీగ అలనేఅలింది. దొర పాలేరోల్లను పెండ్లమాలు దిట్టిండు. రామలచ్చడు గజగజ అనికిండు.

దొర కుర్సిమీన కూసుండకుంటనే ఎనుకకు మర్రిండు. మల్ల గజ్జెలకచ్చులం కదిలింది. గడీల గజ్జెలకచ్చులం అగెటాల్లకు పొద్దంగుతది. మోటర తయారుపెట్టుకొని డ్రైవరు ముగిలయ్యుంటడు. దొర మోటరెక్కుతడు. మోటర తాలుకాకుబోద్ది. ఇగ అడతాగి తందానలాడి ఏ తెల్లారంగనో మల్లింటికత్తడు.

అప్పటికి నడిమూమురాత్రి తిరిగిపోయింది. గుడ్డెంకడు మూడు బజార్లదగ్గర ఒగ్గుకథ మొదలేసిండు. వానికంఠం అంతకంతకు తీవ్రమైపోతోంది. కథలో పరుశు రాముడు గొడ్డలి భుజానేసుకొని కనిపించినరాజునల్లా నరికి పారేస్తున్నాడు. ఎవడో సుతిపట్టుకుంట మధ్య మధ్య "ఒహో .. ఆఁ.... అహఁ" అంటూ అక్కడక్కడ వచనం చెప్పుతున్నాడు. ఏడ సడీ సప్పుడులేదు. గుడ్డెంకని బొంగురుగొంతు కొంచెం జీరవోయి అదేదో ఏడుపుతీరుగా వినిపిస్తోంది. సాంబయ్యలేచి వాకిట్లోనుండి గుడిసె వెనుకకుపోయి ఎడ్లముంగటి సొప్పదంటు దగ్గరేసి వచ్చిండు. లచ్చిమికొంగు నేలమీద పరుచుకొని ఒరిగిపోయింది. గౌరమ్మ చెల్లెపక్కలో పండుకొన్నది. ఆమె కళ్లముందు మొగుడు కొండయ్యరూపమే కదులుతోంది.

"ఇంటన్నరా ! శాత్రిం పురంగ అయిపోలే" గంగయ్య ఆవులించి అన్నాడు.

సాంబయ్య తలూపిండు. గౌరమ్మ "సెప్పు....సెప్పు" మన్నది.

ఇవ్వాల్దనుక దొరకత సెప్పుకచ్చిన. దొరలసంగతి ఊళ్లె పాల్లకె వోరికాన్నుం ఎరికే- కని గ అంబోతుసంగతే సెప్పుకోవాలె....

అంబోతు కరకర పొద్దుపొడిసేటాల్లకు లేసినిలబడ్తది. నిలబడేటాల్లకు మాల మదునడు ఇనుపతట్ట బట్టుకచ్చి దానికిందబెడుతడు. తట్టల సిలసిల ఉచ్చబోత్తది. ఎర్రెకండ్ల ఎడ్డిసమ్మడు ఎరకలతట్ట బట్టుకొని నిలుసుంటడు. తట్టల పెండబెడ్తది. రామలచ్చడు ఉరికచ్చి అంబోతుమెడల తలుగిప్పి దొడ్డెనుంచి ఈతలికి బట్టుకత్తడు. ఎండ పొడల అంబోతు ఒళ్ళిరుసుకుంటది, మదునడు దాని పక్కఅరిగడ్డి పరుపుదీసి గొడ్ల కేత్తడు. రామలచ్చడు, సమ్మడు, కాశెలు బిగగట్టి కసేపు అంబోతుకు మాలీష్ జేత్తరు సల్లసెముటలు బెట్టంగ. సుక్కడు బకిట్ల నీల్లుబట్టుకొని తయారుగుంటడు. ముగ్గురు నీల్లుబోసి, ఒళ్ళుగీకి పెయికడుగుతరు. తల పంచెలూడబీకి మెత్తగ తుడుత్తరు. మదునడు పల్లిపిండి, ఉలువపప్పు కలుపుకత్తడు. మదునడు తట్ట నోటి కాడ బట్టుకుంటె అంటి ముట్టనట్టు తింటది. సుక్కడు నీల్లుబెట్టి మూతి తుడుత్తడు. అప్పటికే దొరచ్చి జోదడు. గప్పుడు రామలచ్చడు తలుగు తప్పదీత్తడు. అంబోతు అడుగులడుగేసుకుంట పడారిగోడ దాటి బజాట్లకచ్చి నిలుసుండి పెడీల్న రంకేత్తది. ఎదురంగ ఏది ఉండదు- ఉంటే కొమ్ములమీనేసుకుంటది.

అంబోతు గట్ల అడుగులడుగేసుకుంట- పక్కసూపులు సూడకుంట ఊరుదిక్కు నడుత్తది- ఊళ్లె అంబోతు ఈకొసకు జొచ్చిందంటె "అంబోతత్తాందన్న అర్త" ఆకొసకు సేరుకుంటది- అది బజాట్ల కచ్చిందంటే బజాట్ల మనుషులు ఎక్కడోల్లక్కడ ఆగిపోవాల్సిందే- బండ్లు ఓరగ్గొట్టుకొని నిలబెట్టుకోవాల్సిందే- అది గన్పడ్డదంటె ఊరోల్లు పబ్బతులు బట్టుకొని కోతిమొక్కులు మొక్కుకుంట నిలబడి అదిపోయినంక కదులుతరు.

గట్ల అంబోతు అడఆడలు దిరుగుతది. అక్కన్నుంచి సీదా దచ్చినానికి తిరిగి తుమ్మల బీళ్లు దాటుద్ది- తుమ్మల బీళ్లకావల ఎకురా అరెకురం బూములున్న బక్క రైతుల ఆరువొలు దానికండ్లబడ్తయి. తుమ్మల బీళ్లెనుంచిసీదా ఎవని పెరట్లనో జొత్తది.

మంచెల మీద పోరగండ్లు లబ్బర లిబ్బర మొత్తుకుంట పీపాలు, రేకుడబ్బాలు కొడుతరు.... రైతులు కాళ్లవనుకంగ ఎటూదోసక ఆగమాగమైతరు.... ఎవడో పడుసోడు కండ్లకు నెత్తురురాంగ ముల్లుగర్ర బట్టుకొని ఉరికత్తడు. అంబోతు నెత్తురు బొట్లోలె నీల్లుగట్టుకొని పెంచిన మక్కగర్రలు పడుగ్గు పడుగ్గునిరుగంగ పెరట్ల ఉరుకులు పరుగులు బెడ్తది- కొమ్ములతోని సిమ్మతది- పీసుల పీకిపారేత్తది.... పడుసోని ముల్లుగర్ర గాలిలకులేత్తది. అనయ్య పడుకుంట లేసుకుంట ఉరికత్తడు.... సేతుల కట్టె గుంజుకుంటడు.

"రామేశ్వరసామి గంపంత కన్నుబెట్టుకొని ఏడున్నవో బాంచెన్- ఏం మొక్కులు తక్కువ జేసిన బాంచెన్...." ముసలోడు గజగజ వనుక్కుంట మొక్కుతడు.

రాయేశ్వరసామి మొర ఇనడు- పెరడిసత్తె నాశిడం పుత్రిపూజ సేసినంక పళ్లో పెరట్లకురుకుతది.

"వారీ! సాంబయ్యా! అంబోతు పెరట్ల సొచ్చిదంటె అని పెరడికి అగ్గిమల్లె దాకినట్టె, అనింటికి అగ్గిదాకినట్టె, అనిఅరువం దొంగలు దోసినట్టె. అంతవరదనుక అదలకుంటచ్చిన అంబోతుకు ఏంబుడుతదోరా! పెరడంతగత్తి తిరిగినట్టు ఉరుకుతది. పొల్లుపొల్లుకాంగ సెంగలిత్తది. పెడీ పెడిన లెంకలేత్తది...."

కండ్ల ముంగట అరువం సత్తెనాశిడం కాంగ దూరంగ నిలుసుండి సేతుల్లకు రుమాలు దీసుకొని కండ్లపొంట నీల్లు దీసుకుంట వలవల ఏడువాల్సిందే.

అరుగాలం కట్టపడి, నోటికాడికచ్చిన పంట సత్తెనాశిడం కాంగ రైతుకుకండ్లకు నెత్తురత్తది. కడుపుల పేగులు నోట్లెకత్తయి. అంబోతును తరిమి గొట్టాల్నంటె రెండుభయాలు ఊరోల్లకు ఒకటేమొ దొర బతుకనియ్యడు.... రెండోది దేవునికి కోపమొత్తది. ఇద్దరికి కోపమచ్చినంక మరింక గీ భూమ్మీన బతకడం కట్టం....

అంబోతు గట్ల ఏష్టచ్చెదనుక సయ్యాటలాడి. ఎసల్లేల్లకు మెల్లెంగ కంచెలకెల్లి బోతది.

కంచెల్ల గొడ్లబోయిలు గజగజ అనుకుతరు. అంబోతు ఎదబడ్తది. అంబోతును జూత్తెనే ఆవులు పెండబెట్టి ఎటుదటు ఉరుకుతది. ఉరుకసాతగానిది దొరికిదంటేసచ్చిందే గట్లకంచెల్ల ఎడ్లగొడ్ల సెదురగొట్టి బారెడు పొద్దున్నదనంగ మల్ల ఊరుసొత్తది.

ఎదురచ్చిన కట్టెల బండ్లు ఆగిపోతయి.... కాండ్ల మీని బక్కోడ్లు గజగజ లాడ్తయి.... ఊల్లె పోరగాండ్లురుకుతరు.... ఇండ్లకు మళ్లిన గొడ్లు ఆగమాగమయి తయి.... నీల్లకుబొయినోల్ల కాల్లు తత్తరబడ్తయి.... మునిమాపటేల్ల ఊరును గజగజ లాడిచ్చి గప్పుడు దొడ్డి తోవబడ్తది.... గప్పుడు ఊరు ఊపిరి దీసుకుంటది.

అగో గట్ల దొరకు దొర అంబోతుకు ఎదురు లేకుంట కొన్ని ఏండ్లు గడిసినయి.

గ ఊల్లె దొరతోని, దొర అంబోతుతోని ఎన్ని బతుకులు పెడిపోయినయో లెక్కలేదు.... లచ్చలు లాకులు.

గిది గిట్లుండంగ బతుకు దెరువులేక బొగ్గుబాయిలకు బొయిన లచ్చన్న బాయి దొరలు బాయి లాంగ్ బార్ పేత్తె పుట్టినూరికి పెండ్లాం పిల్లలతోని తరలచ్చిండు. కోటి

అవుతారాలెత్తినా కోండ్రికు మంచిందిలేదని గునాంచుకున్నడు. తెల్లంగీలు, సన్నపు ధోతులిడిసి దొడ్డంగీలు, దొడ్డుధోతులు గట్టిండు.

కరువుకు, గత్తరకు, అప్పుకు, సప్పుకు, మంచికి సెడ్డకు ఊడ్సుక పోంగ లచ్చన్న అయ్య ఆశన్న కొతుల గద్దల గొట్టి రెండెకురాల పెరడి దక్కిచ్చిండు. గ దక్కిన పెరట్ల నెత్తురు కలికలి జేసుకొని, మన్నుబుక్కి మన్నేర్గిండు లచ్చన్న. ఊళ్లోల్లందరు "పాపం పోరడు బవుకట్టపోతని" మెచ్చుకున్నరు. అచ్చినేడు లచ్చన్న పెరడు కంకవనమోలె పెరిగిపోయింది. పెరడుజల్లుపీసు మీనుండంగ అంబోతుసొచ్చింది.

ఆశన్న అంబోతు సుట్టు దిరుక్కుంట కోతి దండాలు బెట్టిండు. అంబోతు దండాలు దాపెండ్లు ఖాతరుజెయ్యలే. ఎటూ సాతకాక బాయిగడ్డమీనికెక్కి మొఖాన కొంగుబెట్టుకొని ఏడ్సిండు. ఏడిత్తె కండ్లనీల్లే పోతయని లచ్చన్న ముల్లిగట్టె అందు కొని పెరట్లకురికిండు. అంబోతును అదిలించిండు. అంబోతయితె ఎల్లిపోలేగని సందెలు బడేయేల్లకు దొర దగ్గెర నుంచి పిలుపచ్చింది. పోవన్నా అద్దా అని ఇసార పడేటాల్లకే సుంకరోల్లు గడిలకు గుంజుకపోయిండ్లు. నోరుదెరిసి కట్టం సుకం జెప్పు కుందామనుకునేటాల్లకే నోరు మూసిండ్లు. కండ్లల్ల నెత్తురు జిమ్మేటాల్లకే కట్టేసిండ్లు. కండ్లుమూసి తెరిసేటాల్లకు లచ్చన్న నెత్తురు ముద్దయిపోయిండు. మరి కాసేపటికి బజాట్ల దుబ్బల పడిపోయిండు.

సూసిన ఊరిజనం "చ్చొచ్చొ" అన్నరు కొందరు. "మెడబలిమి" అన్నరు ఊరిపెద్దలు. "పాపమా పచ్చిఘాతా" అన్నరు ఆడోల్లు. "కాదు గిది అన్నాయెం" అన్నరు పడుసోల్లు. లచ్చన్న తల్లి భూదేవి కొడుకును లేపుకొని దొర గడిమీన ఇంత మన్నుబోసి ఇంటికి దీసుకపోయింగి. లచ్చన్న పెండ్లం ముత్తమ్మ సప్పుడుకాని ఏడుపు ఏడ్సుకుంట ఉప్పుకాపింది. ఆశన్న కడుపుదేవి గ నాత్రింత సిల్లులు బడ్డ గుడిసెకప్పు సూసుకుంట ఉపాసంపన్నడు. లచ్చన్న కోలుకోను నెల్లాల్లు బట్టింది. మంచాల నెల్లాల్లు ఎన్నో ఇసారాలు దోసినయ్. తనొక్కడు ఎదురుతిరిగితే ఏమయితదో తెలి సచ్చింది. మరెట్ల బతకడమో ఎంత ఇసారం జేసినా అంతుసిక్కలే.... మరంద్బేత బతుకాల్నంచె ఎదురుతిరుగక తప్పదు.... అట్లా గుంజాటన పడుకుంట తిరుగంగనే పక్కూల్లల్ల బీదిబిక్కి ఆర్తలు దెలిసినయ్.... బతుకుదెరువు గురించి పక్కాల్లు సెప్పిన సేసిన ముచ్చట్లు సెవులేసుకున్నడు.

ఇగ గప్పటినుంచి లచ్చన్న కాలుకు బట్టకుంట తిన్నకూడు పెయిన బట్టకుంట ఇల్లిల్లు దిర్గిండు. మోటలు గొట్టేకాడ ముచ్చట్లు బెట్టిండు. నాగండ్లు నడిసేకాడ

ఇసారాలు జేసిండు- కోతలుగోసేకాడ కతలు సెప్పిండు ... ఏడేంది ఏడబడితాడ తిరిగి లచ్చన్న జనంనోట్లె నాలికయ్యిండు.

జనం ఇసారాలు ఒక్కటయినయ్. రోజుకొకని బూమిగద్దలు తన్నుకపోతంటె రోజుకొకని ఈపుమీన అట్టలు దేల్తాంటె- కడుపుకు జాలనోల్లు, తన్నులు గుద్దులు దిన్నోల్లు, దండుగలు, ఎట్టిలు జేసినోల్లు సాటుమాటుకు గుసగుసలాడిండ్లు- మంచెల మీద పదాలు మొదలయినయ్. సెలుకలకాడ పేండ్లకాడ పదాలు జోరయినయి సిటుక్కున సీకటయ్యిందంటె ఊళ్లన్న పడుసు పోరగండ్లు గుజాలు వట్టెటోల్లు- దప్పులుగొట్టె టోల్లు, పంచాల పెద్దులు జమిడికెసెటోడు. సాకలి మల్లిగాడు సుతిపట్టెటోడు.... అగ్గిగట్ల రాజు కుంటంది.

గది సూసిన సాడిగాట్లోలకు నిప్పుసంగతి ఎరికగాలే- పాటలుపాడ్తె భాగోత మేత్తరు గావచ్చనుకున్నరు అడలాడ్తె సిరుతల రామందెమేత్తరు గావచ్చనుకున్నరు.

ఓనాడు....

సాకలి సెందురుగాడు ఏదో ఖ్యాలిలుండి దొరసత్తిమీన సలసల మసిలే ఉడుకు నీల్లు గుమ్మరిచ్చిండు. దొర పెయిమీన బొగ్గలుబొడిసినయ్- సెందురుగాని ఈపుమీన గుబ్బలు దేలినయ్- గుబ్బలు సూపుకొని సెందురుగాడు అందరి ముంగట ఏడ్సిండు. అక్కడున్నోల్లంత ఏడ్సిండ్లు- ఏంజెయ్యాల్నో ఎవలకు తోసలే- ఏంజెయ్యకుంటనే పది దినాలు గడిసిపోయినయ్.

అంతట్లకే ఆనకాలమచ్చింది- గడియు పుర్సతులేకుంటయిపోయింది.

గంతట్లకే సర్కారోల్ల మోటర్లచ్చి మాదుగులకు ఇండ్ల జాగాలిత్తమన్నరు. దొర ఊరుబందుకున్న ఎంకటి రెండెకురాల పెరడి సూపెట్టిండు- సర్కారోల్లు మల్లచ్చి ఎంకటి లబలబ మొత్తుకోంగ ఇండ్లజాగల పట్టాలు పంచిపెట్టిన మన్నరు.

లచ్చన్న గ నాత్రి అందరిని కుప్పేసి అయిదు నూర్లెకురాల బూమిగల్గినదొర- పరంపోగులు, షికం, కారజ్‌కిత్తాలు మడ్డికిందేసుకున్నదొర- అగో గ దొర పెరడి ఊరిబందుకు ఇరువైఎకురాలున్నది గదాంట్లనే ఇండ్లుగట్టుకుందాం అన్నడు.

గమాట మంచిమాటగనే దోసింది- నాత్రికినాత్రి దొర పెరట్ల గుడిసెలు లేసినయ్.

తెలారి దొర సింగిబింగాడి మాదుగుల బిలిపిచ్చి-

"వారీ! మాదుగులు ఎనుకటినుంచి కట్టానికి, సుఖానికి మిమ్ముల ఆదుకుంటత్తె గీపని జేసిండ్లు బిడ్డా! మంచిమాటకు ఇయ్యాల్ల గుడిసెలు పీక్కుంటరో లాపోతే...." దొర ఇంట్లకుబోయిండు.

మాదుగులు ఇండ్లుపీకలేదు- నాత్రి గుడిసెలు కాలిపోయినయ్ మాదుగుల మనుసులు మండినయ్.

కరకర పొద్దుపొడిసేటాల్లకు గడిముంగట ఊరిజనం పేరిపోయిండ్లు- ఎవడు మొత్తుకునేది ఆడుమొత్తుకున్నడు- నెత్తిమీదికి పొద్దచ్చేదనుక గడిముంగట కూసున్నరు. బంగుళమీన్నుంచి సూసినదొరకు లచ్చన్న బండెక్కి- ఏందోసెప్పడం కనిపిచ్చింది. ఎట్ల కుప్పకూడినజనం అట్లనే ఎల్లిపోయిండ్లు-

ఊరు బయంతోని బిగుసుకపోయింది.

రెండోనాడు కోతకచ్చిన లచ్చన్న మక్కపెరడు దొర గొడ్లమంద ఏర్లులేకుంట పీక్కతిన్నయ్- ఏడుపుల్లనుంచి కోపం పుట్టకముందే పోలీసులచ్చి లచ్చన్నను తాలూకా ఠానాకు పట్టుకపోయిండ్లు- పోలీసోల్లు ఊల్లెజొచ్చి కనిపిచ్చినోన్నల్ల తన్నిండ్లు పట్టుకపోయేటోల్ల పట్టుకపోయిండ్లు- ఉన్నభూములమ్ముడుబోయినయ్- కడుపుల్ల మంటలు రవులుకున్నయ్-

దొరసంబుర పడీపడకముందే రాజీపోయి రాజచ్చింది- జేల్లల్లోల్లను ఇడిసి పెట్టిండ్లు. పోయినోల్లు మల్లచ్చేటాల్లకు ఊరు పాడుబడ్డది- ఎవ్వడూ మాట్లాడడు- కండ్లెత్తడు.

"రోగంతిరిగింది లంజకొడుకులకు" అనుకున్నడుదొర కని నిచ్చానికి రోగం ముదిరింది.

ఈపారి ఊల్లెకు అచ్చేపోయేటోల్లెక్కువయిండ్లు- ఇంతట్లకే ఆసకాలమచ్చింది.

కయికిల్లకెగబడే కూలోల్లు కూల్లుపెరుగాలన్నరు- నేంబెంచనేపెంచనన్నడుదొర. కూలోల్లు దిగిరాలే- కారణాలుదెలిసినదొర కారాలు మిరాలు నూరిండు- కయికల్లెక్కినయ్- నాట్లేపేటాల్లకు నారుదొయ్యలు పొట్టకచ్చినయ్.

ఈపారి దొర గజ్జెలకచ్చులం అచ్చేటాల్లకు అనుమండ్ల గద్దెకాడ పంచాతులుంట లేవు- అన్నుంచి తాళ్లల్లకచ్చేటాల్లకు తాళ్ళను గౌండ్లోలసంఘమే హరాజ్జుపాడింది- సెట్లమామూల్లు బందయినయ్- గొల్లోల్లసంఘం అంతుపిల్లలు, ఎట్టిమందలు బందు జేసింది- జంగలాతు మామూల్లు బందయిపోయినయ్.

గియ్యన్నేంది దొరపని ఈడిదిలబడ్డ ఎలుక సద్దమయ్యింది- దొర జేసేపనులు దొరజేత్త నేడున్నడు- పోలీసోల్లు "ఊఁ" అంటె ఉరికత్త నేడున్నరు- రోజుకొకన్ని పట్టుకపోతండ్లు- ఎవలో జమానతుబడి ఇడిపిచ్చుకత్తండ్లు- ఊరుఊరంత ఒక్కటయితె- దొరపట్టు పోలీసోల్లయ్యిండ్లు- తన్నులు గుద్దులతోని జనం అంగిపోతరను కుంటె అంతకంతకు రెచ్చిపోయిండ్లు-

రెచ్చిపోయినజనం దొర కబ్జాసేసుకున్న అడివి గొట్టుకున్నరు- కప్పులాలు కదులకముందే జంగలాతోల్లు, పోలీసోల్లు కదిలచ్చిండ్లు- కట్టెలకు తుపాకులకు కసేపు ఇజ్జంజర్గింది. కట్టెలిరిగిపోయినయ్ బండ్లు జంగలాతు అమీనింటికి బోయినయ్.

గిది గిట్లుండంగ మాలిపటేలోడు మంగలి అంకూశవ్వను గుంజిండు. దిక్కులేరనుకున్న అంకూశవ్వకు మాలిపటేలోడు కండ్లు మూసిదెరిసెటాల్లకు సుట్టూర మంది గిరేసుకున్నరు. మామిండ్లల్ల మాలిపటేలోని మొత్తుకునుడు మాయమయ్యింది. మాపటేల్లకచ్చిన పోలీసోల్లకు మామిడితోట్ల ఎర్రిమట్టి సుత దొరకలేదు. నాత్రి బరండికీసలు దాగి ఇసారాలుజేసి కేసులు రాసిండ్లు- అచ్చన్నను మల్ల జీబెక్కిచ్చుకపోయిండ్లు-

మక్కంకు లిరిసిండని మాదిగిపీరన్ని దొర నెత్తురు కక్కంగ గొట్టిండు- కుప్ప కూడిన జనం మక్కపెరడుగే ఎసరుబెట్టిండ్లు- ఊళ్లోలందరిని దొమ్మి కేసులిరికిచ్చిండు దొర....

గప్పుడు ఊళ్లోలందరు దొర పనులు బందుజేసిండ్లు-

ఏరుట కచ్చిన పెసరు గుడ్డాలు పలపల పలిగి బూమిల గల్సినయ్- దొడ్లల్ల గొడ్లు దొడ్లల్లనే పెండలు బెట్టినయ్- దొర లేసేటాల్లకు సాకలి సెందురడు పండ్ల పుల్లియలే- దొర పట్నమురికిండు- పోలీసోల్లు గొడ్లిడిసి కాయరాక దొరను మనుసుల తిట్టిండ్లు- సుందరమ్మ రాక దొర్సాని పేతులు పొక్కలచ్చినయ్,

అరందినాలు గడిపెటాల్లకు దొర గడంత పాడుబడిపోయింది. దొరకు గడ్డం బెరిగింది. పోలీసోల్లు సాకలోన్ని దొరికిత్చుకున్నరు. ఆడు పానంబొయినా సంఘాన్ని డువ నన్నడు.

ఊరుగడిమీనికచ్చింది. సాకలి మల్లిగాన్ని ఇడిపిచ్చుకున్నది.

దొరకు బుగులు జొచ్చింది. ఎనుకాముంగట ఇసారం జేత్తె ఎటుసూసిన ఏడే మానుకలున్నది. పోలీసోల్లు పీక్కతింటండ్లు- పనులోల్లురాక గడిమురిగిపోద్ది-

కూడుకుమ్ము లేక తామంత మురిగిపోతరు. మాలిపటేల్‌కు బట్టిన గతి తనకు బడితే.

గిట్ల ఇసారం జేసుకొని పెండ్లాంపిల్లల ఎంటేసుకొని బతికుంటె బరండన్న తాగచ్చునని పట్నానికెల్లిపోయిండు- గడితలుపులు మూసుకున్నయ్- గడికి తాళంకప్పబడ్డది.

"గడంతెరికేగని గ అంబోతు సంగతి జెప్పు...." సాంబయ్య.

"అత్తన్నరా! గాడికే అత్తన్న...." గంగయ్య ఇత్తడి సెంబులనీళ్ల గటగట తాగిండు.

మనుషులు బతుకుదెరువు లేకపోతె దేశాలు దెగిచ్చుకపోతరు. దొరకు పైక మున్నది- పట్నంల బతుకపోయిండు మరి పసురం గ అంబోతేడబోద్ది....?

అంబోతు లేసెటాల్లకు ఉచ్చబట్టెటోడులేడు. పెండదీసెటోడు లేడు. మాలీషు జేసెటోడులేడు. పల్లిపిండి బెట్టెటోడులేడు- నీల్లు మూతికాడ బట్టెటోడులేడు. పెయి కడిగెటోడులేడు....

అంబోతు పెండదొక్కి- పెండలబన్నది. సలువగుడ్డసొంటి దానిపెయ్యి దుబ్బ, రొచ్చు పెండంటి వికారమైపోయింది. గోమార్లు పెయ్యంత బట్టినయ్- మూడోనాడు ఆకలికాగలేక తలుగుదెంపుకొని దొడ్డెనుక పనుగడి ఇరుగ దొక్కి- ఈతలకచ్చింది. కడుపుల సురసుర కాల్తంది. దానికి నిలుసుండి నీల్లుదాగటం, నిలుసుండి మేయటం తప్ప అంగితినుడెర్కలే-

ఎర్రిలేసిన దానితీర్గ బజార్ల పొంట ఉరికింది.... ఊల్లె దిరుగంగ గదాన్నిసూసి ఎవడూ కోతి దండంబెడ్తలేడు- ఎవడు ఆగిపోవుటం లేదు. గిద్యేమి సూడకుండ తుమ్మల బీడుదాటి రైతుల పెరండ్లమీన పడ్డది. ఒక్క- బుక్క- అందుతున్నదో లేదో? బాణపుల్లతీర్గ ఒకడురికచ్చి పడెల్లున పంతమీన కొట్టిండు- కండ్లు పులపొడిసేటాల్లకే పెడీపెడిన దెబ్బలు, పోరగండ్లు మట్టిపెళ్లల అర్షం గురిపిచ్చిండ్లు- ముసలోల్లు అనెకెల్ల ముల్లుకట్టెలతోని పొడిసిండ్లు- తిట్లు- దెబ్బలు- కోపంతోని బుసకొట్టబోయిన అంబోతు పెయ్యంత ముల్లుగుచ్చ సందులేకుంట సిదుగబొడిసిండ్లు- ఎటూ సాతకాక ఆరువంల నుంచి గెట్టుమీని కురికింది...., కట్టెలు బట్టుకొని రైతులు దానెంట బడ్డరు.

గెట్టుమీన నిలుసుండి అంబోతు కసేపు ఇసారంజేసింది- పసురానికి గిది సమఝుకాలే- పబ్బతిబట్టిమొక్కె- రైతులకేంబుట్టిందో? అన్నుంచి ఇంకోసేను- ఇంకోసేండ్ల ఇంకిన్ని దెబ్బలు.

మాపటేల్లదనుక ఎర్రిలేసిన కుక్కోలె దిరిగింది- దాని పెయ్యంత పచ్చిపుండయి పోయింది... వసికేకాళ్లతోటి పశురాలు ఇండ్లకు పేరేయెల్లకు ఊళ్లెసొచ్చింది- పసురాలు అంబోతును ఖాతరుజేయలే- ముసలావులు రాక్కుంటబోయినయ్- పొట్టగిత్తలు పెడీపెడీన లెంకలేసి గెదిమినయ్- ఆ పోరగండ్లు తోకపట్టబట్టి కొట్టిండ్లు- ఆటుదికి ఇటురికి దాని లంగులుదెగినయ్- సందెలుబడేయేల్లకు గడిముంగటికి జేరుకున్నది.

గిట్ల నెలదినాలు అంబోతు ఆడుగొట్టవీడు గొట్టతిర్గింది. దొక్కలు బొక్కల కంటినయ్- తోకమట్టకాడ గండిబడ్డది. దెబ్బలు పుండ్లయినయ్- పుండ్లమీన ఈపులు బెట్టినయ్- గిప్పుడు అంబోతు దొబ్బుతె పదిజాగల్ల పడేటట్టుగయిపోయింది.

నెలదినాలబట్టి ఊరెందుకు మారిపోయిందో? గడికెందుకు తాళంబడ్డదో దానికి ఎరికగాలే పసురంగన్క.

ఆఖరుకు ఓనాటి అంబటాల్లకు తిరిగి తిరిగి బేజారైపోయి అనికేకాళ్ళతోని గడిముంగటికచ్చింది- మోరెత్తి గడిని పులుకు పులుకున జూసింది- పటపట కండ్ల బొంట నీళ్లగారంగ గడిసుట్టు గత్తి దిరిగింది. ఆఖరుకు మరింక కదులరాక గడిముంగటి కచ్చి వారీ! సాంబయ్య! గజగజ అనుక్కుంట- సిలసిల ఉచ్చబోసి పెండబెట్టి దబెల్లున భూమ్మీన కూలబడిపోయి- గిలగిల తన్నుకుంట- "అంబా" "అంబా"అని ఒర్రుకుంట జానెడు నాలికెల్లబెట్టి పానమిడిసింది- వారీ సాంబడూ! ఎందుకునచ్చిందో ఎరికయ్యిందా? అంబోతుకు ఊరిసంగతి ఎరికయ్యిందన్నమాట" గంగయ్య దీర్ఘంగా నిట్టూర్చి చప్పున నోరుమూసుకొని మౌనంగా ఉండిపోయాడు. అప్పటికి ఊళ్లె కోళ్లు గూసినయ్- వెన్నెల పడమటివేపు ముఖంమాడ్చుకున్నది. సింతసెట్లనీడలు తూరుపు వేపు పెరిగిపోయినయి- తెల్లారేచుక్క తూరుపుదిక్కున జిగేల్ జిగేల్మని మెరుస్తోంది.

గంగయ్య తుప్పుక్కున ఊంచాడు.

సాంబయ్య మంచంలో లేచి కూర్చున్నాడు- అతనిశరీరం ఎందుకో దేవుడు పూనిన విధంగా వనుకుతోంది- కండ్లల్లో గుబగుబ నీళ్ళూరినయ్- ఆ గుడ్డివెన్నెలలో గంగయ్య ముఖం తేరపారి చూశాడు- నిద్రలేని గంగయ్యకండ్లు కమ్మరికొలుము లోలె మండుతున్నాయి- మంచంలో కూర్చున్న గంగయ్య గుడిమెట్టుతీరుగా కనిపించాడు

ఎలుగురాసిన గొంతికతో గంగయ్య ఇట్లా చెప్పుకొచ్చాడు-

"వారీ! సాంబడూ! కాలంమారుతంది- మనుషులు మారుతున్నరు. బాంచెగాడు తనబతుకు గురించి తెలుసుకున్నడు- బాంచెగాళ్ళంతా సంఘ మయితండ్లు- నలనల్లని రేగల్లు బలుకదున్ని పుట్లకొద్ది ధాన్నెంపండిచ్చి లోకాన్ని సాదుకచ్చె బాంచెగాడు,

గుట్టలు పలుగ్గొట్టి బంగుళాలుగట్టిన బాంచెగాడు- ఇనుము, ఇత్తడిజేసిన బాంచెగాడు- అగో గసొంటి బాంచెగాడు అట్టలుగట్టిన సేతులు కొడవండ్లు, గొడ్డండ్లుజేసి పర్రి సిండు- వారీ! సాంబయ్యా కొలిమిరవులుకున్నది. సెముటమండుతంది. ఇగ సూసుకోరా బాంచెగాళ్ళదెబ్బ! గిప్పుడుసూస్కో! గది అంబోతుతీర్గ ఎరుకసేసుకోవో? పసురంతీర్గ కానకుంటివో గది నీతప్పు.... గిన్నేండ్లు మన నెత్తిమీనికెక్కి- సవారి జేసిన దొరలకేగతి పట్టనున్నదో ఇచారంజేయి.... సాంబయ్యా! నాకొడుకును ఎనకకు బొమ్మన్ననో ముంగటికి నడువుమన్ననో నువ్వేసెప్పు.... మనమే అని తొవ్వల నడువనో! నువ్వేసెప్పు...." గంగయ్య కంఠంలో కొంచెం తీవ్రత తగ్గింది.

"నాకొడుకు మొదటోడె కాదన- నాకొడుకు గ నిప్పులగుండల నుంచి మీదికి తేలత్తడని సంబురపడ్తలేను.... అడుగడాంట్ల మలిగిపోయిన నేను ఏడ్వ! ఏడ్వే టందుకేమున్నది? గౌరవ్వా! బిడ్డా! నాకో మనుమన్నియ్యితల్లీ! నాకొడుకు జండెత్తుకొని ముంగటికి నడిపే మనుమన్నియ్యి.... నాతల్లీ!" ఎందుకో గంగయ్య కంఠం ముద్దముద్దగా రాసాగింది.

గౌరమ్మ లేచివచ్చి మామ నోరు మూసింది.

సాంబయ్య అమాంతం లేచి గంగయ్య కాళ్ళమీద పడిపోయిండు గంగయ్య పాదాలమీద వెచ్చటి కన్నీళ్లు-

గంగయ్య మరేమి మాట్లాడలేదు సాంబయ్యను లేపి కూర్చుండబెట్టాడు.

"పసురాన్ని బావా! పసురాన్ని" సాంబయ్య గొణుగుతూనే ఉన్నాడు.

"గౌరవ్వా పోదాంనడు బిడ్డా! తెల్లారింది." గంగయ్య దుమాలుచుట్టుకున్నాడు.

లచ్చిమి ఇంకా వెక్కుతోంది.

గౌరమ్మ చీరె మూట పట్టుకొని తయారయ్యింది- లచ్చిమి బిడ్డను బిగ్గరగా కౌగలించుకొని ఏడ్చింది. కుంకుం బరిణెదెచ్చి ఎర్రకుంకుంబొట్టు బిడ్డనుదట బెట్టింది.

గంగయ్య లేచి నిలుచున్నాడు. పడికోడి కూసింది.

గంగయ్య గుదుపకర్రకు కోడలు బట్టలమూట తగిలిచ్చుకున్నాడు. మామ ముంగట కోడలు వెనుక తూరుపురేకలు బారుతుండగా తూరుపువేపునడిచారు....

సాంబయ్య లచ్చిమి కరకర పొద్దుపొడిసేదాకా బీరిపోయి చూసుకుంటూ నిలబడిపోయారు.......

దారిపొడుగున కోడలుకు మరిన్ని కథలు చెప్పుతూనే ఉన్నాడు రైతుకూలిసంఘ అధ్యక్షుడు గంగయ్య....

గతితార్కిక సాహిత్య భౌతికవాదం: ఒక పరిశీలన

ఏటుకూరు బలరామమూర్తి

[సృజన 1980 జూన్ - జులై సంచికలో వచ్చిన త్రిపురనేని మధుసూదనరావు ప్రసంగ వ్యాసం గతితార్కిక భౌతికవాదంపై 'అభ్యుదయ' 1981 ఫిబ్రవరి సంచికలో ఏటుకూరు బలరామమూర్తి గారు పరిశీలన రాశారు- సృజన పాఠకుల సౌకర్యం కోసం 'అభ్యుదయ' నుంచి ఆ పరిశీలన మళ్ళీ ప్రచురిస్తూ త్రిపురనేని సమర్థనను ప్రచురిస్తున్నాం. ఈ విధంగా ప్రారంభమైన ఈ సిద్ధాంత చర్చలో పాల్గొనవలసిందిగా పాఠకులను ఆహ్వానిస్తున్నాం.
సాహితీమిత్రులు]

గతితార్కిక భౌతికవాదం అనే భావనఉంది. దానికి 'సాహిత్య' పదాన్ని జోడించి, 'గతితార్కిక సాహిత్య భౌతికవాదం' అనే కొత్తభావనను విరసం కార్యదర్శి శ్రీ త్రిపురనేని మధుసూదనరావుగారు ప్రవేశపెట్టారు.

సృజన (1980 జూన్-జులై) సంచికలో యీభావనను వివరిస్తూ సుమారు పది పేజీల వ్యాసం వ్రాశారు.

గతితార్కిక సాహిత్య భౌతికవాదం సాహిత్యాన్ని ఆచరణగా మార్చగలుగుతుంది" అని ఆ వ్యాసంలో అన్నారు. ఇతః పూర్వమున్న గతితార్కిక భౌతికవాదం ఈపని చేయజాలదని, కనుక కొత్తభావన అవసరమైందని వారి ఊహకావచ్చు.

మార్క్సిస్టు తత్వశాస్త్రంలోగాని సాహిత్య విమర్శలోగాని కొత్తభావనలు, ప్రతిపాదనలు చేయటంలో దోషంలేదు. అయితే వెనుకటి భావనలు ప్రస్తుత పరిస్థితికి సరిపోవని నిరూపించి, కొత్తభావన ఆ కర్తవ్యం నెరవేర్చుతుందని చెప్పగలగాలి. ఆ ప్రయత్నం యీ వ్యాసంలోలేదు. వ్యాసంఅంతా సూత్రీకరణల రూపంలో సాగింది. ప్రతివాక్యమూ ఒక సూత్రమే. దేనికి దానికై పరిశీలిస్తే యీసూత్రాలూ, సరియైనవా, కావా అని చెప్పటంకూడా చాలాకష్టం. మొత్తంగాచూస్తే వీరిసూత్రీకరణలన్నీ ద్వంద్వాల, వాటివిభేదాల రూపంలో సాగుతాయి. చూడండి.

1. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానమన్నా, గతితార్కిక భౌతికవాదంఅన్నా ఒకటే.

మార్క్స్, లెనిన్‌ల సరసన మావోను ప్రతిష్ఠించటం పూర్తిగా అసంగతం. రాజకీయాల విషయం అలాఉంచి, తాత్వికంగానైతం మావో ఆలోచన, గతితార్కిక భౌతికవాదంకాదు, జడాత్మక భౌతికవాదం. ఆయన వ్రాసిన రెండు తాత్వికరచనలు

"వైరుధ్యాలు" 'ఆచరణ' యాంత్రిక భౌతికవాద సూత్రీకరణలతో, ద్వంద్వాలతో కూడుకుని ఉన్నాయి. మార్క్సిజం, లెనినిజానికి మావోయిజానికి తాత్వికంగా ఏ మాత్రమూ పొత్తుకుదరదు. ఈ తప్పిదమే యీ వ్యాసంనిండా బహురూపాలలో వ్యక్తమౌతున్నది. (ఇది ప్రధానంగా సాహిత్యవ్యాసం గనక, మౌలిక తాత్విక చర్చ లోకి వెళ్ళటానికి సందర్భంకాదు.)

2. గతితార్కిక భౌతికవాదం తత్వశాస్త్రంకాదు- సిద్ధాంతంకాదు. అన్వయశాస్త్రం, విప్లవశాస్త్రం, ఆచరణశాస్త్రం- పేజి 5.

శాస్త్రీయ పదజాలానికి రూఢి అర్థాలున్నాయి. ఉపన్యాస ధోరణిలో మాట్లాడితే అదొకరకం. సిద్ధాంతపత్రం సమర్పించేటప్పుడు మాటలఅర్థం తెలిసివాడాలి. తత్వశాస్త్రంఅంటే, ప్రకృతి, సమాజం, ఆలోచనల అంతర్గత సూత్రాలను వివరించే విజ్ఞానం. కనుక గతితార్కిక భౌతికవాదం ఒకశాస్త్రం. అదేసమయంలో, సోషలిస్టు సమాజ పరివర్తనకు కృషిచేసే కార్మికవర్గానికి ఇది సిద్ధాంతం. It is both a Science and ideology. మార్క్సిస్టు మేధావులందరూ చెప్పేమాట ఇది. పై రెండుమాటలు చాలనట్లు అన్వయశాస్త్రం, విప్లవశాస్త్రం, ఆచరణశాస్త్రం అనటం ఎందుకు?

వాడినా మొదటి రెండుభావాలకు, చివరి మూడుపదాలకు వైరుధ్యంచూపటం ఎందుకు?

3. సాహిత్యాన్ని పునాదికి ఉపరితలంగా కాక పునాది, ఉపరితలం కలిగిఉండే అవయవి, అవయవంగా పరిగణించాలి- పేజీ 6.

అవయవి, అవయవంఅనే మాటలద్వారా రచయిత, సాహిత్యానికి సాపేక్షకంగా గల స్వతంత్ర ప్రతిపత్తిని నిరాకరిస్తున్నారు. కాని ఆశ్చర్యమేమంటే వీరే, కొంచెం దూరంపోయి యీ క్రిందివిధంగా అంటున్నారు.

ఒక ఉపరితలం, మరొక ఉపరితలానికి కారణం కావచ్చు. రాజకీయాలు, తత్వశాస్త్రం, వ్యాకరణశాస్త్రం, మతం, తత్వశాస్త్రం సాహిత్యానికి కారణంకావచ్చు. అంతిమకారణమైన పునాది సాహిత్యానికి ప్రత్యక్షకారణం కానవసరంలేదు."

ఇది నిరభ్యంతరకర సూత్రీకరణ. అవయవి- అవయవం పోలికమాత్రం దీనికి కుదరదు.

మరికొంతదూరం వెళ్ళి (11 పేజి) "సాహిత్యానికి స్వతంత్ర ప్రతిపత్తి ఉంది అనటం తప్పుడుచైతన్యం" అంటారు.

కీలకమైన ఈ సూత్రీకరణపై వీరికి స్పష్టతలేదు. మార్క్సిజం-మావోయిజం అను పరస్పర విరుద్ధభావనల మేళవింపుతో ప్రారంభించారు. తనకు తెలిసో, తెలియకో ఈ గందరగోళంలో పడుతున్నారా? లేక మార్క్సిస్టులందరికీ ఆమోదయోగ్యమైన పదజాలం వాడుతూ ఆ పక్కనే మావోయిజం చేరుస్తూ, క్రమంగా పాఠకుడ్ని మావోయిజంవైపు నడిపించాలనే ఉద్దేశపూర్వక ప్రయత్నమా.

బహుశా రెండవఊహ సరైనదికావచ్చు.

పై సూత్రీకరణ ఎంత అసందర్భమో గ్రీకు సాహిత్యంపై వీరి వివరణచూస్తే చాలు.

"ప్రాచీన గ్రీకు సాహిత్యం ఆనాటి పునాదులకు అనుగుణంగాలేదు. ఈనాటికీ అదిచదివి ఆనందిస్తున్నాము. ఒకనిర్దిష్ట సామాజిక దశకుగాక ప్రపంచంలో ఉన్న అందరి జీవితాలకు ఆ సాహిత్యం ప్రతిబింబంగా ఉంది. ఇది మానవజాతి బాల్యదశకు చెందిన సాహిత్యం! ఆనాటి ఉత్పత్తిశక్తులు వెనకబడి ఉన్నప్పటికీ ఉన్నత సాహిత్యం ఉత్పన్నంకాలేదు. ఆ సాహిత్యానికి ఉత్పత్తిశక్తులు వెనకబడి ఉండటమే కారణం. అసమాన బాల్యదశ పునరావృత్తంకానట్టే ఆ సాహిత్యంకూడా పునరావృత్తంకాదు"

ఆనాటి ఉత్పత్తి శక్తులకంటె, నాటి సాహిత్యం ఉన్నతం అనటం ఇష్టంలేదు. కనుక నాటి సాహిత్య స్థాయికి ఆ ఉత్పత్తిశక్తులు పెరగలేదు అంటున్నారు.

ఇది మాటలగారడీ. అంతేకాదు. సాహిత్యస్థాయిని ప్రాథమికంగాను, ఉత్పత్తి శక్తుల స్థాయిని ద్వితీయంగాను చెప్పేస్ఫురణ ఉంది. మరి వ్యాసం నిండా ఆయన బోధించిన పునాది సిద్ధాంతానికి ఇది విరుద్ధమే!

సరే అలా ఉంచుదాం. 'మానవ సమాజానికి బాల్యదశ' అనే మాట మార్క్సది. మార్క్సను బాహాటంగా కాదనలేక మార్క్సిజం నుండే మావోయిజానికి పాఠకుడ్ని నడిపించే యత్నంలో రచయిత ఈ ఉదాహరణ ఇచ్చారు.

కాని మార్క్స భావాన్ని రచయిత ఏమాత్రం గ్రహించలేదు.

సుమారు 50 వేల సంవత్సరాల మానవ పరిణామంలో, ఆదిమ కమ్యూనిస్టు సమాజం, పాతరాతియుగం, కొత్తరాతియుగం లాంటి అనేక దశలు గడిచినమీదట, బానిస సమాజం ఏర్పడ్డది. శారీరక శ్రమకు, మేధో శ్రమకు విభజన మొదటిసారిగా ఏర్పడ్డది.

బానిసలు శారీరక శ్రమ చేసేవారు. ఆనాటి గ్రీకు సమాజంలో వీరే అధిక సంఖ్యాకులు– బానిస యజమానులు అల్పసంఖ్యాకులు– మేధో శ్రమ వీరికే పరిమితం తత్వవేత్తలు– రచయితలు, కవులు, కళాకారులు ఈ వర్గం నుండే ఉద్భవించారు.

అంతవరకు నిద్రాణమైన మానవ మేధస్సు ఒక్కసారిగా వికసించింది– ఈ వికసన బానిస యజమానుల వర్గంలోనే జరిగింది– కాగా మేధో వికసన కవసరమైన పూర్వరంగం, యావత్తు సమాజ స్పృహల సేకరణ, స్వీకరణ, జీర్ణీకరణ ద్వారా ఏర్పడ్డది.

ఇదొక గుణాత్మక మార్పు– విప్లవ పరిణామం– ఆకస్మిక లంఘనం– బానిస సమాజ ఆవిర్భావం ఈ విప్లవకర మార్పుకు సంధి బిందువు– గర్భస్థ శిశువు బాహ్య ప్రపంచంలోకి రావటం లాంటిది.

బాహ్య ప్రపంచంలోని గాలి, వెల్తురు, ధ్వని, రంగులు, చలి, వేడి, ఆకలి, దాహం ప్రతిదీ శిశువుకు ఆశ్చర్యజనకమైనట్లు, ఒక్కసారిగా నిద్రమేల్కొన్న మానవ మేధస్సు– వేలాది సంవత్సరాల సంచిత పరిజ్ఞానాన్నంతా నెమరువేసుకోసాగింది– ఈ ప్రయత్నంలో గ్రీకు సాహిత్యం ఉద్భవించింది

నిజానికి పెక్కుదేశాల ప్రాచీన సాహిత్యం ఇలాంటిదే– గ్రీకు సాహిత్య విశిష్టత ఎంతో, ప్రాచీన భారతీయ సాహిత్య విశిష్టతఅంతే– అందుకేమాత్రం తీసిపోదు.

ఇంతకీ ఆనాటి గ్రీకు సాహిత్య వస్తువు ఏమి?

నగర రాజ్యపాలకులయుద్ధాలు విధ్వంసాలు– ధైర్యసాహసాలు స్త్రీ లౌల్యం అధికారదాహం మాట పట్టింపు ఇలాంటి అనేకానేక మానవ ప్రకృతులు వాటికథా వస్తువు. ఈ మానవ ప్రకృతిని, నిర్దిష్ట సమాజ పరిధిలోని తాత్కాలిక కథా వస్తువు ద్వారానే వారు వ్యక్తం చేశారు– అది అనివార్యం– ఐనా నాటి మానవ ప్రకృతిలోని లోభ, మోద, మోహ, మద, మాత్సర్యాదులు, దయ, కరుణ, ప్రేమలాంటి మానవతా భావాలు ఈనాటి వరకూ ఉన్నాయి– ఇక ముందూ ఉంటాయి– కనుక నాటి గ్రీకు సాహిత్యంలో నాటి సమాజ ముద్రాఉంది మానవతా లక్షణాలున్నాయి– కనుకనే ఈనాటికీ మనం చదివి ఆనందిస్తున్నాము.

మధుసూదనరావుగారు ఈ విశ్లేషణ చేయరు– "ప్రపంచంలోఉన్న అందరి జీవితాన్ని ఆ సాహిత్యం ప్రతిబింబించి ఉంది" అనే మాటను– పేరుకు వల్లించారేగాని ఆ మాట అర్థమేమో ఆలోచించలేదు– ఆలోచించజాలరు.

ఆలోచిస్తే- ఆ వెన్వెంటనే వారు "సాహిత్యంలో సార్వజనీనత, సార్వకాలీనత" లేదు లేదు అని పదే పదే పునశ్చరణ చేయజాలరు కదా.

ప్రాచీన గ్రీకు సాహిత్యంలో నగరపాలక రాజవంశాలు దోపిడీ వర్గానికి చెందినవారు- కథావస్తువు, కాగా వారి దోపిడీని ఈ సాహిత్యం సమర్థించిందా? లేదే? పైగా అంతా విషాదాంతంగానే ముగుస్తుంది.

దోపిడీ వ్యవస్థపై ఇది ప్రచ్ఛన్న నిరసన, అసంతృప్తి- ఆనాటికి అంతకంటె ఎక్కువ ఆశించజాలం- అదే గొప్ప.

బానిసల బాధామయ గాథలు ఆ మహాకావ్యాలలో ప్రస్తావనకొచ్చాయి- పరోక్ష మైన ఈ ప్రస్తావనేకాక, Samson Agonistos కథ, భూగోళానికి బంధితుడైన Promotheus కథ ఏమి తెలియజేస్తాయి.

ఆనాటి సమాజంలో బానిసలను సంకెళ్ళతో బంధించేవారు- కవి ఆ భావాన్ని స్వీకరించి, మానవజాతినంతా Promotheus అనే బానిసగా భావించి, భూగోళానికి బంధించాడు- ఆ తర్వాత చాలాకాలానికి షెల్లీ వచ్చి, promotheus unbound కావ్యంలో ఈ సంకెళ్ళు ధ్వంసంచేశాడు- ఇదంతా సాహిత్యపరంగా సాగిన మానవ స్వేచ్ఛాపథ అన్వేషణ.

దీనినే మార్క్స్ Human alienation. వ్యక్తివైకల్యం అనే పదంలో తెలియజేశాడు.

బానిస సమాజంలో, బానిసలకే కాదు, బానిస యజమానుల వర్గంలోని వ్యక్తులకూ నిజమైన స్వేచ్ఛలేదు- ఆ పరిధి అధిగమించిన సోక్రటీస్, విషంత్రాగి ఆత్మహత్యా పాలైనాడు.

నిజజీవితంలోలేని స్వేచ్ఛను ఊహా ప్రపంచంలో కవిత్వంలో, తత్వశాస్త్రంలో మతంలో కల్పించుకొని తృప్తిపడటం మానవలక్షణం- ఈ వ్యక్తివైకల్యం, ఆనాటి సాహిత్యంలో, మతంలో, తత్వశాస్త్రంలో బహురూపాలలో వ్యక్తమైంది.

వ్యక్తి వైకల్య సమస్య ప్రకృతికీ, సమాజానికీ, సమాజానికి వ్యక్తికి మధ్య చర్య ప్రతిచర్యల సమాహారం- కమ్యూనిస్టు సమాజ ఆవిర్భావంతో ఈ సమస్యలోని ఊహాత్మకత నశిస్తుంది, భ్రాంతి తొలుగుతుంది- శతృత్వభావం రద్దవుతుంది. చైతన్య సహిత, స్నేహపూర్వక చర్య ప్రతిచర్యలు సాగుతూనే ఉంటాయి- ఇదొక నిరంతర యాత్ర.

వ్యక్తివైకల్య సూత్రం మార్క్సిస్టు సాహిత్య విమర్శనకంతా మూలం. కాడ్వెల్ రాల్ఫ్ ఫాక్స్ - తదితరులు ఈ సమస్యపై ఎంతో కృషిచేశారు. ప్రాచీన గ్రీకు సాహిత్యాన్ని అవలోకనం చేశారు.

బహుశా మధుసూదనరావుగారు వ్యక్తి వైకల్య సూత్రం ఆమోదించరు. వర్గ సమాజం- వర్గ సాహిత్యం అనే ద్వంద్వాలమధ్య బహు జటిలమైన గతితార్కిక సంబంధమున్నదని గుర్తించరు. నిచ్చెనలాగా, సూటిగా గంతులు వేయడమే మార్క్సిజం అనుకుంటున్నారు.

సాహిత్యం స్వారజనీనమా వర్గసమాజ బంధితమా అనేమౌలిక ప్రశ్నకు వద్దాం.

రచయితలు స్వీకరించే వస్తువులో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమకాలీన ప్రభావం ఉంటుంది. కొందరు సూటిగా సమకాలీన వస్తువును స్వీకరిస్తారు. 'మృచ్ఛకటికం' సంస్కృతంలోనూ 'కన్యాశుల్కం' తెలుగులోనూ ఇందుకు ఉదాహరణలు. ఎక్కువ మంది రచయితలు ప్రాచీన వస్తువును స్వీకరించినా వారి సమకాలీన భావాలు అందులో ప్రవేశిస్తూనే ఉంటాయి. ఈ భావాలు ఆయా రచయితలను బట్టి యధాతధ సూచకమో, తద్విరుద్ధమో అవుతూ ఉంటాయి.

బానిసలు, అర్ధ బానిసలు, భారతదేశంలో ఐతే అస్పృశ్యులు- లాంటి ప్రజల జీవితాలను కథా వస్తువుగా ప్రాచీన కవులు ఏల స్వీకరించలేదు? వారంతా దోపిడీ సమాజ సమర్ధకులైనందున కాదు- వ్రాసిన గ్రంథాలను చదివేవారు విద్యాధికులు, వారంతా ఉన్నతవర్గాలవారు. తమ పుస్తకం ధ్వంసమైనా ఫరవాలేదు అని భావించిన గుణాఢ్యుడు, సాంప్రదాయక భావనలకు భిన్నంగా రాసిన భాసుడులాంటివారు ఆనాడూ లేకపోలేదు.

కాగా సామాజిక దోపిడీని బాహాటంగా సమర్థించినవి ధర్మశాస్త్రాలు. దోపిడీని బాహాటంగా సమర్థిస్తూ పీడితులను న్యూనతపరుస్తూ రాసిన సాహిత్యానికి గౌరవం ఆనాడూ రాలేదు. బ్రాహ్మణాధిక్యతా ప్రధానమైన పురాణాలకు, మతవిద్వేష ప్రచార పరమైన శైవసాహిత్యానికి భారత రామాయణాలవలె సాహిత్య గౌరవం లేదు కదా.

ఏ మేరకు మానవత్వం, సార్వజనీనత ఉంటే ఆ మేరకు సాహిత్య గౌరవం లభిస్తుంది.

ఉపరితలంలోని ప్రతి రూపానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. తత్వశాస్త్రం కంటే భిన్నమైనది సాహిత్యం.

యథాతథ తాత్విక దృష్టిగల రచయితలు సైతం, సాహిత్యపరంగా గొప్ప కళాఖండాలు నిర్మించిన ఉదంతాలు పూర్వమూ ఉన్నాయి, ఈనాడూ ఉన్నాయి.

సమగ్ర ప్రాపంచిక దృక్పథం తత్వశాస్త్రం, నిర్దిష్ట సమస్యలలోని అమానుషత్వాన్ని, బహిర్గతం చేయటం సాహిత్యం Study of the Particular is the essence of Dialectics ఈ లెనిన్ వాక్యం అర్థం వీరు గ్రహించినట్లేలేదు.

వ్యాసం నిండా ఈ రచయిత గుప్పించిన ద్వంద్వాలను పరిశీలించుదాం.

బాహ్యగతితర్కం, ఆంతర గతితర్కం అని ఒకే విభజన చేశారు. గతితర్కం అంటే ఆంతరంగిక గమనసూత్ర అధ్యయన శాస్త్రం. బాహ్యగతితర్కం అంటే ఏమిటి? బాహ్య వైరుధ్యం ఆంతరంగిక వైరుధ్యం అని రచయిత ఉద్దేశమా? వైరుధ్య సూత్రం గతితర్కంలోని ఒక అంశమేగాని సర్వస్వం కాదు గదా!

చారిత్రికపాత్ర, సామాజికపాత్ర అనేది మరో ద్వంద్వం- ప్రాచీన సాహిత్యానికి చారిత్రిక పాత్రమే ఉన్నదట- మరిప్రాచీన సాహిత్యం ద్వారా ఈనాటికీ ప్రభావితులౌతున్న వారి విషయం ఏమిటి? ఈ ప్రభావం అనుకూలంకావచ్చు, వ్యతిరేకం కావచ్చు- ఐనా ప్రభావితులౌతున్నారు కదా?

చారిత్రిక దృష్టి, గతితార్కికదృష్టి- అనేది మరో ద్వంద్వం.

నిజమే- ఈ ద్వంద్వం వీరి సృష్టికాదు. మార్క్సిస్టు తత్వశాస్త్రంలో ఉన్నదే. ఈ రెండు పద్ధతులకు వైరుధ్యం లేదు- రెంటినీ సక్రమంగా మేళవించాలి, ఈ మాటను వీరూ ఒప్పుకుంటున్నారు.

"చారిత్రిక దృష్టిలేని గతితార్కిక దృష్టికాని, గతితార్కిక దృష్టిలేని చారిత్రక దృష్టిగాని ప్రమాణం కాజాలదు" (10 పేజీ) మంచిదే. వీరు చేసిన నిరభ్యంతర కర సూత్రీకరణలలో ఇదొకటి.

విశేషమేమంటే ఇట్టి స్థిరమైన మార్క్సిస్టు పునాదిపై వీరు ఎక్కువసేపు నిలవలేరు. యమపాశంలాగా మావోయిజం వీరిని పక్కకు లాగుతూ ఉంటుంది.

11వ పేజీలో ఇలా అంటారు. "ప్రాచీన సాహిత్యం, సాహిత్యం కాదు సాహిత్య చరిత్ర" "సాహిత్యాన్ని చారిత్రికంగా పరిశీలించటం గతితార్కిక సాహిత్య భౌతికవాదం కాదు."

అడుగడుగునా తన కాళ్ళకు తానే బంధాలు వేసుకునే ఈ ఆలోచనను ఏమనగలం?

ప్రాచీన సాహిత్యంలో ఆనాటి సామాజిక దృష్టి, మానవతా దృష్టి రెండూ ఉన్నాయి. రెంటినీ గుర్తించి ఏ మోతాదు ఎంతో అంచనా వేయడం చారిత్రిక గతి తార్కిక పరిశీలన.

మానవతా దృష్టిని మాత్రమే చూసి, సామాజిక పార్శ్వాన్ని చూడ నిరాక రించటం, లేక సమర్థించటం, సాంప్రదాయిక దృష్టి.

సామాజికపార్శ్వాన్ని మాత్రంచూసి, మానవతాదృష్టిని, యితర సార్వజనీన అంశాలనుసైతం నిరాకరించడం నిహిలిస్టు దృష్టి.

శంబుకవధ, ఆధునికులకు ప్రత్యేకించి బ్రాహ్మణేతరులకు నిస్సందేహంగా అవమానకరమైన గాథ- ఆ కథ వున్నదికదాఅని రామాయణాన్ని మొత్తం నిరసించాలనా?

ఇలాపోతే, ప్రాచీన సాహిత్యంలో ఒక్కపుస్తకమూ మిగలదు. భూస్వామ్య సంస్కృతి లక్షణాలు ఏవోఒకటి అన్ని ప్రాచీన గ్రంథాలలోనూ ఉన్నాయి.

వ్యక్తి వైకల్యసూత్రం గుర్తించకపోవటం, సామాజిక పరిమితులు, సార్వ జనీనత రెండూ సాహిత్యంలో ఉంటాయనే అంశాన్ని నిరాకరించటం ఈ వ్యాసరచ యిత ప్రధాన లోపాలు.

లేనిద్వంద్వాలను ఊహించుకుని తాము సృష్టించుకున్న చీకట్లో తామే తడుము లాడటం వీరిప్రత్యేకత.

తమకభిమానమైన రాజకీయ నినాదానికి, సాహిత్యం, తత్వశాస్త్రాలకు సంబం ధించిన సకల సిద్ధాంతాలను ముడిపెట్టే యత్నం వీరి వ్యాసంఆఖరులో బహిర్గతం అవుతుంది. నిజానికి వీరి ఆలోచనలో కీలకలోపం ఇదే.

సాహిత్యం పాఠకుల అభిరుచులు, ఆలోచనలను ప్రభావితంచేసి, వారి ఆచర ణను కూడా ఒకమేరకు మలుస్తుంది.

కాని మధుసూదనరావుగారి కదిచాలదు. కనుక యిలా అంటున్నారు.

—నిర్మాణాత్మక సంఘటిత కార్యాచరణ అన్వయంగల సాహిత్యకృషి ఆచరణ.

—మార్పుకై పోరాటం అనివార్యంగా రాజకీయరూపం ధరిస్తుంది. విమర్శ వేరు, విప్లవ విమర్శవేరు, విమర్శ అనేఆయుధం, ఆయుధాల విమర్శకు ప్రత్యా మ్నాయం కాదు.

ఇలా ముక్త పదగ్రస్తంలాగా తమకభిమానమైన పదజాలంలోకి ప్రవేశించి ఫలశృతిగా ఇలా అంటున్నారు.

"తన రాజకీయాభిప్రాయాలకు భిన్నంగా వ్యతిరేకంగా ప్రపంచాన్ని లోతుగా అర్థంచేసుకోవటం గతితార్కిక సాహిత్య భౌతికవాదికి అసంభవం"

సప్తభంగి న్యాయంద్వారా జైనులు చివరకు "ఏ వస్తువును గురించి ఇదమిద్ద మని ఏమీ రూఢిగా చెప్పలేము"అనే అనిశ్చిత స్థితికి దిగజారారు. జైనతత్వశాస్త్రం దాంతో అభాసుపాలైంది.

అలాగే విరసం కార్యదర్శి మధుసూదనరావుగారు "తమ రాజకీయాభిప్రాయా లకు భిన్నంగా ఆలోచించటం అసంభవం" అని చిట్టచివరకు తేల్చివేశారు.

ప్రపంచపరిస్థితి, దేశపరిస్థితి, ప్రజలస్థాయి, వివిధవర్గాల పొందిక, వారి సిద్ధాంతాలు- కార్మికవర్గ చైతన్యం సంఘటితస్థాయి-ఇలా అనేకానేక అంశాలపై ఆధార పడి పోరాట రూపాలు, రాజకీయ ఎత్తుగడలు వుంటాయి. ఇవి తరచు మారుతూ వుంటాయి.

కాగా మౌలికసిద్ధాంతం ఒకపార్టీ లేక వర్గంయొక్క తత్కాలపు రాజకీయ ఎత్తుగడలదృష్ట్యా మారదు, నిర్ణయించబడదు.

సిద్ధాంత ప్రాతిపదికనుండి, అనేకమైన అడుగులు వేసుకుంటూ క్రిందికి వచ్చిన పీదట నిర్ణయించబడేది పోరాటం రూపం. ఈక్రమాన్ని తల్లక్రిందులుచేసి యావత్తు సిద్ధాంతాన్ని తాత్కాలిక ఎత్తుగడలనే ఒంటిస్థంభంపై నిలబెట్టడం హాస్యాస్పదం, ప్రమాదకరం. ఒంటిస్తంభం ఎప్పుడైనా కూలిపోవచ్చు. అప్పుడు ఉపరితల సౌధం అంతా కుప్పకూలిపోతుంది.

గతితార్కిక సాహిత్య భౌతికవాద భావన, మార్క్సిజానికి అనుగుణమైనది కాదు. నూతన భావన అసలేకాదు. సంకుచిత అనుభవాన్ని సమర్థించుకోవటానికి విరసం కార్యదర్శి నిర్మించుకున్న ఊహాసౌధం.

ఇలాంటి ఊహాసౌధాలకు చిలక పలుకుల్లాగా మార్క్సిస్టు పదజాలాన్ని జోడించే యత్నమే ఈసిద్ధాంత పత్రం.

10 ఫిబ్రవరి, 1981

గతితార్కిక సాహిత్య భౌతికవాదం : ఒక సమర్థన

త్రిపురనేని మధుసూదనరావు

1980 జూన్-జూలై సృజనలో వచ్చిన గతితార్కిక సాహిత్య భౌతికవాదం వ్యాసాన్ని అరసంవాళ్లు నిరాకరిస్తూ ఆగస్టులో తీర్మానం చేశారు. అయితే ఆ తీర్మానం చెయ్యటానికి కారణాలు చెప్పలేదు. ఏటుకూరి బలరామమూర్తిగారు 81 ఫిబ్రవరి అభ్యుదయలో, 'గతితార్కిక సాహిత్య భౌతికవాదం- ఒక పరిశీలన పేరుతో వ్యాసం రాసాడు. అ వ్యాసంలో గతితార్కిక సాహిత్య భౌతికవాదాన్ని నిరాకరించటానికి కారణాలు చెప్పాడు. మంచిదే. కారణంచూపని నిరాకరణ నిందఅవుతుంది. కారణంచూపని అంగీకారం భజన అవుతుంది. సహేతుకంగా, ప్రామాణికంగాచేసే శాస్త్రీయచర్చ సత్యాన్వేషణకి చాలాఅవసరం. కానీ ఏటుకూరి నా వ్యాసాన్ని కాస్త శ్రద్ధగా చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండా చర్చకి పూనుకున్నాడు. చర్చల్లో ఎంతఅనుభవంవున్నా మనం చర్చిస్తున్న విషయాన్ని తరచిచూడకుండా చర్చకి దిగటం పద్ధతికాదు. ముందే అభిప్రాయం ఏర్పరచుకొని చూడటంవల్లా, నా వ్యాసం అర్థంకాకపోవటంవల్లా ఏటుకూరి అనేక వక్రీకరణలూ, కుతర్కాలూచేసి చివరకి గతితార్కిక సాహిత్య భౌతికవాదం అనేది కొత్తభావన కానేకాదనీ, అది నా వూహ సృష్టిఅని నిర్ధారణచేసి సంతృప్తి పడ్డాడు. నేను రాయనిది రాసినట్టుగా చిత్రించటం, నేనురాసినది రాయనట్టుగా భావించి వెక్కిరించటం, నా పూర్వపక్షాన్ని నా సిద్ధాంతంగా చిత్రించి ఖండించటం ఏటుకూరి ఈవ్యాస పరిశీలనలో చేసిన ముఖ్యమైన పొరపాట్లు. నా ప్రతిపాదనను ఖండించి ప్రత్యామ్నాయ ప్రతిపాదన చేసేటప్పుడు ప్రమాణం చూపకుండా మార్క్సిజంపేరుతో తన బుర్రలో నిలవవున్న వాటిని ఏకరవు పెట్టటం, చర్చని ప్రధాన విషయంనుంచి పక్కతోవలకి పట్టించటానికి వుద్దేశపూర్వకంగా ప్రయత్నించటం ఏటుకూరి ఈ వ్యాసపరిశీలనలో అనుసరించిన అశాస్త్రీయపంథా. నా ప్రతిపాదనలూ, ఏటుకూరిఖండనా నా సమాధానం వరసగా ఇస్తాను.

1. మార్క్సిజం - లెనినిజం, మావో ఆలోచనా విధానం అన్నా గతితార్కిక భౌతికవాదం అన్నా ఒకటే (సృజన. పేజీ 5)

<u>ఏటుకూరి ఖండన</u> : మార్క్స్, లెనిన్‌ల సరసన మావోను ప్రతిష్ఠించటం పూర్తిగా అసంగతం. మావో గతితార్కిక భౌతికవాది కాదు- మార్క్సిజం - లెనినిజానికీ మావోయిజానికీ ఏమాత్రం పొత్తుకుదరదు.

సమాధానం : మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లే కాదు మావో స్టాలిన్‌లు కూడా గతితార్కిక భౌతికవాదులే- స్టాలిన్, మావోలు ప్రపంచ పీడిత ప్రజల ప్రియతమ నాయకులు- తాత్త్వికంగా, రాజకీయంగా, సామాజికంగా స్టాలిన్, మావోలు భూస్వామ్య వ్యవస్థకీ, పెట్టుబడిదారీ వ్యవస్థకీ సామ్రాజ్యవాదానికీ ప్రబల శత్రువులు, మార్క్స్‌ని అయినా మావోని అయినా గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్పథం నుంచే అధ్యయనం చెయ్యాలి- విమర్శకి ఎవరూ అతీతులు కారు- స్టాలిన్ మావోలు విప్లవానికి నేతృత్వం వహించడమే కాక విప్లవ విజయాల్ని సంరక్షిస్తూ సోషలిస్టు సమాజ నిర్మాణానికి కూడా నేతృత్వం వహించారు- మావో ఆలోచనా విధానంలోని తాత్త్వికతని 'వైరుధ్యాలు', 'ఆచరణ' అనే రచనల నుంచి మాత్రమే అర్థంచేసుకోవటానికి ప్రయత్నించటం గతితార్కిక భౌతికవాద పద్ధతికాదు- అది నుంచీ మొత్తం మావో రచనల్నీ, మావో ఆచరణనీ చైనా విప్లవాన్నీ, చైనా కమ్యూనిస్టుపార్టీ చరిత్రనీ, చైనా చరిత్రనీ కలిపి అధ్యయనం చెయ్యాలి- ఈ సందర్భంలో మావో ఆలోచనా విధానం గురించి చర్చఅనవసరం- గతితార్కిక సాహిత్య భౌతికవాదాన్ని గురించి చర్చించటానికి మార్క్స్ ఎంగెల్స్‌నీ లెనిన్‌నీ ప్రమాణంగా తీసుకున్నచాలు- ఏటుకూరికి మావో ఆలోచనా విధానం తెలియక పోవటమే కాదు, మార్క్సిజం - లెనినిజం తెలియదనే నా వాదం- మార్క్స్, లెనిన్‌లు చెప్పకుండా, మావో మాత్రమే చెప్పిన ఏ విషయాన్నీ నేను నా వ్యాసంలో ప్రవేశపెట్టలేదు.

2. "గతితార్కిక భౌతికవాదం తత్త్వశాస్త్రం కాదు, సిద్ధాంతం కాదు- అన్వయ శాస్త్రం- విప్లవ శాస్త్రం- ఆచరణ శాస్త్రం." (పేజీ 5)

ఏటుకూరి ఖండన : మాటల అర్థం తెలిసివాడాలి- తత్త్వశాస్త్రం అంటే ప్రకృతి సమాజం, ఆలోచన, అంతర్గత సూత్రాల్ని వివరించే విజ్ఞానం, కనక గతితార్కిక భౌతికవాదం ఒక శాస్త్రం- అదే సమయంలో సోషలిస్టు సమాజ పరివర్తనకి కృషిచేసే కార్మిక వర్గానికి ఇది సిద్ధాంతం- It is both a Science and ideology. పైరెండు మాటలూ చాలనట్టు అన్వయశాస్త్రం, విప్లవ శాస్త్రం, ఆచరణ శాస్త్రం అనటం ఎందుకు? మొదటి రెండు భావాలకీ, చివరి మూడు పదాలకు వైరుధ్యం చూపటం ఎందుకు ?

సమర్థన : ఎవరికయినా కొన్ని పదాలకి అర్థాలు తెలియవచ్చు- కొన్నిటికి అర్థాలు తెలియకపోవచ్చు- తెలియని వాళ్ళకి తెలియ చెప్పటం అవసరమే- ఎవరిదగ్గర నుంచి నేర్చుకోవటానికయినా నాకు అభ్యంతరం లేదు- ఇక్కడ ఏటుకూరి నాకు పదాలకి అర్థం తెలీదని బూకరిస్తూ తత్తరపాటుతో అన్నీ తప్పులే చేశాడు- తత్త్వ

శాస్త్రం అంటే అని నిర్వచనం ప్రారంభించి శాస్త్రం అంటారు అని ముగించాడు. తత్త్వ శాస్త్రం, శాస్త్రం ఒకటే అని ఏటుకూరి అభిప్రాయమా ? శాస్త్రాలకి అతీతంగా, విడిగా తత్త్వశాస్త్రం అవసరంలేదని ఏటుకూరి అభిప్రాయమా ? అయితే మంచిదే- కానీ ఆ విషయాన్ని ఎక్కడా సూచించను కూడా లేదు- గతితార్కిక భౌతికవాద నిర్వచనాన్ని ఇచ్చి దాన్నే తత్త్వశాస్త్ర నిర్వచనంగా గందరగోళ పడటం ఎందుకు ? సోషలిస్టు సమాజ పరివర్తనకు కృషిచేసే కార్మికవర్గం ఏమిటి? కార్మికవర్గం సోషలిస్టు విప్లవం కోసంకృషి చేస్తుంది- విప్లవానంతరం సోషలిస్టు సమాజ పరివర్తనకు కృషిచేస్తుంది- సోషలిస్టు కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మాణంచేసే పోరాట క్రమంలో కార్మికవర్గం ఒక వర్గంగా రద్దు అవుతుంది- గతితార్కిక భౌతికవాదం కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథం- కార్మికవర్గం ఒక వర్గంగా రద్దు అయినప్పుడు గతితార్కిక భౌతికవాదం కూడా మొత్తం సమాజ దృక్పథంగా మారుతుంది.

ఈవిషయాలన్నిటినీ వ్యాసంలో వివరంగానే చెప్పాను. ఇవేమీ పట్టించు కోకుండా గతితార్కిక భౌతికవాదాన్ని ఆచరణతో నిమిత్తంలేని సిద్ధాంతంగా చిత్రించ టానికి ఏటుకూరి ప్రయత్నంచేశాడు. It is both a science and ideologyలో ideology అంటే ఏటుకూరి దృష్టిలో అర్థంఏమిటి ఎంగెల్స్ ideology (భావజాలం)ని ఇలా వివరించాడు.

"భావజాలం అనేది మేధావులు చైతన్యంతో సాధించేక్రమమే. కానీ ఆ చైతన్యం తప్పుడు చైతన్యం- ప్రేరణని ఇచ్చిన వాస్తవచోదక శక్తుల్ని గురించి మేధావులకు తెలీదు. తెలియదుకాబట్టే వారికి ఆలోచన భావజాలక్రమంగా అనిపిస్తుంది. వాస్తవం తెలీకపోవటంవల్ల మేధావి తప్పుడు, లేదా భ్రమాజనిత చోదకశక్తుల్ని వూహించుకుంటాడు- అది ఆలోచించేక్రమం కాబట్టి మేధావి తన భావజాలరూపాన్ని, వస్తువునీ తన లేదా తనపూర్వుల ఆలోచననుంచీ పుట్టినవే అనుకుంటాడు- అతడు కేవలం ఆలోచనాంశంతో వ్యవహరించటంవల్లా. పరీక్షకు పెట్టకుండా భావజాలం ఆలోచననుంచీ వుత్పన్నంఅయ్యే విషయంగా ఆమోదించటంవల్లా, ఆలోచనకంటే స్వతంత్రంగావుండే అంతిమ మూలాధారంకోసం పరిశోధన చేయకపోవటంవల్లా మేధావి సహజంగానే భ్రమల్లో కూరుకుపోతాడు- మేధావి ఇలాభావించటం సహజమే. ప్రతిపనీ ఆలోచనతో మధ్యస్థం చేయబడటంవల్ల మేధావికి తన ఆలోచనలు అంతిమంగా ఆలోచనమీదనే ఆధారపడి వున్నట్టు కనిపిస్తాయి" 1

ఆలోచనలనుంచీ ఆలోచనలు పుడుతాయి అనుకోవటం, ఆలోచనకు వాస్తవ పునాదులు తెలియకపోవటం, భావజాలం- ఈ అర్థంలోనే మార్క్స్, ఎంగెల్స్‌లు

ideology అనేమాటని వాడారు. ఇప్పుడు సిద్ధాంతంఅనే అర్థంలో రూఢిఅయినమాట వాస్తవం- కానీ ఈ రూఢ్యర్థాన్ని మార్క్స్ ఎంగెల్స్‌ల మాటకి ఎలాఅన్వయిస్తాం? ఏటుకూరి ideology ని సిద్ధాంతం అని మార్క్స్ వుద్దేశించినట్టు చిత్రించటం అర్థరహితంకాదా? ఒక అనువాదకుడు మార్క్స్ ఎంగెల్స్ german ideology ని జర్మన్ సిద్ధాంతం పేరుతో అనువాదం చేశాడు. german ideology అంటే జర్మన్ సిద్ధాంతంకాదు- జర్మన్ తత్వవేత్తల, మేధావుల తప్పుడు చైతన్యానికి సంబంధించిన భావజాలం. ఈ అర్థాన్నే నా వ్యాసంలో 'తప్పుడుచైతన్యం' అనే మాటతో చెపితే ఏటుకూరి వెక్కిరించాడు. మార్క్స్, ఎంగెల్స్‌ల రచనల్లో ప్రముఖంగా కనపడే భావనకి అర్థంతెలీకుండా, వివరించినా పట్టించుకోకుండా వెటకారం చేయటంవల్ల ప్రయోజనంఏమిటి? మార్క్స్ వుద్దేశించిన అర్థానికీ ఇప్పుడు రూఢీ అయిన అర్థానికీ సమన్వయంగా చెప్పదలుచుకుంటే Science and revolutionary ideology అనికానీ Scientific ideology అనికానీ సర్దుబాటుగా అనుకోవచ్చు. ఈ భావనకి అర్థం తెలియకపోవటంవల్ల గతితార్కిక సాహిత్య భౌతికవాద వ్యాసంలో చాలాభాగం ఏటుకూరి అర్థంచేసుకోలేక పోయాడు. ఇలా పనికిమాలిన నిర్వచనాలు చెయ్యటమేకాక నా ప్రతిపాదనలకి మోసపూరితమైన వక్రీకరణ చేశాడు.

నేనువాడింది ఏటుకూరి లెక్కవేసి చెప్పినట్టు అయిదు పదాలుకాదు. ఆరు పదాలు- అందులో ఒకటి కావాలనే తాను వుపయోగించుకోటానికీ, నన్ను ఖండించటానికీ వదిలేశాడు- "అది సర్వాంగ ప్రాపంచిక దృక్పథం" గతితార్కిక భౌతికవాదం ఒక తత్త్వశాస్త్రం కాదు- ఒక సిద్ధాంతం కాదు- అనటానికి పక్కనే 'వాదవినోదుల విందు భోజనం కాదు' అని కారణం చెప్పాను- అనేక తత్త్వశాస్త్రాల్లో ఒక తత్త్వశాస్త్రంగా, అనేక సిద్ధాంతాల్లో ఒక సిద్ధాంతంగా వాదస్థాయిలో మాత్రమే వుండిపోయే భౌతికవాద ముఖ భావవాదుల నుంచీ గతితార్కిక భౌతికవాదాన్ని విముక్తి చెయ్యటం కోసం అన్వయ, విప్లవ, ఆచరణ శాస్త్రంగా గతితార్కిక భౌతికవాదాన్ని వివరించాను. అన్వయంతో, ఆచరణతో విప్లవంతో నిమిత్తం లేకుండా గతితార్కిక భౌతికవాదం ఎందుకు? గతితార్కిక భౌతికవాదంలో ప్రాణసదృశమైన అంశాల్నీ పేర్లొని సర్వాంగ ప్రాపంచిక దృక్పథంగా నిర్ధారణ చేశాను. ఇదే వ్యాసం అంతా విస్తరించివుంది- ఏటుకూరికి మాటల అర్థం తెలీకుండా, తెలుసుకోటానికి ప్రయత్నంలేకుండా వ్యాసాన్ని పరిశీలించే అర్హత ఎలావస్తుంది? నిర్వచనాల కంటే సూత్రీకరణలకి శాస్త్రస్వభావం ఎక్కువ వుంటుందని కూడా తెలియాల్సిన పనిలేదా?

"నిర్వచనాలు అసమగ్రమైనవి కనక శాస్త్రానికి నిష్ఫలమైనవి- నిజమయిన నిర్వచనం విషయ వివరణే, కాని ఈ వివరణ నిర్వచనం స్థాయిని అధిగమించి వుంటుంది. జీవితం అంటే ఏమిటో తెలుసుకోటానికీ, నిరూపించటానికీ మనం మొత్తం జీవితరూపాలను అన్నిటినీ పరీక్షించాలి. వాటిని వాటి అన్యోన్య సంబంధం లోనే ప్రతిపాదించాలి" 2

3. గతితార్కిక సాహిత్య భౌతికవాదం సాహిత్యాన్ని పునాది ఉపరితలం కలసివుంటే అవయవిలో అవయవంగా పరిగణిస్తుంది (పేజీ 6)

ఏటుకూరి ఖండన : అవయవి అవయవం అనేమాటలద్వారా రచయిత సాహిత్యానికి సాపేక్షంగాగల స్వతంత్ర ప్రతిపత్తిని నిరాకరిస్తున్నాడు. అవయవి అవయవం పోలిక పునాది ఉపరితలం విషయంలో కుదరదు.

సమర్థన : వాస్తవానికి నా వ్యాసంలో అవయవి, అవయవం అనేదే ప్రధానమైన విషయం. పునాదికీ వుపరితలానికీవుండే సంబంధం విషయంలో మార్క్సిస్టులు చాలామంది విస్మరిస్తున్న విషయాన్ని చర్చకితేవటం ఈ వ్యాస ప్రధానఉద్దేశం. అనేక అపసిద్ధాంతాల్ని (ఉదా : పునాది, ఉపరితలంమీద 'వీచిక'లో విజయకుమార్ వ్యాసాలు) నిరాకరించటానికీ, అనుమానాల్ని నివృత్తి చేసుకోటానికీ ఈ Organismic approach చాలా వుపయోగకరమనీ, దీన్నిగురించి ఆలోచింపచేద్దామని ప్రయత్నించాను.

పునాదివుపరితలం కలిసి ఒక అవయవి, లేదా అంగి Organism పునాదితోసహా అన్నీ అవయవి, లేదా అంగిలో అవయవం లేదా అంగం (Organ) అనే సిద్ధాంతాన్ని నేను కల్పించలేదు. మార్క్స్ అనేకసందర్భాల్లో చెప్పినదాన్నే నా పద్ధతిలో ప్రతిపాదించాను. "Organic whole" "intenrated whole" "complete whole" "concrete organic whole" "Organic Unity" అనే మాటల్ని మార్క్స్ 'కాపిటల్'వంటి రచనల్లో అనేకసార్లు ప్రయోగించాడు.

"ప్రస్తుతసమాజం స్వచ్ఛ, స్ఫటిక, ఘనపదార్థం వంటిదికాదు. మారేశక్తి వుండి, నిరంతరం మారుతుండే అవయవి" 3

"ఒక నిర్దిష్ట సామాజిక అవయవిపుట్టి, అస్తిత్వంలోవుండి, అభివృద్ధిపొంది అదృశ్యంకావటానికీ, ఆ అవయవి దానికంటే వున్నతమైన మరొక అవయవికి స్థానం ఇవ్వటానికీ కారణాలుగావుండే ప్రత్యేక సూత్రాల్ని బహిర్గతం చెయ్యటంలో ఇలాంటి పరిశోధనలకి శాస్త్రీయమైన విలువవుంది" 4

"ఉత్పత్తి, మారకం, పంపకం, వినియోగం ఒకటే అనికాక, అవి అఖండంగా వుండే ఒకమొత్తంలో సంబంధాలుగా, ఏకంగావుండే దాని విభిన్న అంశాలుగా దీని నుంచి నిర్ధారణకు రావచ్చును" 5

"అనేక అంశాలమధ్య అన్యోన్య చర్యవుంటుంది. అలాంటి అన్యోన్యచర్య ఒకమొత్తంగావుండే ఏ అవయవిలో అయినా సంభవిస్తుంది" 6

"భావాలూ, భావనలూ చైతన్యం మనుషుల భౌతికఆచరణతో, మనుషుల భౌతిక అన్యోన్య సంసర్గంతో పెనవేసుకొని ఉత్పన్నం అవుతాయి. ఈ భౌతిక అన్యోన్య సంసర్గమే జీవిత వాస్తవభాష. చైతన్యం చైతన్యవంతమైన అస్తిత్వంకంటే భిన్నమైందికాదు. మనుషుల అస్తిత్వం వాళ్ళ వాస్తవజీవిత గతిక్రమమే" 7 అని మార్క్స్ ఎంగెల్స్ 'జర్మన్ ఐడియాలజీ'లో చైతన్యానికీ భౌతికతకీ అవయవి అవయవ సంబంధం చెప్పారు. పునాదికీ వుపరితలానికీ అంతర గతితర్కం అంటేఇదే.

"ప్రకృతిలో కేటాగా ఏదీ దానికదే సంభవించదు. ప్రతివస్తువూ ఇతర ప్రతి వస్తువుతోనూ అనుబంధంలోనే వుంటుంది. అంటే వస్తువులకి స్వయంభవత్వంలేదు. 8 ఇది ప్రకృతికి మాత్రమే సంబంధించిన విషయంఅని ఎంగెల్స్ అభిప్రాయంకాదు.

"అంతిమ విశ్లేషణలో మనిషి మెదడు ఉత్పత్తిచేసేవి ప్రకృతి ఉత్పత్తులే. అవి జరిగిపోయిన ప్రకృతి గొలుసులో తెగిన ఖాళీలుకావు. దానికి అనుగుణ్యంగా వుండేవే" 9 అని మేధోవుత్పత్తులకుకూడా అన్వయించాడు. లెనిన్ మార్క్స్ కేపిటల్ గ్రంథాన్ని గురించి ఇలాఅన్నాడు. " 'పెట్టుబడి'గ్రంథం పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రతిదిన చర్యనూ వివరించింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల్లో అంతర్గతంగా వుండే వర్గ వైషమ్య వాస్తవ సామాజిక వ్యక్తీకరణని చిత్రించింది. పెట్టుబడిదారీ వర్గ పరిపాలనని సంరక్షించే స్వేచ్ఛవంటి బూర్జువా భావాల్తోకూడిన బూర్జువా రాజకీయ వుపరితలాన్ని నిరూపించింది. ఇలా పెట్టుబడి గ్రంథంమొత్తం పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థకి ఒక సజీవరూపం."10

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల ఈ అభిప్రాయాల్ని పరిశీలిస్తే పునాది- వుపరితలం ఒక అవయవి అనీ, ఆ అవయవిలో పునాది, వుపరితల అంశాలు కూడా అవయవాలనీ గ్రహించటం చాలా సులభం- కాబట్టి ఏటుకూరి అన్నట్టు అవయవి- అవయవం పోలిక పొసగక పోవటం కాక, ఆ పోలికనే మార్క్సిజం - లెనినిజం వుద్ఘాటిస్తోందని పై ప్రమాణాలు రుజువు చేస్తున్నాయి- ఏటుకూరి మార్క్స్‌నీ, లెనిన్‌నీ కాక మార్క్స

మీదా లెనిన్ మీదా రష్యావాళ్ళు రాసిన పుస్తకాల్లో కాలక్షేపం చెయ్యటంవల్ల అవయవి-అవయవం అనే Organic approachని అర్థంచేసుకోలేకపోయాడు. పోనీ వుత్పత్తికీ భాషకీవుండే సంబంధాన్ని గురించి నేను ఇచ్చిన వివరణని కూడా శ్రద్ధగా చూడ లేదు- తాను మూల రచనలు చదవకుండా, చదివి రాసిన వాళ్ళని సహేతుకంగా అవగాహన చేసుకోకుండా, "పొసగదు" అని ఒక మాటతో దాటవేయటం శాస్త్రీయ చర్చా పద్ధతి ఎలా అవుతుంది ?

4. సాహిత్యానికి స్వతంత్ర ప్రతిపత్తిఉంది అనటం తప్పుడు చైతన్యం (పే.11)

ఏటుకూరి ఖండన: కీలకమైన ఈ సూత్రీకరణపై వీరికి స్పష్టతలేదు- మార్క్సిస్టు లందరికీ ఆమోదయోగ్యమైన పదజాలం వాడుతూ ఆ ప్రక్కనే మావోయిజం చేరుస్తూ క్రమంగా పాఠకుడ్ని మావోయిజంవైపు నడిపించాలనే వుద్దేశపూర్వకమైన ప్రయత్నం వల్ల ఈ అసందర్భ సూత్రీకరణ చెయ్యటం జరిగింది.

సమర్థన : సాహిత్యం స్వతంత్ర ప్రతిపత్తిగల రంగం అనే దానివెనక చాలా చరిత్ర వుంది- ఫ్యూడల్ పండితులూ, బూర్జువా కళావిమర్శకులూ, మార్క్సిస్టులూ కూడా దీన్ని గురించి చర్చించారు- ఆధ్యాత్మికవాదులు సాహిత్యాన్ని నియతికృత నియమరహితంగా, అనన్యపరతంత్రంగా అభివర్ణించారు- కానీ వాస్తవానికి సంప్రదాయ సాహిత్యంలో రాజ్యాంగయంత్రం, తత్త్వం, రాజకీయాలూ, మతం, నైతిక విలువలూ అన్నీవున్నాయి- ఆస్థానాలూ, అంతఃపురాలూ, యుద్ధాలూ దారుణహింసా కాండ, సాహిత్యంలో ప్రవేశించాయి- బూర్జువా సాహితీపరుల్లో జర్మన్ సౌందర్య వాదులూ, ఆంగ్ల సాహిత్యంలో కాల్పనిక వాదులూ సాహిత్య స్వతంత్ర ప్రతిపత్తి వాదాన్ని ప్రచారం చేశారు- "కళ కళనితప్ప మరి దేన్నిగురించీ చెప్పదు- ఆలోచన తన పద్ధతిలో తాను అభివృద్ధిపొందినట్టు కళకి కూడా స్వతంత్ర జీవితం వుంది"[11] "కళకి ప్రయోజనం ఏమీలేదు"[12] అన్నాడు ఆస్కార్ వైల్డ్- షెల్లీ కాలంలో కూడా Scientism ని ఎదుర్కోటానికి Autonomism ఒక పెద్ద వాదంగా ముందుకు వచ్చింది. ఈ స్వతంత్ర ప్రతిపత్తి వాదానికి, ఎంగెల్స్ హెగల్ నుంచీ స్వీకరించి భౌతికవాద పరంగా చెప్పిన "తప్పుడు చైతన్యమే" కారణం.

సాహిత్యానికీ పునాదికీ ఇతర వుపరితలఅంశాలకీవుండే సంబంధాన్ని స్వతంత్ర ప్రతిపత్తివాదులు తెంచివేశారు. వాస్తవ ప్రపంచంలోనే వాస్తవ ప్రపంచ పునాదులు లేని కళా ప్రపంచాన్ని, ఒకగంధర్వలోకాన్ని సృష్టించుకున్నారు. పాలకవర్గాల వంచనా వలలోపడిన రచయితలూ కళాకారులూ యుగభ్రమలలో చిక్కుకొని స్వతంత్ర ప్రతి

పత్తి వాద సుడిగుండంలో పడ్డారు. చెట్టునుచూసి వేరుని విస్మరించినట్టు కళకివున్న సామాజిక మూలాన్ని పునాది - ఇతర వుపరితల అంశాల మూలాల్ని విస్మరించారు. సాహిత్యానికేకాదు తత్త్వశాస్త్రానికీ, శాస్త్రానికీకూడా స్వతంత్ర ప్రతిపత్తి వుందని ప్రచారం చేశారు. సాహిత్యం, తత్త్వశాస్త్రం విజ్ఞానశాస్త్రాలు అద్భుతమైనవనీ అవి కొద్దిమంది మాత్రమే సృష్టించగలరని ప్రజల్ని నమ్మించి సమాజంలో ప్రత్యేక స్థానాన్ని పొందటానికి, శ్రమజీవులకంటే తాము శిష్టులమని ప్రజల్ని మోసగించటానికి ఈ స్వతంత్ర పతిపత్తి వాదం వర్గసమాజంలో వేయినాలుకల్తో విజృంభించింది. గతితార్కిక భౌతికవాదం, కళ మొదలైనవాటికి స్వతంత్ర ప్రతిపత్తిని నిరాకరించింది. సాహిత్యాదుల్లో వచ్చేమార్పులకీ, సాహిత్యాదుల వ్యాపారానికీ (function) పునాది - వుపరితలంలోని అంశాలకీ అన్యోన్యసంబంధాన్ని నిరూపించింది.

"చరిత్రలో తమపాత్రని నిర్వహించే వివిధ భావజాల రంగాలకి మనం స్వతంత్ర చారిత్రిక అభివృద్ధిని నిరాకరిస్తున్నాం కాబట్టి చరిత్రమీద వాటి కార్యాన్నికూడా నిరాకరిస్తున్నాంఅనే అనారోగ్యకరమైన అభిప్రాయం చాలామంది మేధావులకివుంది. దీనికి కార్యకారణాల్ని పూర్తిగా భిన్నధృవాలుగా భావించి వాటి అన్యోన్యచర్యని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని గతితార్కిక వ్యతిరేక భావనేకారణం. ఈ పెద్దమనుషులు వుద్దేశపూర్వకంగానే ఒక చారిత్రిక అంశం మరొకదానివల్ల ప్రపంచంలోకి రాగానే, అంతిమంగా ఆర్థిక కారణాలవల్ల రాగానే అది దానిపరిసరాలమీదా దానికి కారణమైన దానిమీదకూడా ప్రతిచర్య చూపుతుందని విస్మరిస్తూవుంటారు" 13 అని ఎంగెల్స్ స్వతంత్ర ప్రతిపత్తిని నిరాకరించాడు. చైతన్యానికి స్వతంత్ర ప్రతిపత్తివుంది అనే భ్రమకికారణం మానసిక, శారీరక శ్రమవిభజన ఫ్యూడల్పండితులకంటే, బూర్జువా మేధావులకంటే రివిజనిస్టులు విద్రోహకరమైన స్వతంత్రప్రతిపత్తి వాదాల్నిచేశారు.

"ఈనాటి రివిజనిస్టు భావనలకి మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతంలోని ఏకవాక్యతనీ, అద్వంద్వతనీ, నిర్మాణఐక్యతనీ నాశనంచేయటమే లక్ష్యం"14

"రివిజనిస్టులు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని" "స్వతంత్ర ప్రతిపత్తి"గల భావాలుగా విభజిస్తున్నారు. ఏకంగావుండే గతితార్కిక భౌతికవాదంమీదా, వర్గదృక్పథంమీద ఆధారపడిన భావాల్ని అఖండ భావనా విధానంనుంచీ విడదీస్తున్నారు. తర్వాత బూర్జువా, పెటీబూర్జువా సిద్ధాంతాల్తో వాటిని సవరిస్తున్నారు. దీన్తో కమ్యూనిస్టు భావనలో శాస్త్రీయమైన అంశం, సోషలిస్టు స్వభావంలేకుండా చేయగలుగుతున్నారు" 15

కాబట్టి సాహిత్య స్వతంత్ర ప్రతిపత్తి వాదం శాస్త్రీయ దృక్పథాన్ని నాశనం చెయ్యటానికీ, మార్క్సిజాన్ని దెబ్బతియ్యటానికీ ఫ్యూడల్ పండితులూ, బూర్జువా

మేధావులూ, రివిజనిస్టులూ చేస్తున్న వాదం. ఫ్యూడల్ పండితులు స్వతంత్ర ప్రతిపత్తివాదం చెయ్యటానికి ఆధ్యాత్మిక వాదం వంటి తప్పుడు చైతన్యం కారణం కాగా, బూర్జువా పండితుల అధిభౌతికవాదం, తాత్త్విక భావవాదం స్వతంత్ర ప్రతిపత్తివాదానికి కారణం. రివిజనిస్టులు మార్క్సిజాన్ని మార్క్సిస్టు పరిభాషలోనే దెబ్బతీయటానికి విద్రోహ దృష్టితో స్వతంత్ర ప్రతిపత్తివాదం చేస్తున్నారు. మార్క్సిజం స్వతంత్ర ప్రతిపత్తివాదాన్ని నిరాకరిస్తుందంటే అర్థం సాహిత్యం ఇతర వుపరితల అంశాలూ ఒకటేఅనీ, సాహిత్యం సమాజంలో నిర్వహించేపాత్ర, ఇతర వుపరితల అంశాలు నిర్వహించేపాత్ర ఒకటేఅని మార్క్సిజం బోధిస్తున్నట్టు అర్థం కాదు. సాహిత్యం ఇతర వుపరితల అంశాల వంటిదే అయితే, సాహిత్యం ఇతర వుపరితల అంశాల పాత్రనే నిర్వహిస్తుంటే, సాహిత్యంతో పని ఏముంది? కాలు మనిషి అవయవం అంటే చెయ్యివంటి ఇతర అవయవాల వంటిదే అనీ, ఇతర అవయవాలు చేసేపనే కాలూచేస్తుందని అర్థంచెపుతారా? కానీ కాలుకి ప్రత్యేకరూపం, ప్రత్యేక పాత్ర అవయవిలో అవయవంగా వున్నప్పుడే వుంటాయి. అలాగే సాహిత్యం పునాది, వుపరితలం కలిసివుంటే అవయవిలో అవయవంగానేపుట్టి, పెరిగి తన పాత్రని నిర్వహిస్తుంది. ఈ వాదం సాహిత్యాన్ని శాస్త్రీయంగా అవగాహన చేసుకోటానికి దోహదం చేస్తుంది. స్వతంత్ర ప్రతిపత్తివాదం సాహిత్యాన్ని సామాజిక మూలాల నుంచీ, భౌతికత నుంచీ, సమాజంలో నిర్వహించే పాత్రనుంచీ వేరుచేసి గందరగోళపరుస్తుంది. ఏటుకూరికి స్వతంత్ర ప్రతిపత్తి అంటే ఏమిటో తెలియక పోవటంలో ఆశ్చర్యంలేదు కానీ 'తప్పుడు చైతన్యం' అంటే ఏమిటో కూడా తెలియకపోవటం దిగ్భ్రమ కలిగిస్తున్నది. వేదాలు అపౌరుషేయాలు అనటానికీ, పురుషసూక్తానికీ, క్రౌంచమిథున వియోగం నుంచీ వాల్మీకి రామాయణం రాసాడు అనటానికీ, భాషని సరస్వతి సృష్టించిందనుకోటానికీ, దేవుళ్ళు కలలోకివచ్చి రాయమంటే కావ్యాలు రాసామని చెప్పటానికీ, 'తప్పుడు చైతన్యం' కాక మరేమిటి కారణం? అసలు భావవాదం పుట్టుకకే తప్పుడు చైతన్యం మూలం. మార్క్స్, ఎంగెల్స్‌లు ఎన్నో సందర్భాల్లో, ఎన్నో రూపాల్లో ఈ భావనని వివరించారు. మార్క్స్‌ని ఆమోదిస్తాను, లెనిన్‌ని ఆమోదిస్తాను, మావోని ఆమోదించను అని చెప్పేవాడికి మార్క్స్ చెప్పినవి అయినా తెలియాలికదా? తెలీకుండా ఆమోదించటం ఎందుకు? నిరాకరించటం ఎందుకు? సాహిత్య స్వతంత్ర ప్రతిపత్తివాదం మీద నా అభిప్రాయాలకీ గ్రీకు సాహిత్యం మీద నా అభిప్రాయాలకీ ప్రత్యక్షంగా ఏమీ సంబంధం లేదు. స్వతంత్ర ప్రతిపత్తివాదం విషయంలో మార్క్స్ అభిప్రాయాలకి నా అభిప్రాయాలు అనుగుణ్యంగా వున్నాయా? ఏటుకూరి అభిప్రాయాలు అనుగుణ్యంగా వున్నాయా?

5. సాహిత్యం సార్వకాలికం, సార్వజనీనం, విశ్వజనీనం అనేవాదాలు సాహిత్య అనిర్దిష్టవాద ఫలితాలే- సార్వజనీన సార్వకాలిక సాహిత్యం వుండదు." (పేజీ 10)

ఏటుకూరి ఖండన: వర్గసమాజం - వర్గసాహిత్యం అనే ద్వంద్వాల మధ్య బహుజటిలమైన గతితార్కిక సంబంధం వున్నదని గుర్తించరు. నిచ్చెనలాగా సూటిగా గంతులు వేయడమే మార్క్సిజం అనుకుంటున్నారు.... ఏ మేరకి మానవత్వం, సార్వజనీనత ఉంటే ఆ మేరకి సాహిత్య గౌరవం లభిస్తుంది.

సమర్థన: ఈ విషయంలో ఏటుకూరి చాలా శ్రమపడ్డారు కానీ ఫలితం దక్కలేదు. చాలా ఘాటైన పదాలు ప్రయోగించారు కనీ అవి అవగాహనా లోపాన్ని కప్పిపుచ్చలేకపోయాయి- తనమీద తనకి కోపంవచ్చి నామీద కోప్పడ్డాడు- అసలు చర్చిస్తున్న విషయానికి సంబంధం లేని విషయాల్ని రంగంలోకి తెచ్చుకొని దారితప్పి బాగా చిరాకుపడిపోయాడు- ఈ చిరాకులో నా పూర్వపక్షాన్ని నా సిద్ధాంతంలో భాగంగా చిత్రించి 'గగనయానం' చేశాడు. గ్రీకు సాహిత్యం మీద ఏటుకూరి చర్చని ముందు పరిశీలించాలి- దీనిమీద ఎక్కువే రాసాడు కానీ అంతా అసందర్భ ప్రసంగమే ఇక్కడ నా పూర్వపక్షం ఇది:

"సార్వకాలిక సార్వజనీన సాహిత్యం వుండదు- వర్గసమాజ తొలిదశల్లోని సాహిత్యాన్ని సార్వకాలిక, సార్వజనీన, విశ్వజనీన సాహిత్యంగా పరిగణించే సాహిత్య అనిర్దిష్టతావాదులు చాలామంది వున్నారు- గతితార్కిక సాహిత్య భౌతికవాదం ప్రాచీన సాహిత్యాన్ని శాస్త్రీయంగా వివరించటంలో విఫలం అయిందని ఈ సాహిత్య అనిర్దిష్టతావాదుల, సాహిత్య సార్వత్రికవాదుల అభిప్రాయం- ప్రాచీన గ్రీకుసాహిత్యం ఆనాటి పునాదికి అనుగుణ్యంగా లేదు. ఇప్పటికీ ఆ సాహిత్యాన్ని చదివి ఆనందిస్తున్నాం- ఒక నిర్దిష్ట సామాజిక దశనుకాక, ప్రపంచంలోవున్న అందరి జీవితానికీ ఆసాహిత్యం ప్రతిబింబంగావుంది" ఇది నేను ఖండించదలుచుకున్న పూర్వపక్షం. దీనిమీద నా ఖండన, సిద్ధాంతం ఇది- "ప్రాచీన గ్రీకు సాహిత్యం అపరిణిత సమాజ వుత్పత్తి- మానవజాతి బాల్యదశకి సంబంధించిన సాహిత్యం- ఆనాటి వుత్పత్తి శక్తులు వెనకబడి వున్నప్పటికీ (not in spite of) ఉన్నత సాహిత్యం వుత్పన్నం కాలేదు. ఆ సాహిత్యానికి వుత్పత్తి శక్తులు వెనకబడి వుండటమే (be cause of) కారణం- ఆ అసమాన బాల్యదశ పునరావృత్తం కానట్టే ఆ సాహిత్యం కూడా పునరావృత్తం కాదు. కాబట్టి సాహిత్యం సార్వకాలికం అని నిరూపించటానికి గ్రీకు సాహిత్యం ప్రమాణం కాదు- అలాగే ఆనాటి గ్రీకు సాహిత్యంలో గ్రీకుల సామాజిక, ప్రాకృతిక సంబంధాలే

వున్నాయి కానీ భారతీయ, ఈజిప్టు సమాజాల జీవితం లేదు- కాబట్టి సాహిత్యం విశ్వజనీనం అనటానికి గ్రీకు సాహిత్యం ప్రమాణం కాదు- గ్రీకు సాహిత్యాన్ని ఇప్పటికీ చదివి ఆనందించటానికి దానిలో పసిపిల్లలలోని ఆకర్షణ వుండటమే కారణం- కాబట్టి సాహిత్య సార్వజనీనతకి కూడా గ్రీకు సాహిత్యం ప్రమాణం కాదు". (పేజీ 10)

ఇందులో ఏటుకూరి చేసిన మొదటి పొరపాటు వెనకా ముందూ చూడకుండా నా పూర్వపక్షాన్ని సిద్ధాంతంగా భ్రమపడటం. రెండోది ఈ మొత్తం వివరణ అంతా మార్క్స్ చెప్పిందే అని గుర్తించలేకపోవటం- గ్రీకుసాహిత్యం గురించి రాసినదాంట్లో ఒక్క వాక్యం కూడా నాదికాదు. అంతా మార్క్స్ 'పొలిటికల్ ఎకానమీ'లో చెప్పిందే. నిర్ధారణలూ అన్వయం మాత్రమే నేను చేశాను. సాహిత్యాభిమానులకి ప్రయోజనకరంగా వుంటుంది కాబట్టి కాస్త సుదీర్ఘంగావున్నా కోట్ చేస్తున్నాను.

"కళారంగంలోకొన్ని వుచ్ఛదశలు సమాజ సాధారణ అభివృద్ధికి అనుగుణ్యంగా లేని విషయం అందరికీ తెలిసిందే. ఆ కళాశిఖరాలు వాటి భౌతిక పునాదికికూడా అనుగుణ్యంగాలేవు. గ్రీకుల్ని ఆధునికదేశాల్తో లేదా షేక్స్పియర్‌తో పోల్చిచూడవచ్చును. కళాసృజన ప్రారంభం అయిన తర్వాత ఇతిహాసంవంటి ప్రక్రియల్ని ఇతిహాసయుగంలోని వున్నత రూపస్థాయిలో పునఃసృష్టి చెయ్యటం సాధ్యంకాదు అనే విషయాన్ని అందరూ అంగీకరిస్తున్నారు. అంటే కళారంగంలోని కొన్నిముఖ్యమైన ప్రక్రియలు కళ అభివృద్ధిపొందే తొలిదశల్లో మాత్రమే సృష్టించటానికి వీలవుతుందన్నట్లు కళారంగంలోని విభిన్న కళాప్రక్రియల విషయంలోనే పరిస్థితి ఇలా వున్నప్పుడు మొత్తం కళారంగానికీ సమాజ సాధారణ అభివృద్ధితో కళారంగానికివుండే సంబంధానికీ ఈ పరిస్థితి ఇంకా కొట్టవచ్చినట్టు కనపడదా? ఈ వైరుధ్యాల సాధారణ సూత్రీకరణేకష్టం. నిర్దిష్ట సమస్యలకి కుదించబడగానే వాటి వివరణ సులభం అవుతుంది.

వుదాహరణకి గ్రీకుకళకీ లేదా షేక్స్పియర్ సాహిత్యానికీ ఈ కాలంతోవున్న సంబంధాన్ని తీసుకోవచ్చును. గ్రీకుపురాణం గ్రీకుకళకి ఆయుధాగారం మాత్రమే కాదు, మూలంకూడా. గ్రీకులవూహల్లో గ్రీకుకళలో అంతర్గతంగావుండిన ప్రకృతికీ, సమాజ సంబంధాలకీ సంబంధించిన భావన స్వయం-చాలక యంత్రాలూ, బస్సులూ, రైళ్ళూ, విద్యుత్ టెలిగ్రాములూవున్న ఈ కాలంలో వుండటం సాధ్యమా? రాబర్ట్ కంపెనీతో పోల్చినప్పుడు లోహాల్ని కరిగించేఅగ్నిదేవుడి సంగతి, మెరుపులలోని విద్యుత్తునిలాగి నిరపాయంచేసే సాధనాలతో పోల్చినప్పుడు జూపిటర్‌సంగతి, ఒకరి

నుంచీ ఒకరికి ప్రతిష్ఠ సంక్రమించటంతో పోల్చినప్పుడు దివ్యసందేశాల్ని తీసుకుపోయే రెక్కలదేవుడు సంగతి ఏమవుతుంది?

మొత్తం పురాణంఅంతా ప్రకృతిశక్తుల్ని వూహాలో, వూహనుంచీగెలిచి, అధికారం చెలాయించి, ఒక రూపాన్ని ఇస్తుంది. ఈ ప్రకృతిశక్తులమీద వాస్తవ అధికారాన్ని పొందగానే వూహాత్మక అధికారం అదృశ్యం అయిపోతుంది ప్రింటింగ్‌ప్రెస్ పక్షపక్కనే మౌఖికతపోక ఏమవుతుంది? గ్రీకుకళకి గ్రీకుపురాణం పూర్వరంగంగా వుంది. ప్రజలు వూహాశక్తితో ప్రాకృతిక, సామాజిక దృగంశాల్ని ముందే అనుద్దిష్ట కళాత్మక మార్గంలో జీర్ణంచేసుకున్నారు. ఇదే గ్రీకుకళకి వస్తువు. కేవలం ఏ పురాణం అయినా గ్రీకుకళకి వస్తువుకాదు. అనుద్దిష్టంగా కళాత్మకంగా జీర్ణంచేసుకున్న ప్రకృతి లోనిప్రతిదీ గ్రీకుకళకి మూలం ఎన్నడూకాలేదు. గ్రీకుకళకి కారణం కాలేదు. ఏది ఏమయినా పురాణం కళకి పూర్వరంగంగా వుంటుంది. ప్రకృతిమీద పౌరాణిక వైఖరిని సామాజిక అభివృద్ధి నిరోధిస్తుంది. పురాణానికి మూలంగావుండే ప్రకృతికి సంబంధించిన ఏ వైఖరిని అయినాసరే సమాజాభివృద్ధి నిరోధిస్తుంది. అందుచేత సమాజం కళాకారుడునుంచీ పురాణానికంటే భిన్నమైన, స్వతంత్రమైన ఊహాశక్తిని కోరుతుంది.

మరొక అంశం నుంచీ చూస్తే తుపాకీమందు, తుపాకి పేల్చటం కనిపెట్టిన తర్వాత ఎకిలస్ గురించి రాయగలమా? ముద్రణాలయం, అచ్చుయంత్రాలు వున్నప్పుడు ఇలియడ్ చెప్పగలమా? మౌఖికంగా పాడటం, చెప్పటం అనే పురాణ కవిత్వానికి అవసరమైన పరిస్థితులు అచ్చువేయటం అలవాటు అయిన తర్వాత అదృశ్యం కావటం అనివార్యం కాదా?

ఇక్కడ మన సమస్య, గ్రీకుకళ, గ్రీకు పురాణ కవిత్వం కొన్ని సామాజిక అభివృద్ధి రూపాల్తో కలసి, వాటికి? అనుగుణ్యంగా వున్నాయి అనేది అవగాహన చేసుకోవటంలో కాదు- సమస్య ఏమంటే అవి ఇప్పటికీ మనకి ఆనందాన్ని ఇవ్వటం, అవి ప్రమాణంగానూ, ఆదర్శంగానూ వుండటం గురించి.

వయోజనుడు తిరిగి పసివాడుకాలేడు, పిల్లచేష్టలైతే చెయ్యగలడుగాని. కానీ పసిబిడ్డ ముగ్ధత్వం అతనికి ఆనందాన్ని ఇవ్వదా? పసిబిడ్డలోని సహజ సత్యసంధతని వున్నతస్థాయిలో పునరుత్పన్నం చెయ్యటానికి ప్రయత్నం చెయ్యడా? ప్రతియుగంలోని పసిబిడ్డా ఆ యుగ సహజ ముగ్ధసత్యతకి ప్రతినిధికాదా? చారిత్రికంగా అత్యంత మోహనరూపాన్ని పొందిన మానవజాతి బాల్యదశ పునరావృత్తం కాదు కాబట్టీ అది ఆకర్షణని కలిగించదా? కొంటె పిల్లలూ వుంటారు- మంచిపిల్లలూ వుంటారు- చాలా

మంది ప్రాచీన ప్రజలు ఈ తరగతికి చెందిన వాళ్ళే. గ్రీకులు సాధారణమైన పిల్లలు- వాళ్ళ కళ మనల్ని ఆకర్షించటానికి ఆ కళకు ప్రేరణఇచ్చిన అపరిణత సమాజదశ అడ్డురాదు- పైగా గ్రీకు కళలోని ఆకర్షణ ఈ పరిణత సామాజికదశ పర్యవసానమే- దానితో అవిభాజ్యంగా వుండేదే- అపరిణత సామాజిక పరిస్థితులే ఈ కళ ఆవిర్భవించటానికి కారణం- అపరిణత సమాజదశే గ్రీకు కళకి మూలం కాబట్టి ఆ దశ పునరావృత్తం కానప్పటే ఆ కళకూడా పునరావృత్తంకాదు" 16

ఇదేమీ మారుమూల వున్నది కాదు, సాహితీపరులకీ, మార్క్సిస్టులకీ అందరికీ తెలిసిన విషయమే- మార్క్సుని ప్రమాణంగా అంగీకరిస్తున్న ఏటుకూరికి ఈ మాత్రం కూడా తెలియకుండా వుండటం విచిత్రం. "ఆనాటి వుత్పత్తి శక్తులకంటే నాటి సాహిత్యం వున్నతం అనటం ఇష్టంలేదు. కనుక నాటి సాహిత్య స్థాయికి ఆ వుత్పత్తి శక్తులు పెరగలేదు అంటున్నారు" (ఏటుకూరి అభ్యుదయ పేజీ 57) ఈ భాషలో నేను అనలేదు- నాటి సాహిత్యం వున్నతంగా వుండటానికి వుత్పత్తిశక్తులు వెనకబడి వుండటమే కారణం అని మార్క్సు అన్నాడు. "గ్రీకుకళ మనల్ని ఆకర్షించటానికి ఆ కళ పుట్టిన అపరిణత సమాజ దశతో మనకు ఘర్షణరాదు- పైగా దాని ఆకర్షణ ఆ కళ పుట్టిన అపరిణత సమాజ పరిస్థితుల పర్యవసానమే- ఆ పరిస్థితుల్తో అది అవిభాజ్యంగా కలిసివుంది- ఆ సమాజ పరిస్థితులు మాత్రమే ఆ కళ పుట్టటానికి కారణం; అందుకనే అది తిరిగి పునరావృత్తం కాదు" ఇదీ మాటలగారడీ అంటారా ఏటుకూరి? లేకపోతే మావోరాసి మార్క్సు పేరుపెట్టేశాడు అంటారా? "సాహిత్య స్థాయిని ప్రాథమికంగానూ, వుత్పత్తి శక్తుల స్థాయిని ద్వితీయంగానూ చెప్పే స్ఫురణ వుంది" (ఏటుకూరి అభ్యుదయ పేజీ 51) అంటారా? అనదలుచుకుంటే మార్క్సుని అనండి ఆర్థిక నిర్ధాయకవాదం బుర్రలో మకిలిగా పట్టేసివుంటే మార్క్సునీ అనగలరు. మావోనీ అనగలరు- మార్క్సిజాన్ని గురించి ప్రాథమికంగా కూడా తెలీకుండా మళ్ళా భేషజం ఎందుకు? ఇంతటితో ఆగాడా? ఇంకా ముందుకి వెళ్ళాడు "మానవసమాజ బాల్యదశ అనే మాట మార్క్సుది. మార్క్సును బాహటంగా కాదనలేక మార్క్సిజం నుండే మావోయిజానికి పాతకుడ్ని నడిపించేయత్నంలో రచయిత ఈ వుదాహరణ ఇచ్చాడు. కానీ మార్క్సు భావాన్ని రచయిత ఏ మాత్రం గ్రహించలేదు." (ఏటుకూరి అభ్యుదయ పేజీ 51)

"మానవసమాజ బాల్యదశ" అనేమాట మార్క్సుదని గుర్తించినందుకు సంతోషం. కానీ మార్క్సు ఏరచనలో ఎక్కడ చెప్పాడో, మానవజాతి బాల్యదశని

గురించి మార్క్సు భావంగా ఏటుకూరి తాను దంచిన వుపన్యాసానికి మూలం ఏమిటో చెప్పలేదు. మానవజాతి బాల్యదశఅని నేను పేర్కొన్నది. 'historical childhood of humanity'అని మార్క్సు 'పొలిటికల్ ఎకానమీ'లో గ్రీకుకళలోని ఆకర్షణని గురించి చెప్పిన సందర్భంలోది. గ్రీకుకళలోని ఆకర్షణని వివరిస్తూ మనిషి బాల్యదశనీ మానవజాతి బాల్యదశనీ సమాంతరంగా వుపమానాలుగా మార్క్సు ప్రయోగించాడు. మానవజాతి దశల్నీ మనిషి వయోదశల్నీ సమాంతరంగా తీసుకున్నాడు. మానవజాతి బాల్యదశఅంటే అపరిణత సమాజదశఅని అర్థంకానీ, కేవలం బానిస సమాజం అని అర్థంకాదు. వర్గసమాజ పూర్వదశ, వర్గసమాజ ప్రారంభదశల్లో పురాణం మౌఖిక సాహిత్యంగా వుంటుంది. ప్రాచీన గ్రీకు నాటకాలకి కర్మకాండమూలం. ఈ నాటకాల్లో కర్మకాండ (ritual)చట్రం మతరూపం స్పష్టంగానే వున్నాయి. దాన్తోపాటు అభ్యుదయ కరమైన ప్రజాస్వామిక హేతువాద దృక్పథం కూడావుంది. ఎకిలస్ నాటకాన్ని టెట్రాలజీ (Tetralogy) అంటారు. ఇది మూడునాటకాల ఒక పురాణ ప్రదర్శన సంపుటి. సగంమనుషులు సగం జంతువుల ఆకారాలు వుంటాయి. 'ఒరిష్టియా (oresteia)లో ఆటవిక దశనుంచి నాగరిక దశలోకి పురోగమంవుంది.

ఎకిలస్ ప్రజాస్వామ్యవాది పైథాగరస్ అనుచరుడు గణసంప్రదాయానికి ఫ్యూరీస్ అమ్మశక్తులు (Furies) రాచరిక హక్కులకు అపోలో (Appollo) లు ప్రతినిధులు. ఈ ఘర్షణ చివరకి బానిసల్ని మినహాయించిన ప్రజాస్వామ్యంతో పరిష్కారమవుతుంది. వ్యక్తి తన వుద్దేశానికి భిన్నమైన జీవనక్రమంలో ప్రయాణం చేసి పతనం కావటం తరువాతి గ్రీకు విషాద నాటకాల్లో వస్తువు. గ్రీకు పురాణాల్లో గ్రీకునాటకాల్లో వైరుధ్యాలు చాలావరకు కృత్రిమ వైరుధ్యాలు- ఊహాజనిత వైరుధ్యాలు వాటి పరిష్కారాలు కూడా అంతే. గ్రీకు విషాదనాటకాలు అధికారవర్గాలకి అనుకూలమైన భావజాల పాత్రని నిర్వహించాయి. 'కెథార్సిస్' (శోకన?) అంటే అతికర్కశమైన బానిస యజమానుల క్రూరత్వాన్నీ బానిసల స్త్రీలదయనీయ పరిస్థితి నా ప్రేక్షకులకి భరించదగిన సామాన్య విషయంగా, విధిప్రేరితంగా అలవాటుచేయటమే. "ప్రాచీన గ్రీకు సాహిత్యంలో నగరపాలక రాజవంశాలు, దోపిడీ వర్గానికిచెందిన వారు కథావస్తువు. కాగా వారి దోపిడీని ఈ సాహిత్యం సమర్థించిందా? లేదే పైగా అంతా విషాదాంతంగానే ముగుస్తుంది." (ఏటుకూరి అభ్యుదయ పేజీ 52) ప్రాచీన గ్రీకు సాహిత్యం అనే పేరుతో నాటి సాహిత్యాన్ని ఒకే రకమైన సాహిత్యంగా పరిగణించటం తప్పు. అందులో మార్క్సు చెప్పిన మానవజాతి బాల్యదశకి సంబంధించిన సాహిత్యం వుంది. బానిస అర్థబానిస సమాజ సాహిత్యం వుంది. విషాదాంతంగా ముగిసినా అవి

దోపిడీని సమర్థించినవే- బానిస సమాజం అనే ఒక స్వచ్ఛమైన సామాజికదశ ఏ దేశ చరిత్రలోనూ లేదు. మానసిక, శారీరక శ్రమవిభజన బానిస సమాజం కంటే ముందే జరిగింది కాబట్టి గ్రీకు సాహిత్యంలో రెండురకాల సాహిత్యం వుంది. ఒకటి మార్క్స్ చెప్పిన మానవజాతి బాల్యదశకి సంబంధించిన సాహిత్యం. రెండోది, బానిస అర్థ-బానిస వర్గసమాజ సాహిత్యం. ఇక్కడ చర్చ మొదటిదాన్ని గురించే.

"ప్రాచీనకాలపు ప్రజలు తమచరిత్ర పూర్వదశని వూహాలో, వాళ్ళ పురాణంలో జీవించారు"[17] అన్నాడు మార్క్స్. ఈ వూహలూ, పురాణం ఆదిమ సాహిత్యంలో వుంటాయి గ్రీకుల ఆర్థికపునాది, పైపరితలంలో అంశాల్ని అవయవి - అవయవం దృష్టితో పరిశీలిస్తే వర్గేతర సమాజం నుంచీ సంచితంగా వచ్చిన కళారూపాలూ, వూహలూ, అనుభవాలూ గ్రీకుసాహిత్యానికి నేపథ్యంగా వున్నట్టు గ్రహించవచ్చును. కాబట్టి మార్క్స్ 'మానవజాతి బాల్యదశ' అని ఎక్కడ ఏ అర్థంలో అన్నాడో నేను ప్రామాణికంగా చెప్పాను. ఏటుకూరి మానవజాతి బాల్యదశ అంటే బానిస సమాజ దశ అంటున్నాడు. దానికి ప్రమాణం చూపలేదు. చూపలేడు- అలాగే గ్రీకు సాహిత్యాన్ని గురించి ఏటుకూరి పరిశీలనలు అశాస్త్రీయం. బూర్జువా విమర్శకుల అభిప్రాయాల్ని క్రోడీకరించాడు. సాహిత్యంలో సార్వజనీన, సార్వకాలిక అంశంవుంది అనటానికి ఏటుకూరి మరొకఅంశాన్ని ప్రస్తావించాడు.

"నాటి మానవప్రకృతిలోని లోభ, మోద, మోహ, మదమాత్సర్యాలు, దయ, కరుణ ప్రేమలాంటి మానవతా భావాలూ ఈనాటివరకూ వున్నాయి. ఇకముందూ వుంటాయి. కనుక నాటి గ్రీకు సాహిత్యంలో నాటి సమాజ ముద్రవుంది, మానవతా లక్షణాలువున్నాయి. కనుకనే ఈనాటికీ మనం చదివి ఆనందిస్తున్నాం" (ఏటుకూరి అభ్యుదయ పేజీ 52)

కాబట్టి ఏకాలంలోఅయినా, మార్పుచెందని మానవప్రకృతి, మానవస్వభావం ఒకటి వుందన్నమాట. వాస్తవానికి అలాంటిది ఏమీలేదు. లోభ, మోద, మోహ, దయ, ప్రేమలవంటివి మనిషిలో సహజంగా వుండేవికావు. మానవసంబంధాలనుంచీ వీటిని మనుషులు పొందుతారు. ఒకకాలంలోకూడా ఇవి అందరికీ సమానంగా వుండవు. ఆదిమ సమాజంలో వ్యక్తులకీ, వర్గసమాజంలో వ్యక్తులకీ సోషలిస్టు సమాజంలో వ్యక్తులకీ ఇవన్నీ ఒకేవిధంగా మార్పు చెందకుండావుంటే, వర్గ స్వభావాన్నిబట్టి విభిన్నంగావుండకపోతే, సమాజం మారటంఅంటే ఇకఅర్థంఏమిటి? సోషలిస్టు సమాజం మానవప్రకృతిలో ఏమార్పూ తీసుకురాలేకపోతే మనం దానిని కోరటం ఎందుకు?

లోభ, మోహ మదమాత్సర్యాలు రాచరిక వ్యవస్థలో సంపన్న భూస్వాములకీ అర్థ బానిసలకీ ఒకేవిధంగావుండి, సోషలిస్టు సమాజంలో అందరికీ ఒకేవిధంగావుంటే, మార్పువచ్చేది ఎలా? తమచిత్తంవచ్చినట్టు కాకపోయినా సమాజాన్ని మార్చేది మనుషులేకదా? మనుషులు మారకుండా సమాజం మారటంఅంటే అర్థంఏమిటి? సమాజాన్నిమార్చటం తాముమారటం విడివిడిగా ఎలావుంటాయి? సోషలిస్టు సమాజంలో లోభం ఎవరికి వుంటుంది? మదం ఎవరికి వుంటుంది? ప్రేమఅనేది అన్ని సామాజిక వ్యవస్థల్లోనూ ఒకేవిధంగా వుంటుందా? ప్రేమ విఫలంకాగా ప్రేమకోసం ఆత్మహత్య చేసుకొని అమరజీవులైన అమ్మాయిలు ఎంతమంది ఈ సమాజంలోలేరు? ఇదే సోషలిస్టు సమాజంలోనూ కొనసాగుతుందా? ఒకప్పుడు స్త్రీలౌల్యంతో బ్రహ్మాండమైన యుద్ధాలు చేశారు. ఇప్పుడు అలాంటి యుద్ధాలకి ఆస్కారంలేదు. మానవసంబంధాలు మారుతుంటే మానవఅనుబంధాలూ, ఆవేశాలూ మారకుండా ఎలావుంటాయి? వీటికి కారణాల్ని, ఫలితాల్నిచూస్తే వీటిలో చారిత్రికంగా, గతితార్కికంగా ఎంతటి మార్పువచ్చిందో నిరూపించవచ్చును. అన్ని ఆవేశాలకీ వర్గముద్ర వుంటుంది. దోపిడిచేసేవాళ్లు ప్రజలకి శత్రువులు. మూఢవిశ్వాసాలు సమాజ వికాసానికి విరోధకాలు. ఒక కమ్యూనిస్టు దోపిడిచేసేవాళ్ళనీ, మూఢవిశ్వాసాల్నీ ప్రేమించలేడు. విపరీతంగా ద్వేషిస్తాడు. వాటిని నిర్మూలించటానికి పూనుకుంటాడు. ఏటుకూరి 'మానవ ప్రకృతి'అనే ఎలుకతోక పట్టుకొని భావవాద ప్రమాదంలోపడి కామ క్రోధాదుల్ని సార్వత్రికంగా (in general) చూస్తున్నాడు 'మనుచరిత్ర'లో ప్రేమకీ 'కృష్ణపక్షం'లో ప్రేమకీ తేడాలేదా? మహా 'భారతం'లో మదమాత్సర్యాలకీ దయకీ, 'మహాప్రస్థానం'లో మదమాత్సర్యాలకీ దయకీ తేడాలేదా? సాహిత్యంలో సార్వజనీనత వుంటుందనే తప్పుడు సిద్ధాంతాన్ని సమర్థించుకోవటంకోసం మార్పులేని, చలనంలేని 'మానవప్రకృతి'ని సమర్థించేవరకూ ఏటుకూరి తిరోగమించాడు- ఇక మార్క్సుపేరూ లెనిన్‌పేరూ సోషలిజంపేరూ, గతితార్కిక భౌతికవాదంపేరూ ఎందుకు జపించటం? సార్వజనీనతని సమర్థించేవాడు సార్వకాలికతని సమర్థించటం అనివార్యం. ఈ విషయంలో ఏటుకూరి ఇంకాపెద్ద సుడిగుండంలో పడ్డాడు. సమకాలీన వస్తువూ ప్రాచీన వస్తువూఅంటూ వస్తువుఅంటే ఏటుకూరి కథ అనుకుంటున్నాడు.

సాహిత్యంలో వస్తువు మానవ ప్రకృతిలో ప్రేమ, ద్వేషం లాగానే, రచయిత ఇష్టాయిష్టాల్తో సంబంధం లేకుండా వునికిలోవుండే బాహ్యప్రపంచానికి సంబంధించింది. ఆ ప్రపంచంలో రచయిత కూడా ఒక భాగం. మూలవస్తువు ఒకటి వుంటుంది. దాన్ని రచయిత స్వీకరించినప్పుడు రచయిత దానితో పెట్టుకునే సంబంధాన్ని సాహిత్యంలో

'వస్తువు' అంటాను. తెలంగాణా పోరాటం గంగినేనికీ ఆరుద్రకీ కూడా బాహ్య సత్యం. దానితో గంగినేని తన సాహిత్యంలో ఒక సంబంధాన్ని పెట్టుకున్నాడు. ఆరుద్ర తన కవిత్వంలో ఒక సంబంధం పెట్టుకున్నాడు. ఇక్కడ మూలవస్తువు తెలంగాణా పోరాటం కానీ వస్తువు తెలంగాణా పోరాటం కాదు. దాన్తో గంగినేని, ఆరుద్ర తమ సాహిత్యంలో పెట్టుకున్న సంబంధం వస్తువు. వాల్మీకి రామాయణంలో, కంబరామాయణంలో తులసీదాసు రామాయణంలో కథ ఒక్కటే. కానీ వస్తువు విభిన్నంగావుంది. కాబట్టి కవి ప్రాచీన కథ, భావాలూ తీసుకున్నా సమకాలిక కథ, భావాలూ, సమస్యలూ తీసుకున్నా దాన్తో తన కవిత్వంలో పెట్టుకునే సంబంధం సమకాలికంగానే వుంటుంది. గుణాఢ్యుడుకానీ భాసుడుకానీ తమ కాలానికి భిన్నంగా రాసింది ఏమీలేదు. వాళ్ళ కాలంలోవున్న వర్గాల్తో వాళ్ళకున్న సంబంధాన్ని అనుసరించే రాసాడు. భాసుడు వర్ణాశ్రమ ధర్మాల్నీ, రాజవంశాన్నీ, స్త్రీ పాతివ్రత్యాన్నీ ఆమోదించినవాడే. కైకవంటి పాత్రల్లో భాసుడు చేసిన మార్పులు రాజవంశకీర్తిని నిలపటానికే చేశారు. భారత, రామాయణాలు కూడా చాలా స్పష్టంగా బాహాటంగా దోపిడీని సమర్థించినవే. పీడితుల్ని పరమనీచంగా న్యూనపరిచినవే. బ్రాహ్మణాధిక్యతను బోధించినవే. సాహిత్యం కాకుండా మతగ్రంథాలు మాత్రమే అయిన రచనలకి సాహిత్య గౌరవం వుండదు. మత గౌరవమే వుంటుంది. ఆయామతాలవాళ్ళు వాటిని పవిత్రగ్రంథాలుగా పూజించుకుంటూనే వున్నారు. ఇవికూడా అనేక కావ్యాలకి మూలవస్తువుని ప్రసాదించాయి. ధర్మశాస్త్రాలకి ఆనాడు గౌరవం లేకపోవటం ఏమిటి? అఖండమైన గౌరవాన్ని పొందాయి. ధర్మశాస్త్రాల్లోవున్న విషయాలు ఎన్ని ఎంతవరకు ఆచరణలో వున్నాయి అనేది ప్రత్యేకంగా పరిశోధించవలసిన విషయం. ఏటుకూరి సాహిత్యంలో సార్వకాలికతని కూడా నిరూపించలేకపోయాడు.

ఒక దోపిడీవర్గం స్థానంలో ఇంకో దోపిడీవర్గం రాజకీయ అధికారంలోకి వచ్చే దశల్లో అధికారంలోకివచ్చే వర్గం, వచ్చిన వర్గం ఒక వర్గానికి కాక మొత్తం సమాజానికి ప్రాతినిధ్యంవహించినట్లు కనిపిస్తుంది. వర్గ ప్రయోజనాల కోసం కాక సమాజ ప్రయోజనాల కోసం నిలిచినట్టు నినాదాల్ని ఇస్తుంది. అలాంటి వాతావరణాన్ని కల్పిస్తుంది. ఇక్కడా అధికారం కోసం పోరాటంచేస్తున్న వర్గప్రయోజనాలే అందరి ప్రయోజనాల రూపంలో చిత్రింపబడినాయని చరిత్రని పరిశీలిస్తే తెలుసుకోవచ్చును. ఈ దశల్లోనే షేక్స్పియర్ వంటి రచయితలు స్వవర్గ పరిమితుల్ని దాటారు. ఇలాంటి దశల్లోని సాహిత్యం సార్వజనీన సార్వకాలిక భూమికలిగిస్తుంది.

ఈ సాహిత్యం కూడా అంతకుపూర్వం వుండిన సాహిత్యం కంటే భిన్నంగా వుంది కనకా తరువాతి సాహిత్యం దీని కంటే భిన్నంగా వుంది కనకా సార్వజనీన, సార్వకాలిక సూత్రం దీనికి అన్వయించదు. "యథాతథవాదతాత్త్విక దృష్టిగల రచయితలు సైతం సాహిత్యపరంగా గొప్ప కళాఖండాలు నిర్మించిన వుదంతాలు పూర్వమూ వున్నాయి ఈనాడూ వున్నాయి (ఏటుకూరి. అభ్యుదయ పే. 54) అంటే రచయిత తన తాత్త్విక దృష్టికి భిన్నమైన కళాఖండాన్ని నిర్మించే అవకాశం వుందని అర్థం.... యథా తథ వాదతాత్త్విక దృష్టిగల కళాకారులు కూడా గొప్ప కళాఖండాలు సృష్టించవచ్చు. కానీ ఆ గొప్ప కళాఖండాల్లో వుండేది యథాతథ తాత్త్విక దృష్టికాదు. అలాంటి తాత్త్వికదృష్టివున్న రచన గొప్ప రచనకాలేదు. అలాంటి వుదాహరణ సాహిత్య చరిత్రలో ఒక్కటి కూడా లేదు. తన తాత్త్వికదృష్టి కంటే భిన్నమైన కళాఖండాన్ని కళాకారుడు ఎలా నిర్మించగలుగుతాడు? పునాది - ఇతర వుపరితల అంశాల్లో అవయవంగా కళ వుండటం వల్లనే ఇది సాధ్యం అవుతోంది. ఏటుకూరి గతితార్కిక భౌతికవాద విరుద్ధమైన సార్వకాలిక, సార్వజనీన, విశ్వజనీన, సార్వత్రిక భావనల్ని సమర్థించటానికి పూర్తిగా భావవాద, అధిభౌతికవాద గందరగోళంలోపడి పోయాడు.

6. వ్యాసంనిండా ద్వంద్వాలు వున్నాయనీ, అవి అశాస్త్రీయాలనీ ఏటుకూరి ఖండించాడు. వాటిని వరసగా చర్చిస్తాను.

బాహ్య గతితర్కం, అంతరగతితర్కం: బాహ్య గతితర్కం అంటే ఏమిటి? అని ఏటుకూరి ప్రశ్న. పునాదిలో కానీ ఉపరితల అంశాల్లో కానీ ఒకదానిలో ప్రత్యేకంగా గతితర్కం వుంటుందనే వాదం, పునాదికీ వుపరితలానికీ పరస్పర సంబంధాన్ని స్థూలంగా ఆమోదించి వుపరితల అంశాల మధ్య అన్యోన్య సంబంధాన్ని నిర్లక్ష్యం చేయటం, పునాది వుపరితల అంశాల్లో ప్రతిదీ సంభవించటం, అభివృద్ధి పొందటం, సామాజికపాత్ర నిర్వహించటంలో ఇతర వుపరితల అంశాల అన్యోన్య సంసర్గాన్ని నిర్లక్ష్యం చెయ్యటం బాహ్య గతితర్కం. బూర్జువా తర్కం, interdisciplnary method కూడా బాహ్య గతితర్కంలో భాగాలే. ఈ బాహ్య గతితర్కాన్ని నేను ఖండించాను. అంటే అది నా పూర్వపక్షం. ఎవడూ అనకపోయినా పూర్వపక్షాన్ని మనం వూహించి కూడా ఖండించాలి. అది నా పూర్వపక్షం అనే విషయాన్ని ఏటుకూరి మరుగుపరచటం ఎందుకు?

చారిత్రిక పాత్ర, సామాజిక పాత్ర: "ప్రాచీన సాహిత్యానికి చారిత్రిక పాత్ర మాత్రమే వున్నదట. మరి ప్రాచీన సాహిత్యం ద్వారా ఈనాటికీ ప్రభావితులౌతున్న

వారి విషయం ఏమిటి ? ఈ ప్రభావం అనుకూలం కావచ్చు. వ్యతిరేకం కావచ్చు. అయినా ప్రభావితులౌతున్నారు కదా" (ఏటుకూరి పేజీ 54) చారిత్రిక పాత్ర అంటే ప్రాచీన సాహిత్యాన్ని నిరాకరిస్తున్నట్టు ఏటుకూరి తప్పుడు భాష్యం చెపుతున్నాడు- ప్రాచీన సాహిత్యం గురించి నా వ్యాసంలోనే రాసిన విషయాన్ని ఏటుకూరి కావాలనే చర్చకి తీసుకోలేదు "పూర్వ సాహిత్యాన్ని పరిశోధించేటప్పుడు ఆ నిర్దిష్ట సాహిత్యానికి ఆనాటి చారిత్రికార్థం, తర్వాతి తరాల చైతన్యంలో అపూర్వ రచన పొందిన రూపాలనూ గమనించాలి" (సృజన పేజీ 15) ప్రాచీన సాహిత్యాన్ని వదిలేయమనీ, అది ఎందుకూ పనికిరానిదనీ నేను ఎక్కడా ఎప్పుడూ రాయలేదు. ప్రాచీన సాహిత్యాన్ని రెండు స్థాయిల్లో పరిశీలించాలి, అనేది నా వాదం. మొదటిది ఆ సాహిత్యాన్ని దాని కాలంలోని సమాజంలో భాగంగా పరిశీలించటం రెండోది, ఆ సాహిత్యం తర్వాతి తరాల చైతన్యంలో పొందినరూపాల్ని పరిశీలించటం. రామాయణం ప్రాచీన సమాజంలో భాగంగా ఎలాంటి సామాజికపాత్ర నిర్వహించిందో విశ్లేషించటం మొదటి కర్తవ్యం. తర్వాత మధ్యయుగాల రచయితల, ప్రజల చైతన్యంలో, ఈనాటి రచయితల, ప్రజల చైతన్యంలో పరివర్తనారూపంలో నిర్వహిస్తున్న పాత్రని విశ్లేషించాలి. ఈనాటి పండితులూ పాలకవర్గాలూ రామాయణాన్ని తమ వర్గాధిక్యతకూ, తమ స్వార్థప్రయోజనాలకీ అనుగుణ్యంగా వుపయోగించుకొంటున్న విషయాన్నీ బహిర్గతం చెయ్యాలి చరిత్రకీ వర్తమానానికీవుండే సంబంధాన్నీ ఏటుకూరి 'ప్రభావం'వంటి బూర్జువా భాష్యకారుల పరిభాషతో చెప్పటానికి పూనుకొని శాస్త్రీయంగా వివరించలేక పోయాడు- గతానికీ వర్తమానానికీ చారిత్రిక సామాజిక పాత్రలనే విభజనతో ఈనాటి భౌతిక వాస్తవికతతో విడివడివున్న ఈనాటి చైతన్యంలో గతంపాత్ర వివరించటంతో ప్రాచీనసాహిత్యానికీ ఈనాటికీవున్న సంబంధాన్ని గతితార్కిక భౌతికవాద పరంగా వివరించాను. ఏటుకూరి ఈ విషయాన్ని అవగాహన చేసుకోలేక పోయాడు. ఏటుకూరి ప్రాచీన సాహిత్యానికి కేవలం 'ప్రభావం'చేసేశక్తి మాత్రమే వుంటుందంటున్నాడు. నేను 'సంబంధం' వుంటుందంటున్నాను. ఎవరిది నిహిలిస్టుదృష్టి ? చాలా స్పష్టంగా వున్న వాక్యాల్నికూడా వక్రీకరించి పేరుచేసి ఏటుకూరి గందరగోళం చేశాడు. "అడుగడుగునా తనకాళ్ళకి తానే బంధాలువేసుకునే ఈ ఆలోచనను ఏమనగలం ?" అని నివ్వెరపోయాడు. మనం తప్పులుచేస్తున్నామేమో, అవగాహన చేసుకోలేక పోయామేమో అనే అనుమానం నిజాయితీ లేనివాడికి రాదు. వాక్యాల్లోలేని వైరుధ్యాల్ని వున్నట్టు చిత్రించటం అసమర్థతఅన్నా కావాలి, కుతంత్రంఅన్నా కావాలి. ఏటుకూరిలో రెండూవున్నాయి.

"ప్రాచీన సాహిత్యం సాహిత్యం కాదు, సాహిత్య చరిత్ర" (11 పేజీ)

"సాహిత్యాన్ని చారిత్రికంగా పరిశీలించటం గతితార్కిక భౌతికవాదం కాదు" (పేజీ 10)

రెండు పేజీల్లో విభిన్న సందర్భాల్లోవున్న రెండు వాక్యాల్ని ఒక పేజీలో వున్నాయని చిత్రిస్తూ పక్కపక్కన చేర్చి కువ్యాఖ్యానం చేశాడు. నేను రాసింది- "ప్రాచీన సాహిత్యం సాహిత్యం కాదు, సాహిత్య చరిత్ర, చరిత్ర. ఈనాడు ప్రాచీన సాహిత్యానికి చారిత్రిక పాత్ర మాత్రమే వుంటుంది. సామాజిక పాత్ర వుండదు. సాహిత్య సామాజిక పాత్ర ఆ సాహిత్య సంబంధమైన సామాజిక వ్యవస్థతో పాటే అదృశ్యం అవుతుంది" ఇది సాహిత్య సార్వజనీన, సార్వకాలిక, అనిర్దిష్ట సార్వత్రిక వాదాల్ని ఖండిస్తూ రాసింది. మహాభారతం చదివి ఈనాటి సమాజ స్వరూపాన్ని అవగాహన చేసుకోలేం. సామాజిక సమస్యల విషయంలో ఎరుకని పొందలేం. మహాభారతం ఏ వర్గ సాహిత్యంగా వుందో ఆ వర్గం పోయిన ప్రతిష్టని పునరుద్ధరించుకోటానికి ఈనాటికీ మహాభారతాన్ని సమాజ సమస్యల్ని పరిష్కరించే సాధికార పవిత్ర గ్రంథంగా ప్రచారం చేస్తుంటారు. దీన్ని పరాస్తం చెయ్యటానికే ప్రాచీన సాహిత్యం సాహిత్యం కాదు సాహిత్య చరిత్ర, చరిత్ర అన్నాను. విజయనగర యుగంతో ఈనాడు మనకివున్న సంబంధమే ప్రబంధ సాహిత్యంతో ఈనాటి సాహిత్యానికి వుంటుంది. సాహిత్యం అనే విషయాన్ని నిర్దిష్టంగా చూడాలి కానీ అనిర్దిష్టంగా చూడకూడదనేది ఇక్కడ ప్రధానమైనచర్చ. నిర్దిష్ట - అనిర్దిష్టవాదాల్ని గురించి వ్యాసంలో చేసిన విపులమైన చర్చని ఏటుకూరి అర్థంచేసుకోలేదు. పైగా Study of the particular is the essence of Dialectics అనే లెనిన్ వాక్యంలోని అర్థం గ్రహించినట్టే లేదని అభాండం వేశాడు. దీన్ని జల్పం అంటారు కానీ వాదం అనరు. ఇక రెండోది చారిత్రికంగా పరిశీలించటం అంటే ఏమిటో చర్చిస్తూ కాలక్రమ చారిత్రికపద్ధతి, తార్కిక చారిత్రిక పద్ధతుల్లో తార్కిక చారిత్రిక పద్ధతి విశిష్ట మార్గం అని నిరూపించిన సందర్భంలోనిది. చారిత్రికంగా పరిశీలించే పద్ధతి మార్క్స్ కంటే ముందునుంచీ వుంది. అది బూర్జువా పద్ధతే. చారిత్రికంగా మాత్రమే పరిశీలిస్తే చాలదు. గతితార్కికంగానూ, చారిత్రికంగానూ భౌతికవాద పరంగానూ పరిశీలించటం గతితార్కిక భౌతికవాద విధానం అని చెప్పటానికి కేవల చారిత్రిక పరిశీలనా పద్ధతిని ఈ వాక్యంలో నిరాకరించాను; ఇది తెలిసీ ఏటుకూరి వాక్యాన్ని సందర్భం నుంచీ విడదీసి మరొక సందర్భంలోని మరొక వాక్యం పక్కనచేర్చి దుర్వ్యాఖ్యానం చెయ్యటం, ఇది వాదవిధానంలో అవినీతి కాదా?

7. సాహిత్య విమర్శ, విప్లవం, గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్ప థంగల సాహిత్యం, కార్మికవర్గ విప్లవం, సాహిత్యం ఆచరణగా మారటం మొదలైన విషయాల్ని ఏటుకూరి కనీసం సమీపించలేక పోయాడు. "పి. పి. మార్క్సిజం" అన్నిటికీ చాలదని ఏటుకూరి గమనించలేక పోయాడు? సాహిత్యం ఎప్పుడు ఆచర ణగా అంటే భౌతికశక్తిగా మారుతుంది? ఎలాంటిసాహిత్యం భౌతికశక్తిగా అంటే ఆచరణలో భాగంగా మారుతుంది? విప్లవానికీ సాహిత్యానికీ సంబంధం ఏమిటి? ఇవిచాలా కీలకమైన అంశాలు. ఇక్కడ ఏటుకూరి తాత్విక గందరగోళంలో పడిపోయి నాటురకం వెక్కిరింతలకి పూనుకున్నాడు. విప్లవవర్గ సాహిత్యం విప్లవ పోరాటాల్లో భాగంగా వుంటుంది. విప్లవం, విప్లవ సిద్ధాంతం విప్లసాహిత్యానికి ఆచరణ శక్తిని ఇస్తాయి. విప్లవం అనేది నిర్మాణాత్మక సంఘటిత కార్యాచరణగానే వుంటుంది. దాన్తో అన్వయం గల సాహిత్యానికే ఆచరణ కాగలశక్తి వుంటుంది. ఆచరణ రచయితలకీ పాఠకులకీ, శ్రోతలకీ, ప్రేక్షకులకీ కూడా అన్వయిస్తుంది. సామాజిక విప్లవంలో సాహిత్యం నిర్వహించే పాత్రను గురించిన శాస్త్రీయ చర్చ ఇది. ఈ విషయంలో సంప్రదాయవాదుల్ని వదిలేసినా అధిభౌతిక సాహిత్యవాదికీ, గతితార్కిక భౌతిక సాహిత్యవాదికీ భిన్నమైన వైఖరివుంటుంది. "చాలా మందికి తెలియని విషయమే మంటే, అభ్యుదయ రచయితలు అభ్యుదయ సాహిత్యం సృష్టించినంత మాత్రాన విప్లవాలూరావు, సామాజిక అభ్యుదయమూ లభించదు" (రా. రా. సాహిత్య తత్వం. పరిచయం. పేజీ 6 యుగ సాహితి) సాహిత్యంవల్ల విప్లవం వస్తుందా రాదా? అనే పద్ధతిలో ప్రశ్న వేసుకోవటం తప్పు. తప్పుడు ప్రశ్నకి తప్పుడు సమాధానమే వస్తుంది. పునాది ఉపరితల అంశాల నుంచీ సాహిత్యాన్ని విడదీసి సాహిత్యం వల్ల విప్లవం వస్తుందా? రాదా? అని ఆలోచించే ధోరణే అధిభౌతిక (Metaphysical) దృక్పథం. కాళ్ళతో నడుస్తామా? గుండెతో నడుస్తామా? అన్నట్లువుంది. నడిచేది కాళ్ళతోనే కానీ గుండెజబ్బు వున్నవాడికీ, గుండె ఆరోగ్యంగా వున్నవాడికీ నడకలో తేడాలేదూ? గుండె ఆగిపోతే కాళ్ళతో ఎట్లానడుస్తాడు? కాబట్టి నడిచేది కాళ్ళతోనే అయినా అది గుండెమీద, మెదడు మీద, కళ్ళమీద ఇంకా ఇతర శారీరక, భౌగోళిక విషయాలమీద ఆధారపడి వుంటుంది. పైగా విప్లవకారుల నుంచీ విప్లవాన్నీ, విప్లవం నుంచీ విప్లవకారుల్నీ విడదీసి చూడటం ఏమిటి?

గతితార్కిక సాహిత్య భౌతికవాది సాహిత్యాన్ని పునాది వుపరితలం అంశాలూ కలిసివుండే అవయవిలో అవయంగా పరిగణిస్తాడు కాబట్టి సాహిత్యానికివుండే విప్లవ కర శక్తిని విశ్లేషించగలడు. అవయవి అవయం భావనకి సాహిత్యానికీవుండే విప్లవ

కార్యాచరణశక్తిని అవగాహన చేసుకోటానికి పదార్థానికీ చైతన్యానికీవుండే సంబంధాన్ని పరిశీలించాలి. ఈ విషయంలోనూ అధిభౌతిక వాదులూ, రివిజనిస్టులూ చాలా అపసిద్ధాంతాల్ని ప్రచారం చేశారు. పదార్థంఅంటే మన ఇంద్రియాలద్వారా మన మెదడులో ఏర్పడే పదార్థానికి సంబంధించిన భావనే అంటే మన మనస్సులో వుండేది పదార్థం కాదు, పదార్థానికి సంబంధించిన చైతన్యం. పదార్థం నుంచీ చైతన్యం పుడుతుంది అంటే, పదార్థం మనకి బాహ్యంగా స్వతంత్రంగా వుంటుందనీ దానినుంచీ పుట్టిన చైతన్యం అనేక రూపాల్లో మనమనస్సులో వుంటుందనే అభిప్రాయంతప్పు. పదార్థానికి సంబంధించిన భావనా, ఆ పదార్థానికి ప్రతిబింబమైన చైతన్యం కలిసే మెదడులో వుంటాయి. ఇలావుండటానికి మనమెదడు చైతన్య యంత్రంగంగల పదార్థం కావటమే కారణం. కాబట్టి మన మెదడులోవుండే పదార్థ భావన వాస్తవ పదార్థానికి అనుగుణ్యంగా లేకపోతే, పదార్థంనుంచీపుట్టే చైతన్యరూపాలమీద సరియైన అవగాహన వుండదు. పదార్థాన్ని మార్చాలంటే, మన అవసరాలకి అనుగుణ్యంగా చేసుకోవాలంటే, మన మనస్సులోవుండే పదార్థ భావననీ దాని చైతన్య రూపాల్నీ సరిగ్గా ప్రయోగించాలి. ఆ ప్రయోగించే క్రమంనుంచీ మనుషులు విడిగా వుండరు. దాన్తో అవిభాజ్యంగా వుంటారు. ఈ సూత్రంవెలుగులో అవయవి అవయవంగా పునాది ఉపరితల అంశాల్ని పరిశీలిస్తే సాహిత్యానికివుండే విప్లవ ఆచరణని అవగాహన చేసుకోవచ్చును. పునాదినుంచీ సాహిత్యానికి వర్గస్వభావం వస్తుంది. తత్త్వశాస్త్రంనుంచీ సాహిత్యానికి వస్తువువస్తుంది. రాజకీయాల నుంచీ సాహిత్యానికి ప్రజల్ని విద్యావంతులుగాచేసే శక్తివస్తుంది. న్యాయ శాస్త్రంనుంచీ రాజ్యాంగ యంత్రాన్ని ధిక్కరించే చేవవస్తుంధి. విజ్ఞాన శాస్త్రాలనుండి తప్పుడు చైతన్యంనుంచీ బయటపడే అవకాశం లభిస్తుంది. ఇదంతా సాహిత్యానికీ, పునాది, ఇతర వుపరితల అంశాల్లో అవయవంగా వున్నప్పుడే సాధ్యంఅవుతుంది. విప్లవం రాజకీయరూపంలోనే వుంటుంది కానీ విప్లవానికి రాజకీయ పోరాటం మాత్రమే ఏకైకరూపంగా చెప్పటం, సంకల్పానికి ప్రధాన స్థానంఇచ్చే భావవాదధోరణి. సంకల్పం లేకపోతే ఏదీజరగదు. అయితే సంకల్పంతోనే అన్నిజరగవు. సంకల్పంకూడా పునాది, వుపరితల అంశాల్లో భాగంగానే వ్యక్తులకి కలుగుతుంది. విప్లవంలో అవయవిలో అన్ని అవయవాలూ తమ పాత్రని నిర్వహిస్తాయి. కనక గతితార్కిక సాహిత్య భౌతికవాది సాహిత్యానికి విప్లవ ఆచరణగామారేశక్తి వుందనీ, పునాదితో ఇతర వుపరితల అంశాల్తోకలిసి సాహిత్యం కూడా విప్లవానికి కారణం కాగలదనీ గ్రహించగలడు. ఈ విషయాల్ని చర్చలోకి తీసుకోకుండాఏటుకూరి పరమ సంకుచితంగా వ్యవహరించాడు. "తన రాజకీయాభిప్రా

యాలకి భిన్నంగా వ్యతిరేకంగా ప్రపంచాన్ని లోతుగా అర్థంచేసుకోవటం గతితార్కిక భౌతికవాదికి అసంభవం"(సృజన, పేజీ 13)

దీనికి ఏటుకూరి చేసిన వ్యాఖ్యానం మరీ చిత్రంగావుంది. కమ్యూనిస్టుపార్టీ ప్రాపంచిక దృక్పథం గతితార్కిక భౌతికవాదం. గతితార్కిక భౌతికవాది రాజకీయాలు కమ్యూనిస్టు రాజకీయాలు. కమ్యూనిస్టు తన రాజకీయాలకి భిన్నంగా ప్రపంచాన్ని అర్థంచేసుకోలేడు. అలా చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యడు. ఇందులో ఏం తప్పు వుంది? దొంగనుపట్టుకున్న పోలీసులాగా ఏటుకూరి బ్రహ్మానందం పొందటానికి ఇక్కడ ఏముంది? పైగా వెకిలి మాటలు ఎందుకు? వ్యూహం, ఎత్తుగడల వంటి అధికప్రసంగం ఎందుకు? పార్టీ డాక్యుమెంట్ల మీద చర్చకాదు నేను చేసేది- ఇక్కడ గతితార్కిక భౌతికవాద రాజకీయాలు అంటే కమ్యూనిస్టు రాజకీయాలనే అర్థం- "కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ లక్ష్యాలూ దాచుకోవటం అంటే అసహ్యం" (మానిఫెస్టో) అని మార్క్స్ అన్నాడు- అంటే ఎత్తుగడలూ, పార్టీ రహస్యాలూ కూడా కమ్యూనిస్టులు దాచుకోరని అర్థం చెపుతాడా ఏటుకూరి? దీనికి వున్న సామాన్యార్థమే నా వాక్యాలకీ వుంది- నేను మాట్లాడేది మౌలిక సిద్ధాంతం గురించే- పార్టీకి సంబంధంలేని మౌలిక సిద్ధాంతం ఏమిటి? అది ఎందుకు? పార్టీతో సంబంధం లేకుండా గతితార్కిక భౌతికవాదం కానీ, గతితార్కిక ప్రాపంచిక దృక్పథంలేని కమ్యూనిస్టుపార్టీ కానీ కార్మికవర్గ విప్లవానికి దేనికి పనికివస్తాయి?

8. ఏటుకూరి నేను చెప్పని విషయం ఏమన్నా చెప్పినా అవగాహనకి దోహదం చేశాడా? Human Alienation వ్యక్తి వైకల్యం అనేదాన్ని గురించి చెప్పాడు- చెప్పటమే కాదు "ఇదే మార్క్సిస్టు సాహిత్య విమర్శనకంతా మూలం" అని సిద్ధాంతం చేశాడు- అంతేకాకుండా తనకుతానే "బహుశా మధుసూద రావుగారు వ్యక్తి వైకల్యం సూత్రం ఆమోదించరు" అని సెలవిచ్చాడు- నిజమే, నాకు ఆమోదించ టానికి అభ్యంతరం వుంది- నాకే కాదు మార్క్సిస్టు - లెనినిస్టు లందరికీ అభ్యంతరం వుంటుంది- దేశసంపదను సృష్టిస్తున్న శ్రామికవర్గంలో నాకు మహోన్నత మానవతా శిఖరాలు కనిపిస్తున్నాయి- కార్మిక, రైతాంగవర్గాలు ఎగరేస్తున్న నిర్భీకతా నిజాయితీల జెండాల రెపరెపలు కనిపిస్తున్నాయి. దేశదేశాల్లో జాతివిముక్తి పోరాటాలూ సోషలిస్టు, ప్రజాతంత్ర విప్లవాలుచేస్తున్న కమ్యూనిస్టు విప్లవకారులు సామాజిక మానవతావాద మహాగానాలు చేస్తున్నారు. నా ఆమోదం సంగతి అలావుంచి alienation గురించి చర్చిద్దాం. దీన్ని మార్క్స్ Economic and philosophic Manuscripts

అనే గ్రంథంలో చెప్పాడు. ఈ గ్రంథం మార్క్స్ తొలిరచనల్లో ఒకటి. తన అన్వేషణలో గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్పథాన్ని చేరుకుంటున్న మార్గంలో తొలిదశలో పుస్తకం ఇది. ఈ పుస్తకం 1932 లో మొదటిసారి అచ్చు అయింది. 1959 లో మొదటి ఇంగ్లీషు అనువాదం ప్రచురించబడింది. దీన్ని లెనిన్ చదవలేదు. ఎంగెల్సుకి ఈ పుస్తకాన్ని గురించి తెలిసినట్టు రుజువు లేదు. కాడ్వెల్, రాల్ఫ్‌ఫాక్స్‌లు alienation సమస్య మీద ఎంతో కృషిచేశారని ఏటుకూరి అనటం చరిత్ర విరుద్ధం, వాస్తవ విరుద్ధం.

1937 జనవరిలో రాల్ఫ్‌ఫాక్స్, ఫిబ్రవరిలో కాడ్వెల్ పోరాటంలో అమర జీవులయ్యారు. ఇద్దరివిమర్శకి వర్గపోరాటం, భౌతికవాదం మూలాధారాలు. ఇటీవల పాశ్చాత్య దేశాల్లోని 'మార్క్సిస్టు పండితులు' మార్క్సిస్టు వ్యతిరేకులూకూడా ఈ Alienation మీద అసంఖ్యాకంగా పుస్తకాలు రాసారు, రాస్తున్నారు. బూర్జువా మానవతా వాదులకీ, మతవాదులకీ, అస్తిత్వవాదులకీ, న్యూలెఫ్ట్ భాష్యకారులకీ మార్క్స్ చిన్నప్పుడుచెప్పిన Alienation భావనలో మహా ప్రపంచాలు కనిపించాయి. వర్గ పోరాటం, శ్రామికవర్గ నియంతృత్వం, అదనపువిలువ, విప్లవం, గతితర్కం, భౌతికవాదం, సోషలిజంవంటి భావనలకంటే "మార్క్స్ మార్క్సిజం"లో Alienation ప్రధానమైన భావనగా అనేకమంది ప్రచారం చేస్తున్నారు. లెనినిజం నుంచీ దేశదేశాల్లోని మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలనుంచీ మార్క్సుని వేరుచేయటం చివరికి ఎంగెల్సునుంచీ మార్క్సుని వేరుచేయటం ఈవ్యక్తి వైకల్యవాదుల ధ్యేయం, వీళ్ళని Marxiologists అంటారు. మార్క్స్ మతానికి వ్యతిరేకికాడనీ, వర్గాతీత మానవతావాది అనే ఈ భావనద్వారా నిరూపించటానికి అనేకమంది బూర్జువా మేధావులు నానాతంటాలుపడి పుస్తకాలు రాస్తున్నారు. 'కేపిటల్' రాసిన మార్క్సుకంటే Alienation గురించి రాసిన మార్క్స్ గొప్పవాడని పెట్టుబడిదారీ మార్కెట్ మేధావులు ప్రచారం చేస్తున్నారు. బూర్జువా, పెటీబూర్జువా మేధావులకి మార్క్స్ తొలి రచనల సంపుటి (Early writings) Economic and Philosophic Manuscripts of 1844 హ్యాండ్‌బుక్ అయిపోయింది. ఇది మన దేశంలోకూడా యూనివర్శిటీల్లోకి అక్కడక్కడా ప్రవేశించింది. మార్క్సిజాన్ని బోధిస్తూనే మార్క్సిజాన్ని దెబ్బతీయటానికి జరుగుతున్న తాజాప్రయత్నాల్లో ఇదిఒకటి. ఏటుకూరి తన పాండిత్యాన్ని ప్రదర్శించేముందు ఈ విషయాల్ని పట్టించుకోలేదు. మార్క్స్ పరిణత రచనల్లోకూడా Alienationని ఏదో ఒకమాటతో వాడుతూనే వచ్చాడని చెప్పటానికి మార్క్సియవాదులు చాలా పరిశోధనలుచేసి శ్రమపడ్డారు. సంఘటితం కానిదశలో

కార్మికులకీ మరీ ముఖ్యంగా స్త్రీలకీ ఈ alienation అనేది అన్వయిస్తుంది. కార్మిక వర్గం స్వవర్గచైతన్యాన్ని పొందిన తర్వాత కార్మికులకి alienation సూత్రం వర్తించదు. అలావర్తిస్తే వైకల్యం పొందినవాళ్ళు విప్లవానికి నాయకత్వం వహిస్తారు అని చెప్పినట్టు అవుతుంది. అది ఎలాసాధ్యం ? అంతేకాకుండా alienation అనేది వ్యక్తుల్లో పాతుకొని వుండేదికాదు. మానవ సంబంధాలనుంచీ మానవులకి సంక్రమించేదే. అలాంటప్పుడు అది సమస్త జీవితరంగాల్లోనూ వుంటుంది. అనేక భాష్యాలకి అవకాశంఇచ్చే alienation అనే మాటకంటే మార్క్స్ Manuscripts (p 116)లో capital (p 76)లో వాడిన Fetishism అనే మాటని స్వీకరించటంమేలు.

"మనుషుల దృష్టిలో వస్తువుల మధ్య సంబంధంగా విపరీత రూపాన్ని పొందే ఒక స్పష్టమైన సామాజిక సంబంధంవుంది. దీన్తో పోలికవున్నదాన్ని చూడాలి అనుకుంటే పొగమంచుతో కప్పబడి వుండే మత ప్రపంచాన్ని ఆశ్రయించాలి. ఈ మత ప్రపంచంలో మనుషుల మెదడు నుంచీ వుత్పన్నమైనవే ప్రాణంపోసుకొని మనుషులకంటే స్వతంత్ర వస్తువులుగా కనిపిస్తాయి. అవి ఒకదానితో ఒకటి పరస్పర సంబంధం పెట్టుకుంటాయి. మానవజాతితోనూ సంబంధం పెట్టుకుంటాయి. సరుకుల ప్రపంచంలో మనుషులు తమ శ్రమతో వుత్పత్తి చేసిన వస్తువులు కూడా సరిగ్గా ఇలాగే వుంటాయి. దీన్నే నేను తాంత్రిక ఆరాధన (fetishism) అంటున్నాను. శ్రమశక్తి నుంచీ వుత్పత్తి చేయబడేవి అమ్మకపు సరకులుగా వుత్పత్తి చేయబడగానే వాటికి ఈ తాంత్రిక ఆరాధనా ఇంద్రజాల స్వభావం వస్తుంది. ఈ స్వభావం సరకుల వుత్పత్తితో అవిభాజ్యంగా కలిసే వుంటుంది"[18]

మనుషులే దేవుళ్ళనీ, దేవతల్నీ వూహల్లో సృష్టించారు. ఆ దేవుళ్ళూ దేవతలూ స్వతంత్ర శక్తులుగా మారి వాళ్ళల్లో వాళ్ళు కొట్టుకుంటారు. కలుస్తుంటారు బంధుత్వం కలుపుకుంటారు. పైగా మనుషులకి ప్రత్యక్షం అవుతూ పూజల్ని చేయించుకుంటారు. భజనలు చేయించుకుంటారు. అలాగే మనుషులు శ్రమశక్తితో సరకుల్ని వుత్పత్తి చేస్తారు. అవి అమ్మకపు సరకులుగా మార్కెట్టులోకి రాగానే సరకుల మధ్య సంబంధాలు ఏర్పడతాయి. వాటిని మనుషులు కొనుక్కోవాలి. ఇక్కడ వుత్పత్తికి సంబంధించిన సామాజిక సంబంధం సరకుల మధ్య సంబంధంగా విపరీత రూపాన్ని పొందుతోంది అమ్మకపు సరకుల వుత్పత్తే దీనికి కారణం. మత ప్రపంచంలో దేవుళ్ళకు అద్భుత శక్తి వున్నట్టుగా సరకుల ప్రపంచంలో అమ్మకపు సరకులకు అద్భుతశక్తి కలుగుతోంది. దీన్నే fetishism అన్నాడు మార్క్స్. ఇది alienation కంటే శాస్త్రీయ

మైన గతితార్కిక భౌతికవాద పునాదిగల భావన. అందుకని alienation వదిలేసి దీన్ని గ్రహిస్తేచాలు. ఈ fetishism అన్నా తప్పుడు చైతన్యం అన్నా ఒకటే. ఏటుకూరి బాగా కష్టపడి కనిపెట్టిన alienation అనేది అనవసరమే కాక అది సాహిత్య విమర్శకి మూలం అనేది అర్థరహితం. ఇది తత్వశాస్త్రానికీ, నైతిక శాస్త్రానికీ, న్యాయశాస్త్రానికీ అన్నిటికీ అన్వయిస్తుంది. పునాది వుపరితల అంశాలు కలిసిన అవయవిలో అవయవంగా పరిశీలించినప్పుడే ఈ fetishism పుట్టటం, పెరగటం, అదృశ్యం కావటం అనే క్రమం అవగాహన చేసుకోగలం. ఏటుకూరి చెప్పిన promotheus కథ కూడా మార్క్సిస్టు పరిభాషలో కేవలం సాహిత్య కళారంగానికి సంబంధించింది కాదు. తమ అవసరాలకి అనుగుణ్యంగా వుపయోగించుకోటానికి ప్రకృతి మీద అధికారాన్ని పొందటానికీ, సమాజాన్ని మార్చటానికి మానవులు చేసే నిరంతర ప్రయత్నాన్ని మార్క్స్ Promethean Urge, promethean mission, promethean mentality వంటి పదబంధాలతో చెప్పాడు. అధిభౌతిక దృక్పథం మనస్సులో పాదుకుపోయిన ఏటుకూరి దీన్ని సాహిత్యంలో స్వేచ్ఛాన్వేషణకి పర్యాయ పదంగా చిత్రించాడు. నా వ్యాసంలోని ఏ ఒక్క విషయాన్నీ ఏటుకూరి ఖండించ లేదు. మార్క్స్ మాటల్ని వాడుకుంటూ మావో ఆలోచనా విధానంవైపు పాఠకుల్ని మళ్ళించటం నా వుద్దేశంగా ముందే ఒక అభిప్రాయం ఏర్పరచుకొని, ఏటుకూరి వ్యాసపరిశీలనకి దిగటంతో బాగా ఇబ్బందిలో పడిపోయాడు. పోనీ, వ్యాసంలో ఎక్కడ నేను మావో ఆలోచనా విధానాన్ని అనుసరించాను, దానివల్ల ఏ విధమైన నష్టం కలిగింది అనే దానికి ఏటుకూరి ఒక్క ప్రమాణం కూడా చూపలేదు. మార్క్సిజం పేరుతో మావోయిజం (ఈ మాటని నేను ఎక్కడా వాడలేదు, మావో ఆలోచనా విధానం అని మాత్రమే అన్నాను) చెపుతున్నాడని వూరకనే ఒక ఆరోపణ లాంటిది చేసి ఏరకమైన నిరూపణా లేకుండా అకారణంగా నా వ్యాసాన్ని నిరాకరించటం ఏటుకూరి చేసిన పెద్ద సాంస్కృతిక నేరం.

9. ముగింపుగా నా నిర్ణయాల్ని క్రోడీకరిస్తాను. గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్పథంనుంచీ సాహిత్యాన్ని పరిశీలించటం గతితార్కిక సాహిత్య భౌతికవాదం అంటారు. తెలుగుకి సంబంధించినంతవరకు ఇది కొత్త భావన, ఇతర భాషల్లో ఎవరయినా చెప్పారో లేదో నాకుతెలీదు. సమాజాన్ని అవగాహన చేసుకొని రచనలు చెయ్యటానికి, సాహిత్య సామాజిక స్వభావాన్ని విశ్లేషించటానికి, సాహిత్య విమర్శకీ, విప్లవ సాహిత్యవుద్యమ నిర్మాణానికి శాస్త్రీయంగా దోహదం

చేస్తుందనే అభిప్రాయంతో ఈ భావనని ప్రవేశపెట్టాను. గతితర్కం నుంచీ భౌతికవాదాన్ని, గతితార్కిక భౌతికవాదం నుంచీ చారిత్రిక భౌతికవాదాన్నీ వేరుచేసే విస్తృతమైన అలవాటుని నివారించటానికి ఇది ప్రయోజనకరం. సాహిత్యాన్ని చారిత్రిక భౌతికవాదంనుంచీ పరిశీలించటమే మార్క్సిస్టు పరిశీలనా పద్ధతిగా తెలుగులో చాలామంది కాదు దాదాపు అందరూ చెప్తున్నారు. అదితప్పు. చారిత్రిక భౌతికవాదం అనేది స్వతంత్రంగా వుండదు. గతితార్కిక చారిత్రిక భౌతిక వాదం మాత్రమే వుంటుందని చెప్పటం నా వుద్దేశం. మార్క్స్, ఎంగెల్స్ లెనిన్ మావోలు సాహిత్యాన్ని గురించి అక్కడక్కడా చెప్పినవిషయాల్ని గతితార్కిక భౌతికవాద మూల సూత్రాలనుంచీ పరిశీలించకుండా మార్క్సిస్టు సాహిత్య విమర్శకి పరమ ప్రమాణాలుగా స్వీకరించే పద్ధతిని అధిభౌతిక, రివిజనిస్టు ధోరణుల్ని ఎదుర్కో టానికి ఇది సాధనంగా పనికివస్తుంది. సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు గతితార్కిక భౌతికవాదం నిరంతరం దృష్టిలో వుండటానికి గతితార్కిక సాహిత్య భౌతికవాదం అనే మాట వుపయోగపడుతుంది. అందుకని ఈ కొత్త భావన అవసరం అని నేను భావిస్తున్నాను. ఈ వ్యాసంలో ప్రతిపాదనా పద్ధతిలోకూడా అంటే వైధానికంలోకూడా శాస్త్రపద్ధతిని అనుసరించడానికి ప్రయత్నించాను. "శాస్త్రం అభివృద్ధిపొందటంలో సిద్ధాంతంలో విప్లవంతోబాటు వైధానికంలో విప్లవం కలిసే వుంటుంది[19]" అనే మోరిస్ దోచ్ వాక్యం ప్రతిపాదనా పద్ధతిలో మార్పు తేవటం అవసరం అనే ప్రేరణని ఇచ్చింది.

ఏ ఒక్క అంశాన్నీ ఖండించలేక పోయినప్పటికీ, తప్పుడు వ్యాఖ్యలు చేసి నప్పటికీ ఏటుకూరి చర్చలో పాల్గొన్నందుకు సంతోషిస్తున్నాను. నేను ఏటుకూరి వాదాన్ని ఎక్కడయినా సరిగా ప్రతిపాదించకుండా ఖండిస్తే నా దృష్టికి తేవచ్చు. పత్రికా ముఖంగానే సవరించు కోటానికి నాకు అభ్యంతరంలేదు. గతితార్కిక సాహిత్య భౌతికవాదాన్ని నిరాకరిస్తూ అరసం చేసిన తీర్మానానికి కారణాల్ని చెప్పటం లో ఏటుకూరి విఫలం అయ్యాడు. కాబట్టి కారణం చెప్పుకో వలసిన బాధ్యత ఇంకా అరసానికి మిగిలేవుంది. మార్క్సిస్టులం అనుకునే వాళ్ళు కారణం చెప్పకుండా దేన్నీ నిరాకరించకూడదు. ఆమోదించకూడదు. అందరికీ చర్చలకి స్వాగతం చెపుతున్నాను.

పాద సూచికలు

1. Engels to P. Mehring, July 14, 1893 : Marx & Engels Selected correspondance, Moscow, 1975 p.p.433-437
2. Engels, anti-dhuring p. 470, Moscow
3. Marx, capital, preface p. 21, Moscow 1977
4. Marx, capital Afterword p. 28, Moscow 1977
5. Marx, A contribution to the critique of the political Economy, p. 204, Moscow 1977
6. Ibid, p. 205
7. Marx, Engels, The German ideology, p. 42 Moscow, 1976
8. Engels, Dialectics of nature, p 178 Moscow 1974
9. Ibid p. 39
10. Lenin, on capital. p. 4 Moscow
11. Oscarwild, preface to the picture of Dorian gray, 1891, quoted in A Modern Book on Aesthetics by Melvin Radar
12. Ibid
13. Engels, Marx & Engels selected correspondance p. p. 433-37, Moscow
14. Rightwing Revisionism today p. 87, progress publishers Moscow 1976
15. Ibid 87
16. Marx, The contribution to the critique of the political Economy p. p. 215-217 Moscow
17. Marx, Engels works - vol I p. 383 Moscow
18. Marx, capital vol I, p. 77 Moscow 77
19. Maurice Dobb - Introduction p 5. A contribution to the critique of political Economy by Marx Moscow 1970

కవితానేత్రి హింస?

20-4-1981

డియర్ వరవరావుగారూ,

భాగల్పూర్ పోలీసులు నేత్రహింసకు పాల్పడ్డారని కవిత్వంరాసి మీకు (కళ్ళు) పంపిస్తే మీరు కవితానేత్రి హింసకు పాల్పడ్డారు. సంహార సంపాదకత్వరీతి మీవద్ద నేర్చుకోవాలనుకుంటున్నాను. కవిత్వాన్ని ఎడిట్ చేయడం మీవద్దనే చూశాను. ఆ కవిత అంత విస్తారంగా రాయడంలో నాకో ప్రత్యేకమైన ఆలోచన ఉన్నది. నేనివ్వ దలచుకున్న సందేశాన్ని పూర్తిగా కట్‌చేసి ఆ కవిత్వాన్ని ఏదో నామీద దయదలచినట్టు ప్రచురించారు. ఎవరో చెప్పగా ఏదో బుక్‌స్టాల్‌లో 'సృజన' చూసి ఈ విషయం తెలుసుకొన్నాను. తీవ్రమైన బాధకుగురై మీకు ఈ ఉత్తరం రాస్తున్నాను.

మీరు నా కవితను చిత్రవధచేసి ప్రచురించిన కారణంగా దాని సమగ్ర స్వరూపాన్ని పాఠకుల, విమర్శకుల దృష్టికి తీసుకువెళ్ళే అవకాశాన్ని కోల్పోయినవాడ్న య్యాను. సంపాదకుడు నిరంకుశుడేగాని ఇలా అనుచిత సందర్భాల్లో కాదని గుర్తించమని కోరుతున్నాను.

భవదీయుడు

'నిజం'

సృజన ఫిబ్రవరి / మార్చ్ 81 సంచికలో ప్రచురించిన 'నిజం' కవిత 'కళ్ళు' సమగ్ర స్వరూపాన్ని పాఠకుల, విమర్శకుల, దృష్టికి తీసుకవెళ్ళే 'కోల్పోయిన' 'అవకాశాన్ని' తిరిగి ఆయనకు కల్పించడానికి ఆయన కవితను యథాతథంగా ప్రచురిస్తున్నాం. ఎడిట్‌చేసి మేం లోగా ప్రచురించిన కవితనుకూడా పక్కపక్కన చదువుకోవడానికి వీలుగా మళ్ళీ ప్రచురిస్తున్నాం. అవసరమనుకున్నప్పుడు 'నిజం' ఆరోపణలకు సమాధానం చెప్తాంకాని ప్రస్తుతానికి చెప్పవలసింది, ఎవరి రచననైనా 'సాహితీమిత్రులు' స్పష్టంగాచదివి, చర్చించి ఎన్నికచేస్తారు. అవసరమని భావిస్తే రచయిత అనుమతితో ఎడిట్‌చేస్తారు. అంతేగానీ ఒక్కవ్యక్తి ఏ నిర్ణయమూచేయడు. 'నిజం' విషయంలో ఎటిట్‌చేసేముందు ఆయనను అడగకపోవడం మేం చేసినతప్పు. ఆ తప్పు ఒప్పుకుంటున్నాం.

కళ్ళు

'నిజం'

దోసిళ్ళనిండా కళ్ళు, కుంచాలనిండా కళ్ళు, గంపలనిండా
కళ్ళు, గోనెలనిండా, బానలనిండా కళ్ళు, లారీలనిండా

కళ్ళు, బోగీలనిండా కళ్ళు, రేవులనిండా విమానాశ్రియాల
నిండా కళ్ళు, గుట్టలు గుట్టలుగా కళ్ళు

కళ్ళు, చూపుల ముత్యాలు పొదిగిన చర్మపు దోనెలు
చర్మపు పత్రాలు తొడిగిన చైతన్య పుష్పాలు
గుండెల సముద్రాల్లోని బాధల బడబాగ్నుల్ని తోడి
బొట్లు బొట్లుగా రాల్చే అనుభూతుల ఏతాలు కళ్ళు

కళ్ళు, కలల కోటలు, కల్పనా శిల్పాలు, ఆలోచనల విలుకాడు
సంధించిన అవగాహనల బాణాలు, మేధోవిద్యుత్తులు
వెలిగించిన మెర్క్యూరీ బల్బులు, చలించే, జ్వలించే
కలతల పర్వతాలు కళ్ళు

కళ్ళు, బాటల బంధువులు, వెలిగే దివ్వెలు, అంధకార
వలయాల్ని ఛేదించే కరెంటు గొడ్డళ్ళు, రగిలే హృదయాల
రాసుల్లోనుంచి పైకెగసిపడి, వర్గకసి ఈ యుగ కర్తవ్య
మని చాటుతున్న జ్వలితాగ్ని గోళాలు కళ్ళు

పెట్టుబడుల కబేళాల్లో స్వంతాస్తుల మృత్యుగుహల్లో
నిముషానికొక చావుకేక, లిప్తకొక శ్రమసమిధ ఆహుతి,
ఈ వ్యవస్థ గానుగ పళ్ళమధ్య నొక్కివేయబడుతూ
రక్తస్వేదాల స్రవంతిని లాభాల కర్మాగారానికి ముడి
సరుకుగా అర్పిస్తూ కలతలనూ కన్నీళ్ళనూ
జాతీయ సంపదగా పంచుకుంటున్న ఈ జాతిహీన
జీవన సజీవ చిత్రాలను నిక్షిప్తంచేసుకున్న
నగ్నజీవన నిధులు కళ్ళు

కళ్ళు రైలింజన్లలో నిరంతరంమండే ఆలోచనలబొగ్గు,
కళ్ళరైళ్ళలో అసంఖ్యాక ప్రయాణీకులు
రెప్పపాటుకాలంలో ఎక్కుతారు దిగుతారు
కొందరు శాశ్వతముద్రలు పయనించే మనిషి
నావకు దారిచూపే చుక్కానులు కళ్ళు

కళ్ళచెట్లకు ఫలించే చూపులపళ్ళు కొత్తకొత్త
దాపల విత్తనాలతో గర్భవతులు కళ్ళయిళ్ళలో
వర్తమాన సామాజిక చేదువాస్తవాల కాపురాలు
భవితవ్యభవ్య పథనిర్దేశిక నియంతలు కళ్ళు

ఈ వ్యవస్థ పుచ్చుదనీ, చచ్చుదనీ గమనించిన దిగంబరులు కళ్ళు
నవసమాజ నిర్మాణానికి సాయుధులవ్వండని రక్తకంఠమెత్తిన
'విప్లవ రచయితలు' కళ్ళు

కళ్ళు నునులేత గగనాల్లోంచి ఎన్నెన్ని సూర్యోదయాలు
కళ్ళు చిరుచిన్న సృష్టిగోళాల్లోంచి ఎన్నెన్ని కొత్త సిద్ధాంతాలు
కళ్ళు సురుచిర సుందర పేటికల్లోంచి ఎన్నెన్ని వాస్తవికతల కుంచెలు
కళ్ళు కమనీయ కాన్వాసుల్లోంచి ఎన్నెన్ని భయంకర వర్తమాన
సామాజిక చిత్రాలు

కళ్ళు కళ్ళు కళ్ళు కళ్ళు, ౬౦ కోట్లజతల కళ్ళు
దోసిళ్ళనిండా కళ్ళు గోనెలనిండా కళ్ళు బాసలనిండా
కళ్ళు లారీలనిండా కళ్ళు బోగీలనిండా కళ్ళు
రేవులనిండా విమానాశ్రయాల నిండా గుట్టలు గుట్టలుగా కళ్ళు
పల్లెలనుంచి పట్టణాలకు, పట్టణాలనుంచి నగరాలకు
నగరాలనుంచి విమానాశ్రయాలకు, నౌకాశ్రయాలకు
ఎడ్లబళ్ళలో మోటారువాహనాల్లో రైళ్ళలో విమానాల్లో
రవాణా అవుతున్నాయి కళ్ళు

X X X X

ఎక్కడికీ నయన ఝరి? ఏ గమ్యానికీ కళ్ళ ప్రవాహం?
అదే ఇంకా నిర్ణయంకాలేదు
న్యాయవాదులు చర్చిస్తున్నారు మేధావులు మీమాంసలు
సాగిస్తున్నారు అంతూలేలూ శివశంకర్‌లూ కంఠబలం
చూపిస్తున్నారు అయితే ఒక్కటి మాత్రం ఖాయం
ఈ కళ్ళకు మరమ్మత్తు అవసరం
అది ఎక్కడ జరగాలి? అమెరికాలోనా?
ఫ్రాన్సులోనా, ఫిలిప్పీన్స్‌లోనా? అదే ఇంకా నిర్ణయంకాలేదు

X X X X

ఈ జాతి చూపుచెడిపోయింది, ఈ జాతి
దృష్టి వక్రంగా నడుస్తోంది, ఈ కళ్ళకు కొత్తచూపు
అతికించాలి పాలకుల స్వార్థాలూ ఫలించే అన్యాయ
అక్రమాల మాగాణుల్లోకి ధనస్వాముల పెట్టుబడులకు
విపరీత లాభాలు రాల్చే శ్రమ దోపిడి కసాయిశాలల్లోనికి
ఈ జాతిని మరింత పకడ్బందీగా, అటు ఇటూ
బెసక్కుండా తీసుకువెళ్ళే నిఖార్సయిన చూపును
ఈ కళ్ళకు అతికించాలి

ఈ చూపుల మూపులపై పత్రికల అబద్ధపు
ప్రచారాల, సెక్స్‌క్రైమ్ చలనచిత్రాల బరువుల్ని
టన్నులకొద్దీమోపారు. ఈ చూపుల మెడలకు
పాశ్చాత్య సంస్కృతీ నాగరికతల గుదిబండల్ని
దిగుమతిచేసుకొచ్చి తగిలించారు. ఈ చూపుల
కాళ్ళకూ చేతులకూ వెట్టిచాకిరి జీవనశైలి
సంకెళ్ళను గట్టిగా బిగించినారు. అయినా లాభం
లేకపోతోంది. ఉన్నవాడు తనకున్న తెలివితేటలతో
"దేవుడు" తనకోసమే రూపొందించి ఇచ్చిన
నైపుణ్యంతో మందిని మోసంచేసి ఎంచక్కా
నిర్మించుకున్న రమ్య హర్మ్యాలనుచూసి ఈ చూపులు
ఓర్వలేకపోతున్నాయి.

అక్కర్లేనంత దరిద్రాన్నీ, పరిమితమైన
వాక్స్వాతంత్ర్యాన్నీ కలగలిపి ఇస్తున్న
ఈ మహత్తర "ప్రజాస్వామ్యాన్ని" పచ్చగా
పదికాలాలపాటు బతకనిచ్చేట్టులేవు ఈ చూపులు.

ఈ చూపులు ఎర్రగా, ఆ చూపులకేకలు
ఇంకాఎర్రగా, ఆ కేకల ప్రతిధ్వనులు ఎర్రెర్రగా,
వాటివెంట వేస్తున్న కోట్లాదిచేతుల ఖడ్గాలు మరీ
ఎర్రగా రాజుకుంటున్నాయి

ఒక్కడి సుఖంకోసం వందమంది శ్రమను
సునాయాసంగా, కళాత్మకంగా దోచిఇచ్చే
లెజిస్లేచర్ల, శాసనాల, న్యాయస్థానాల, రాజ్యాంగ
నిబంధనల నున్ననైన పాకుడుమెట్లతో
నిర్మించిన ఈ సుందర భవంతిని కూలదోయడానికి
ఈ చూపులు "కుట్ర" పన్నుతున్నాయి.

"అందుకే - ఈ కళ్ళను తక్షణం మరమ్మతుచేయాలని
వాటికి "కొత్త" చూపుల్ని అతకాలని ఈ జాతిని
మళ్ళీ మా దారిలోకి తీసుకురావాలి" అందుకే
ఈ నయనచురి, అందుకోసమే ఈ కళ్ళరవాణా,
ముమ్మాటికి అందుకోసమే ఈ నేత్రహింస.
ఇందుకోసం మా పోలీసులు దబ్బణాలు

యాసిడ్‌లా ఉపయోగించి అతినేర్పుగా
వెలికి తీస్తున్నారు కళ్ళను అపార్థం చేసుకోకండి.

త్వరలోనే ఈ కళ్ళకు కొత్త చూపు
వస్తుంది. ఈ దేశంలో శ్రీమదోపిడి స్వేచ్ఛాస్వర్గం
మరి పది కాలాలపాటు పచ్చగా అలరారుతుంది

X X X X
X X X X
X X X X

కళ్ళు – చూపుల ముత్యాలు పొదిగిన చర్మపుదోనెలు
చర్మపు పత్రాలు తొడిగిన చైతన్య పుష్పాలు
కళ్ళను పీకేస్తున్న ఈ వ్యవస్థకు పిచ్చిముదిరింది.
చూపును దోచేస్తున్న ఈ సమాజం సమాధికి చేరువౌతోంది.

కళ్ళు

'విజం'

దోసిళ్ళ నిండా కళ్ళు, కుంచాల నిండా కళ్ళు, గంపల నిండా కళ్ళు, గోనెలనిండా, బానల నిండా కళ్ళు, లారీల నిండా కళ్ళు, బోగీల నిండా కళ్ళు, రేవులనిండా, విమానాశ్రయాల నిండా విగతాశలు కళ్ళు నిరీక్షణలు కళ్ళు.

కళ్ళు, చూపుల ప్రాణాలు పొదిగిన చర్మపు దోనెలు
చర్మపు పత్రాలు తొడిగిన చైతన్య పుష్పాలు
గుండెల సముద్రాల్లోని బాధల బడబాగ్నుల్ని తోడి
బొట్లు బొట్లుగా రాల్చే అనుభవాల ఏతాలు కళ్ళు.

కళ్ళు, కలలతోటలు, కల్పనాశిల్పులు, ఆలోచనల విలుకాడు
సంధించిన అవగాహనల బాణాలు, మేధోవిద్యుత్తులు
వెలిగించిన మెర్క్యూరీ బల్బులు, చలించే, జ్వలించే
కలతల పర్వతాలు కళ్ళు

కళ్లు, బాటల బంధువులు, చీకటి
వలయాల్ని ఛేదించే కరెంటు కత్తెర్లు, రగిలే హృదయాల
రాసుల్లోనుంచి పైకెగసిపడి, వర్గకసి ఈ యుగ
స్వభావమని చాటుతున్న జ్వలితాగ్ని గోళాలు కళ్ళు

పెట్టుబడుల కబేళాల్లో, స్వంతాస్తుల మృత్యుగుహల్లో
నిముషానికొక చావుకేక, లిప్తకొక శ్రమసమిధ ఆహుతి,
ఈ వ్యవస్థ గానుగ పళ్ళ మధ్య నొక్కి వేయబడుతూ
రక్తస్వేదాల స్రవంతిని లాభాల కర్మాగారానికి
ముడిసరకుగా అర్పిస్తూ కలతలనూ కన్నీళ్ళనూ
జాతీయ సంపదగా పంచుకుంటున్న
జీవన సజీవచిత్రాలను నిక్షిప్తం చేసుకున్న
నగ్నజీవన నిధులు కళ్ళు

కళ్ళ రైలింజన్లలో నిరంతరం మండే ఆలోచనల బొగ్గు,
కళ్ళరైళ్ళల్లో అసంఖ్యాక ప్రయాణీకులు
రెప్పపాటు కాలంలో ఎక్కుతారు, దిగుతారు
కొందరు శాశ్వత ముద్రలు. పయనించే మనిషి
నావకు దిక్సూచి కళ్ళు.

కళ్ళ ఇళ్ళల్లో వర్తమాన సామాజిక చేదువాస్తవాల కాపురాలు,
భవితవ్య పథనిర్దేశిక దర్శకులు కళ్ళు
కళ్ళ నునులేత గగనాల్లోంచి ఎన్నెన్ని సూర్యోదయాలు
కళ్ళ చిరుచిన్నసృష్టి గోళాల్లోంచి ఎన్నెన్ని కొత్త దృక్పథాలు

కళ్ళు కళ్ళు కళ్ళుకళ్ళు, 66 కోట్ల జతల కళ్ళు
దోసిళ్ళనిండా కళ్ళు, గోనెలనిండా బానలనిండా కళ్ళు
లారీలనిండా కళ్ళు, బోగీలనిండా కళ్ళు
రేవులనిండా విమానాశ్రయాల నిండా ఆక్రోశాలుగా కళ్ళు
ఆశలుగా కళ్ళు

పల్లెలనుంచి పట్టణాలకు, పట్టణాలనుంచి నగరాలకు
నగరాలనుంచి విమానాశ్రయాలకు, నౌకాశ్రయాలకు
ఎడ్లబళ్ళల్లో, మోటారు వాహనాల్లో, రైళ్ళల్లో
విమానాల్లో రవాణా అవుతున్నాయికళ్ళు.
ఎక్కడికీ నయన ఝరి ? ఏ గమ్యానికీ నేత్ర ప్రవాహం ?

పాలకుల స్వార్థాలు ఫలించే
అన్యాయ అక్రమాల మాగాణుల్లోకి, ధనస్వాముల పెట్టుబడులకు
విపరీత లాభాలురాల్చే శ్రమ దోపిడి కసాయిశాలల్లోనికి
ఈ జాతిని మరింత పకడ్బందీగా, అటూ ఇటూ
బెసక్కుండా తీసుకువేళ్ళే నిఖార్సయిన చూపును
ఈ కళ్ళకు అతికించే విఫల ప్రయత్నాలు

సాహిత్యం - శిల్పం - అనుభూతి

‘సృజన’ ఏప్రిల్ సంచికలో ‘సాహిత్యలేఖలు’ శీర్షిక కిందవున్న సోదుం రామ్మోహన్‌గారి ఉత్తరం చదివాను.

“సంప్రదాయవాదుల్లా వీళ్ళు ‘సాహిత్యానికి హృదయమే కేంద్రం’ ‘సాహిత్యానికి అనుభూతి జీవనధాతువు’ లాంటి అభిప్రాయాలు ప్రకటిస్తూ శిల్పవాద ప్రభావంలో పడిపోయారు” అన్న మధుసూదనరావుగారి వ్యాసభాగాన్ని ఉదాహరిస్తూ, అనుభూతి, శిల్పం అన్నవి రెండూ వొకటేనని ఆయననుకుంటున్నారనీ, అవి వేరువేరనీ వివరించారు రామ్మోహన్‌గారు. ఇందులో, మధుసూదనరావుగారి ‘పొరపాటు’గాక రామ్మోహన్‌గారి ‘పొరపాటే’ వుందని నా ఉద్దేశ్యం. అనుభూతి, శిల్పం అన్నవి వేరువేరు అని తెలీకుండానే అలాఅన్లేదు మధుసూదనరావుగారు. ‘శిల్పవాద ప్రభావంలో పడిపోయారు’ అన్నమాటే, శిల్పవాదులకూ (సంప్రదాయవాదులకూ) అభ్యుదయ రచయితలకూవున్న తేడాని సూచిస్తోంది. సంప్రదాయవాదులకూ, అభ్యుదయ రచయితలకూ కచ్చితంగా వుండవలసినతేడా ‘వస్తువు’ను గురించేనన్నది సాహిత్యాన్ని

ఈ చూపుల మూపులపై పత్రికల అబద్ధపు
ప్రచారాల, సెక్సుక్రైమ్ చలన చిత్రాల టన్నులకొద్దీ బరువులు
ఈ చూపుల మెడలకు
పాశ్చాత్య సంస్కృతీ నాగరికతల గుదిబండలు
ఈ చూపుల కాళ్ళకూ చేతులకూ వెట్టిచాకిరి జీవశైలీ సంకెళ్ళన
అయినా లాభం లేకపోతోంది.
ఒక్కడి సుఖంకోసం వందమంది శ్రమను
సునాయాసంగా, కళాత్మకంగా దోచిఇచ్చే
లెజిస్లేచర్ల, శాసనాల, న్యాయస్థానాల, రాజ్యాంగ నిబంధనల
నున్ననైన పాకుడుమెట్లతో
నిర్మించిన ఈ సుందర భవంతిని కూలదోయడానికి
ఈచూపులు “కుట్ర” పన్నుతున్నాయి

ఈ చూపులు ఎర్రగా, ఆ చూపుల కేకలు
ఇంకా ఎర్రగా, ఆ కేకల ప్రతిధ్వనులు ఎర్రెర్రగా,
వాటివెంట లేస్తున్న కోట్లాది చేతుల ఖడ్గాలు మరీ
ఎర్రగా రాజుకుంటున్నాయి.

అందుకే – ఈ కళ్ళను తక్షణం పరిష్కృతు చేయాలని
వాటికి “కొత్త” చూపుల్ని అతకాలని
ఈ జాతిని మళ్ళీ తమ దారిలోకి తీసుకోవాలని
అందుకోసమే ఈ నేత్రహింస.

అధ్యయనం చేసిన వాళ్ళందరికీ అర్థమయ్యే మొదటిఅంశం. "ఏంచెప్పాడు అన్నదాని కంటే, యెలాచెప్పాడు' అన్నది ప్రధానం శిల్పవాదులకు. 'సాహిత్యానికి హృదయమే కేంద్రం' 'సాహిత్యానికి అనుభూతి జీవధాతువు'లాంటి మాటలుకూడాపూర్తిగా 'వస్తువు'ను తృణీకరిస్తున్నాయి కనుక, శిల్పవాదానికి చెందినవి. "వస్తువుకు శిల్పం కూడా జోడించబడా"లనడంవేరు, పీచుమిఠాయిలా అంతా శిల్పమే వుండాలనడంవేరు.

శ్రీకాంత్‌శర్మ అనుభూతివాదానికీ, రా. రా. 'అనుభూతి'కీ తేడావుందని రామ్మోహన్‌గారు అన్నట్లే శిల్పవాదులకూ, సంప్రదాయవాదులకూ తేడా వుందని పిస్తుంది స్థూలంగాచూస్తే. అయితే; నిజంగా తేడావుందా? సంప్రదాయవాదులు తమ శిల్పాన్ని అలంకారశాస్త్రం కొలతల్లోంచి చూశారు. అంటే, అలంకారశాస్త్ర సమ్మతంగా వుంటే గొప్ప కావ్యంగా భావించారు. వస్తువంటూ లేదని కాదు, వస్తువు ప్రధానంకాదు వాళ్ళకు. 'సాహిత్యానికి హృదయమే కేంద్రం' 'అనుభూతి జీవధాతువు' సిద్ధాంతం కూడా వస్తువును దృష్టిలో వుంచుకోలేదు కనుక, సంప్రదాయవాదానికీ దీనికీ తేడాలేదు. కొలతలపేర్లు మార్పిడి మాత్రం జరిగింది. శ్రీకాంత్‌శర్మ 'అనుభూతి వాదా'నికీ రా. రా. 'అనుభూతి జీవధాతువు'కూ వున్నభేదం కట్టేసి కొట్టడానికీ విడిచి కొట్టడానికీ వున్నటువంటిది. వస్తువు హృదయం అయితే, శిల్పం శరీరం. 'హృదయమే కేంద్రం' సిద్ధాంతం సాహిత్యంలో అసలు హృదయాన్ని నిరాకరిస్తుంది!

ఈ అభిప్రాయాన్ని సమర్థిస్తూ రామ్మోహన్‌గారుఅన్న, 'ప్రాచీనకాలంలోనే కాదు యేకాలంలో అయినా కవిత్వానికి హృదయమే కేంద్రం' అన్న మాటల్ని గురించి ఆలోచిద్దాం. ప్రాచీనకాలంలో మానవుడికీ ప్రకృతికీ వున్న సంబంధం యీనాడు మారిపోయింది. సమాజానికీ వ్యక్తికీ వున్న సంబంధం మారింది. వివరాలెందుకు? యే అంశాన్నుంచీ చూసినా మార్పు కనిపించని సంబంధం అంటూవుండదు. మరి, కవిత్వానికీ హృదయానికీ వున్న సంబంధం, ప్రాచీనకాలానికీ యిప్పటికీ మార్పు లేకుండా వుండటం యెలా సాధ్యమయింది? 'కవిత్వం' ప్రాచీనకాలం నుంచీ వుంది, 'హృదయమూ' వుంది. అయితే, వాటిమధ్య సంబంధం మారలేదా?

ప్రాచీనకవి వొక కావ్యంరాశాడు. తననుకామించిన ఓ పురుషుడికి ఆస్త్రీ లొంగదు. ఒకసారి అడవిలో, మార్గమధ్యంలో తన పిల్లలతోసహా పుట్టింటికి వెళుతున్న ఆమెను వెంబడించి, కాపలాదార్లను చంపేసి, ఆమె కోసం ప్రయత్నిస్తాడు. ఆమె తప్పించుకుని అక్కడేవున్న ఒక సత్రంలోదూరి తలుపులు మూసుకుంటుంది. ఆమె పిల్లలు బయటేవుండిపోయారు. ఆమె తనకు లొంగిపోకపోతే పిల్లల్ని నరికేస్తానని వాడు హెచ్చరించడమేగాక, ఖండించినవాళ్ళ శరీరభాగాల్ని వొక్కొక్కటిగా కిటికీలోంచి లోపలికిపడవేస్తాడు. వాటిని చూస్తూ, హృదయవిదారకంగా యేడుస్తుంది కానీ, వాడికి లొంగదు. చివరికి అంతకఠోరంగా ఆమె తన శీలాన్ని కాపాడుకున్నందుకు

ఈ కావ్యపఠనం 'హృదయకేంద్రా'నికి కావలసినంతపని కల్పిస్తుంది. అయితే, ఆ వస్తువు అందరిహృదయాల్నీ అలాగే కదిలిస్తుందా ? కదిలిస్తే స్త్రీ శీలాన్ని యింత కూ్రరంగా వుండాలని వూహించిన భూస్వామ్య సమాజ భావాలున్నవాడినీ, మార్క్సిస్టు అవగాహనవున్నవాడినీ ఒకేవిధంగా కదిలిస్తుందా ? కవిత్వానికీ హృదయానికీవున్న సంబంధం యిక్కడెందుకు మారిపోయింది ? కారణం, రామ్మోహన్‌గారు Secondary అన్న 'మేధోపరిపాకం' వేరుకావడంవల్ల. అంటే, మేధోపరిపాకం ఆయనన్నట్లు రెండోదిగాక మొదటిదే అవుతోంది. సాహిత్యాన్ని స్వీకరించడానికి 'హృదయం'తప్ప మరోటి యేదీలేనట్లూ, ఆ 'హృదయం'మీద యింకేప్రభావమూ, యేమార్పూ, పడటానికీ వీల్లేనిదయినట్లూ చెప్పడం యెలాకుదురుతుంది ?

శ్రీ శ్రీ 'ఉన్మాది' గురించి యిలాఅన్నారు. 'చదవగానే ఆ కరుణరసంలో తేలిపోతాము తరువాత ఆవ్యక్తి సామాజిక స్థితిని గురించి ఆలోచిస్తాం. ఈ రెండు క్రమాలూ యేకకాలంలో జరిగినా మొదటి అనుభూతికీ, తర్వాత ఆలోచనకూ పని అప్పగించబడింది. ఈ విషయం తెలియడానికి పెద్ద అతీంద్రియజ్ఞానం అక్కర్లేదనుకుంటా' ఇలాంటి అవగాహనకు 'అతీంద్రియజ్ఞానం' (మాటవరసకు అనుందాంచ్చు) యెలా పనికొస్తుందోకానీ మామూలుజ్ఞానాన్నే వుపయోగిద్దాం. 'ఉన్మాది'అన్న శీర్షిక-

'నీవుచూసే వెకిలిచూపూ
నీవుతీసే కూనిరాగం
మాకుతెలియని నీ ప్రపంచపు

మహారణ్యపు చిక్కుదారులు' అన్న శ్రీశ్రీ 'పెట్టుబడిదారీ అస్తవ్యస్త సమాజానికి గురి' అయిన కుర్రవాడికంటే 'సర్రియలిజమే' ధోరణినే యెక్కువగా ప్రదర్శిస్తున్నాడన్న ఆలోచన్ను అలావదిలేద్దాం. హృదయమూ, మెదడూ రెండూ వొకేకాలంలో కదులుతాయేకానీ, ముందు హృదయం ఆచరణలోకదిగితే, ఆ తర్వాత మెదడు కాస్త నింపాదిగా 'ఆక్షన్'లోకి వస్తుందనటానికి ఆధారాలేమిటి ? 'హృదయమూ మెదడూ రెండూకూడా సెంట్రల్ నెర్వస్ సిస్టమ్‌లో భాగం' అయినప్పుడు ఒకభాగం చురుగ్గానూ, మరోభాగం సోమరిగానూ యెలాపనిచేస్తున్నట్లు ?

అలంకార సంప్రదాయవాదులు 'రసం'అంటే శిల్పవాదులు 'అనుభూతి' అన్నారు. కనుక, మధుసూదనరావుగారేకాదు, మార్క్సిస్టు అవగాహనతో సాహిత్యాన్ని సమీక్షించుకోగలిగిన వాళ్ళెవరూ వస్తువును బుద్ధిపూర్వకంగా నిరాకరిస్తున్న యీ మాటల్ని విశ్వాసంతో వల్లించలేరు.

పి. రామకృష్ణారెడ్డి

భద్రత X అలజడి

ప్రతిసమస్య శాంతిభద్రతల సమస్యగా పరిణమిస్తోందని పి. వి. ఒప్పుకున్ వాస్తవం వెనకాల 'ప్రతిపక్షాల' కుట్రవంటి బలమయిన కారణాలున్నాయి. రాజ్యాం యంత్రం తన సాధికృత (Legitimacy)ని కోల్పోతున్నప్పుడు ప్రజలకు ప్రభుత్వా నికీ మధ్యఉండే సమాచార వంతెనలన్నీ ఒక్కొక్కటే కూలిపోతాయి. అశాం ప్రజల కోరికల్ని వెల్లడించే భాష అవుతుంది. చెదిరిపోతున్న శాంతిభద్రతలు రకంగా రాజ్యాంగయంత్రం ప్రజలమీద విధించే నిబంధనల్ని పాటించకపోవడం ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి, వ్యతిరేకించడానికి అది విధించే నియమాలను లక్ష్య పెట్టక పోవడానికీ మధ్య సంస్కరణకు విప్లవానికి, రివిజనిజానికి మార్క్సిజాని మధ్య వున్నంత తేడావుంది. చెదిరిపోయే ఈ శాంతినుండే నూతన సమాజం త రూపం తీసుకుంటుంది. అందుకేకాబోలు హింస చరిత్రకు మంత్రసాని అని మార్క్స్ అన్నాడు. పి. వి. 'మంత్రసాని'ని వ్యతిరేకించడం జననాన్ని నిరోధించడానికే. గ కాలపు తిరుగుబాటు ఆయనకీవాళ నిర్మాణాత్మకంగా కనిపించడం వెనకాల వే సంవత్సరాల హిందూ పాలకవర్గాల చరిత్రవుంది. మరేదో అవతారాన్ని తోసిపారేసి బుద్ధుడ్ని పదవ అవతారం చేసింది హిందూమతం. (చేతకాలేదుగాని ఏసుక్రీస్తుని పదకొండవ అవతారం చేసేవాళ్ళే అన్నాడు గురజాడ!) ఇటీవలి చరిత్రలో చిట గాంగ్, మన్యం తిరుగుబాటులనుండి తెలంగాణ సాయుధపోరాట రజతోత్సవాల్లో ఇందిరా, వెంగళరావులు పాల్గొనేదాకా ఈ హిందూతత్వమే పనిచేస్తుంది. 'మనుజేశ్వ రాధముల నీసడించి' కష్టాలపాలైన 'సత్కవి'ని తర్వాతకాలంలో ఏ హిందూ తాత్విక ధోరణి తనవాడుగా చేరుకుందో ఆ ధోరణే రెండుదశాబ్దాలు గడవకుండానే దాశరథిని ఆస్థానకవిని చేసుకుంది. తిరుగుబాటును సాంప్రదాయంలో కలిపేసుకోవడమే హిందూ పాలకవర్గాల ప్రధాన తాత్వికఆయుధం. శంకరపిళ్ళై పేర్కొన్న 'మనజాతి మన కిచ్చిన పోరాట వారసత్వాన్ని తమది చేసుకోవాలని పాలకవర్గాల ప్రయత్నం. మన సంపదను అనుభవించేవాళ్ళే, మనశ్రమను దోచుకునేవాళ్ళే మన జ్ఞానాన్ని అనుభ వించడానికీ, మన చరిత్రను దోచుకోవడానికీ ప్రయత్నిస్తారు. ఆ దృష్ట్యాచూస్తే పి. వి. తరతరాల హిందూపాలకవర్గాల నిరంతర సాంప్రదాయాలకు ఆధునిక సిద్ధాంత కారుడు, స్వచ్ఛమైన హిందూ మేధావి.

22 ఏప్రిల్ 81

— ఒక పాఠకుడు.

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

Working Editor : Varavararao

SRJANA Telugu Monthly July 81 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.

AN APPEAL

In response to the letter printed in the Economic and Political Weekly (May 28) CPDR is undertaking a drive to gather funds for the ADILABAD TRIBAL RELIEF FUND. This is meant for the families of those who were killed and injured in the brutal massacre of tribals at Indervalli on April 20.

The tribals of Adilabad, A. P., like those in other parts of our country (and they constitute a significant percentage of the population) are among the most oppressed in our country. They live in extreme poverty, with barely one meal a day, with inadequate clothing and shelter, exploited and cheated. The laws meant for tribal welfare have only entangled them further in the net of sharks. The tribals of Adilabad were only organising themselves to demand their minimum rights, when their organisation, the Girijan Ryotu Coolie Sangham, was denied permission to hold a Conference, and they were shot down by the police in a pre-planned massacre, and their leaders arrested.

Two independent investigations by civil liberties' organisations-PUDR and APCLC, concluded that more than 60 tribals were killed and several hundred injured. The injured are unable to seek medical aid at government centres due to the continueing harrasement and repression by the police. They are in great distress. Unless immediate help is given, their losses will multiply.

To show your solidarity for their struggle, to help them regain their confidence and to help them get medical care, a donation from you will go a long way.

Kobad Ghandy, Madhav Sathe
June 10, 1981 Secretaries,
COMMITTEE FOR THE PROTECTION OF DEMOCRATIC RIGHTS, BOMBAY

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs 20-00